ఆంధ్ర సచిత్ర వార

పత్రిక




35 పైసలు

స్వాతంత్ర్య దినోత్సవ సంచిక 19-8-66



గంగాధర్
గాలిబండ మీద 'గాజులమ్మ' వెలసింది
గాజులమ్మ పాదాలు గాజులమ్మే తన కన్నీటితో తడిపింది!
బాబూమూవీస్
కన్నెమనసులు
దర్శకుడు ఆదుర్తి సుబ్బారావు నిర్మాత సి. సుందరం సంగీతం మహదేవన్
NVKB



కర్షకునిగా మొలకరించి
కవిగా పల్లవించి
భాగవత సుధలందించిన.
భారత్ ఫిలిమ్స్
భక్తపోతన
నిర్మాత
టి.విశ్వేశ్వరరావు
స్క్రీన్‌ప్లే & డైరెక్షన్
జి.రామినీడు
నవయుగ
రచన: సముద్రాల రాఘవాచార్య : మాటలు: దాసం గోపాలకృష్ణ : సంగీతం: ఎస్. రాజేశ్వరరావు
కెమెరా: సి. నాగేశ్వరరావు : కళ: రాజేంద్రకుమార్ B.A., : నృత్యం: పసుమర్తి : కూర్పు: హనుమంతరావు

ఆంధ్ర సచిత్ర వారపత్రిక

1966 దీపావళి కథల పోటీ

ఎప్పటివలే ఈ సంవత్సరం కూడా 'ఆంధ్ర సచిత్ర వారపత్రిక దీపావళి కథల పోటీ' నిర్వహించబోతున్నదని తెలుపటానికి సంతోషిస్తున్నాము. కథకులందరూ ఎప్పటివలే మాతో సహరించి ఈ పోటీని జయప్రదం చెయ్యగలరని ఆశిస్తున్నాము.

మొదటి బహుమతి రు. 1100

రెండవ బహుమతి రు. 750

మూడవ బహుమతి రు. 500

నిబంధనలు

1. కథలు స్వంత రచనలయి ఉండాలి. ప్రతి కథతోనూ రచయిత అది తన స్వంత రచనేననీ, దేనికీ అనువాదంకాని, అనుసరణకాని కాదనీ హామీరాసి పంపాలి. ఈ హామీ వేరే కాగితంమీద కాక కథ వ్రాతప్రతిమీదనే రాసిఉండాలి.
2. కథలు తెలుగువారి జీవితానికి సంబంధించి ఉండాలి.
3. వ్రాత ప్రతిమీద 'దీపావళి కథల పోటీకి' అని స్పష్టంగా రాయాలి. కాగితానికి ఒకవైపు మాత్రమే సిరాతో రాయాలి. రచయిత పేరు. పూర్తి చిరునామా కూడా వ్రాత ప్రతిమీద స్పష్టంగా రాయాలి. రచనలు 12 అరఠావు (ఎక్సర్సయిజు నోట్‌బుక్ పేజికి రెండురెట్లు) పేజీలకు మించరాదు.
4. కవరుమీద ''దీపావళి కథల పోటీకి'' అని స్పష్టంగా రాయాలి. పోటీకి రచనలు 'సంపాదకుడు, ఆంధ్ర సచిత్ర వారపత్రిక, 7, తంబుచెట్టివీధి, మద్రాసు—1' కి పంపాలి.
5. పోటీ గడువు తేది 31—9—1966. ఆ తేదీ తర్వాత మా కార్యాలయం చేరిన కథలని మామూలుగా ప్రచురణకి పరిశీలిస్తాము.
6. పోటీలో బహుమతి పొందిన కథలని 'దీపావళి ప్రత్యేక సంచిక'గా 11—11—1966తేదీ కల ఆంధ్ర సచిత్ర వారపత్రికలో ప్రచురిస్తాము.
7. పోటీ తుది నిర్ణయం ఆంధ్ర సచిత్ర వారపత్రిక సంపాదకుడిదే. ఈ విషయమై ఎటువంటి ఉత్తర ప్రత్యుత్తరాలూ జరపటానికి వీలులేదు.
8. వ్రాతప్రతులని ఎటువంటి సందర్భంలోనూ తిప్పి పంపటానికి సాధ్యంకాదు పోటీలో పాల్గొనే వారు తమ రచనలతో తపాలా బిళ్లలు అతికించిన స్వంత చిరునామాకల కవర్లు పంపనవసరంలేదు.
9. పోటీలో బహుమతి పొందక మామూలుగా ప్రచురణకి స్వీకరించిన కథల రచయితలకి ఆవిషయం ప్రచురించేముందు తెలుపుతాము.

ఉత్తరాలు

కథలు

ఎమ్. ఆర్. ప్రసాద్‌గారు రాసిన "వెగసిన నీడలు" చాలా బాగుంది. ఇది జరిగిన కథవలెయున్నది. రాధలాంటి వాళ్ళు ఇవాళ్రేపు చాలామంది ఉన్నారు.

వేంకటేశ్వరమ్మ, మణి (వైజాగ్)

* *

22—7—66 సంచికలో 'వెగసిన నీడలు' కథ చదివాను బాగుంది. కాని 'వెగసిన' అంటే అర్థం ఏమిటి? అది అచ్చు పొరపాటా? లేక ప్రత్యేకంగా ఏమైనా అర్థం వుందా? అది ఏ ప్రాంతాలలో వాడుకగా వున్నమాటో తెలియజేస్తారనుకుంటాను.

వి. సుబ్బలక్ష్మి (కాకినాడ)

*కథ చదువగా, ఎగసిన—ఎగిసిపోయిన—నీడలు—అనడానికి మారు వెగసిన అని కొన్ని ప్రాంతాల యాస వాడినట్లు తోస్తుంది. కాని, ఎగయుకు వెగయు అనడం అతి గ్రామ్యంగాఉంటుందిగనుక, వెగచునుంచి వచ్చిన మాట అని సమర్థించవచ్చు. వెగచు ధాతువు=విచారించు, ఏడ్చు అనే అర్థాలలో వుంది. కనుక వెగచిన నీడలు—విచారపడిన నీడలు—అనే అర్థం చెప్పి సమర్థిస్తే, భావుకతతోవుంటుంది.

తి. రా.

కార్టూన్

5—8—66 ఆంధ్ర వార పత్రిక నందు 17 వ పేజీలో మన్న శ్రీ బాబుగారి కార్టూనులోని మాటలు తెలుగు చిత్రాలను చాలా కించ పరచు చున్నవి. ఎన్నో మంచి తెలుగు చిత్రాలున్నా నేడు ఇటువంటి మాటలు నుపయోగించి తెలుగు చిత్రాలను హీన పరచటం చాలా శోచనీయం.

దయ చేసి ఇక మీదట ఇటువంటి కార్టూనులను ప్రచురించ కుందురని మా కోరిక.

ఎ. జగన్నాధరావు (పలమనేరు)

వ్యాసాలు

దక్షిణాది వనితలు గురించి ముక్తాంకర్ వ్రాసిన అభిప్రాయములు సమంజసముగా లేవు. వారు వ్రాసినది 1966 ఆడవారికి తగదు. అటువంటి వ్యక్తులు పాతవారు.

టి. గోపాలకృష్ణారావు (మద్రాసు)

ఆంధ్రసచిత్ర వారపత్రిక

వ్యవస్థాపకులు :
దేశోద్ధారక కాశీనాథుని
నాగేశ్వరరావు పంతులుగారు

శుక్రవారం : 19—8—'66
పరాభవనామ సం॥ నిజ శ్రావణ మాసం శు॥ తదియ
సంపుటము : 58 సంచిక : 51
స్థాపితము :
1908

*

ముఖ్య సంపాదకుడు :
శివలెంక శంభుప్రసాద్

*

సంపాదకుడు :
శివలెంక రాధాకృష్ణ

*

ఆంధ్రపత్రిక కార్యాలయము
7, తంబుచెట్టి వీథి, మద్రాసు-1

క్రొత్తరేట్ల ననుసరించి 14—1—1966 మొదలు ఆంధ్రసచిత్ర వారపత్రిక చందా వివరాలు.

భారతదేశం

	పోస్టుద్వారా రూ. పై.
సంవత్సర చందా	19.25
6 మాసముల చందా	9.62
3 మాసముల చందా	4.80

ఇతరదేశాలకు
ఓడమీద (Sea Mail)

సంవత్సర చందా	32.00
అర్థసంవత్సర చందా	16.00

మనలో మాట

ఆంధ్రసచిత్రవారపత్రిక పాఠకులందరికీ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు.

* * *

మన ప్రధానమంత్రిని గురించి శ్రీ వి. ఎస్. సుక్తాంకర్ ఒక వ్యాసం రాశారు. దానిని మధ్యపేజీలలో వేశాము. ఆమెనిగురించిన మరొక వ్యాసం ఇదే సంచికలో చూడవచ్చు...

* * *

ఇది స్వాతంత్ర్య దినోత్సవ సంచిక కాబట్టి శ్రీ ఊమెన్ ప్రత్యేకంగా ఒక కార్టూన్ వేసి పంపారు. ఈ సందర్భంలో జరిగే విమర్శలు, వ్యాఖ్యానాలు, పరిహాసాలు సహృదయంతో స్వీకరించటం అవసరం!

*

సాధారణంగా రచనల పోటీ ప్రకటన పడగానే కొందరు పాఠకులకి విచిత్రమయిన సందేహాలు చాలా కలుగుతూ ఉంటాయి! పోటీ 'నిబంధనలు' జాగ్రత్తగా చదివితే ఇటువంటి సందేహాలు కలగటానికి అవకాశం ఉండదేమో! అయితే, 'సిరారంగు' గురించి అడిగేవారు ఉంటారు కాబట్టి, మామూలుగా రచనలకి వాడే సిరా ఏదయినా వాడవచ్చునని సూచిస్తున్నాము!

పోటీ కథలు ఎన్ని పేజీలు ఉండాలని కొందరు పాఠకులు రాశారు. ఆ విషయాన్ని ఈ వారం వేసిన ప్రకటనలో చేర్చాము...

రచయితలకు మనవి

మా కార్యాలయం చేరే ప్రతిరచనతోనూ దానిరచయిత గాని, రచయిత్రిగాని అది తమ స్వంతరచనేననీ, దేనికీ అనుకరణ కాదనీ హామీ వ్రాసి పంపాలి. ఇటువంటి హామీలేని రచనలను ప్రచురణకి స్వీకరించలేము.

సంపాదకుడు
ఆంధ్రసచిత్రవారపత్రిక

విషయానుక్రమణిక

ముఖచిత్రం : రచన కె. శేషగిరిరావు.


సభ్యుల బలంపై ప్రభుత్వం
అవిశ్వాస తీర్మానాన్ని
సాధించింది.
మేం సంఖ్యాబలంతో విజయాన్ని సాధించాం
నైతిక విజయం
మీకు కావాలంటే తీసుకోండి
సంజీవయ్య
మీరు చర్చకు వచ్చే మార్గం ఇది కాదు
పార్లమెంటులో
కాశ్మీర పాఠ్య
పుస్తకాల
విషయంపై
దాడి
కాశ్మీర్
పాఠ్య పుస్తకాలపై
పార్లమెంటులో గుసగుసలు
భరించరాని
వయ్యాయి


18 సంవత్సరాల స్వాతంత్ర్యానంతరం భారతదేశం
ఆహారంకోసం అలమటించకు అమెరికా నుంచి వస్తున్నాయి ఓడలు.
ప్రజలు
రూపాయి విలువ తగ్గింపు గురించి భయమేం అక్కరలేదు మనకి అప్పులివ్వడానికి అమెరికా ఉందిగా!
పన్నుల గురించి దిగులెందుకు పెట్టుకోవద్దు గొప్ప వసుధైక రాడవలతాలన్ని ప్రవేశపెడుతున్నాను
పన్నుల భారం
షు వవబద్ధం చెప్తున్నావే, ధరలేం పెరగలేదు
లంచగొండితనం ఉందని చెప్తున్నావ్ మరి దాన్ని రుజువు చెయ్యగలవా?
ప్రజలు బాధపడుతుంటే ప్రధాని పెద్దకారుకు బదులు చిన్నకార్లో ప్రయాణం చేస్తూ దాన్ని పంచుకుంటున్నారు

ఇందిరాగాంధీ



ప్రధానమంత్రి ఇందిరాగాంధీ

భారతదేశానికి స్వాతంత్ర్యం లభించిన సమయంలో పరిస్థితులు మొత్తంమీద అనుకూలంగానే ఉండేవి అనవచ్చు. ఒక పాకిస్తాన్ తప్ప మనకి పెద్ద శత్రువులంటూ ఉండేవారుకారు. రష్యా, అమెరికాల మధ్య ప్రచ్ఛన్నయుద్ధం మన విదేశ విధానానికి బాగా తోడ్పడింది. చైనా కమ్యూనిస్టులకిందికి రావటం, భారతదేశం ఆసియాలోకెల్లా పెద్ద ప్రజాస్వామ్య రాజ్యం అవటం మరింత తోడ్పడ్డాయి. ఇక దేశం లోపల స్వాతంత్ర్యోద్యమంలో వచ్చిన ఉత్సాహం, కాలగమనంలో తమ స్థైర్యాన్ని నిలుపుకున్న పరిపాలనా సంస్థలూ విదేశాలు చేసిన సహాయానికి మంచి దోహదం కల్పించాయి. 1962లో చైనా భారతదేశంమీదకి దాడీ చేసేదాకా పెద్ద ప్రమాదమేదీ కన్పించలేదు. కాని, ఆ తర్వాత మాత్రం ఈ దేశం పరిస్థితి క్రమంగా దిగజారిందనే చెప్పాలి. విదేశాల్లో మన పలుకుబడి తగ్గటమేకాక అంతరంగికంగానూ మన ఆర్థిక వ్యవస్థలోని బలహీనతలు బాగా బయట పడిపోయాయి. దేశరక్షణకి కావలసిన ఏర్పాట్లకి తట్టుకోగలమా అనే అనుమానం కలిగించాయి. 1964లో జవహర్‌లాల్ నెహ్రూ మరణించే సమయానికి ఈ అనుమానం బాగా బలపడే అవకాశాలు చాలా ఉండేవి. తర్వాతి ప్రధానమంత్రి శ్రీ లాల్ బహదూర్ నాయకత్వం దృఢంగా ఉండదేమోనని ఎందరో భయపడ్డారు. వీరు అంతగా భయపడిఉండనవసరంలేదని పాకిస్తాన్‌తో జరిగిన యుద్ధం సూచించింది. ఈ యుద్ధం మన ఆర్థిక పరిస్థితిని మరింత కించపరచిందని నిస్సందేహంగా చెప్పవచ్చు. రష్యా నాయకుల ప్రోత్సాహంతో పాకిస్తాన్—భారత దేశాల మధ్య సంధి కుదురుతున్నదనగా లాల్‌బహదూర్ మరణించారు. కొన్ని విచిత్రమయిన కారణాలవల్ల వారి తర్వాత శ్రీమతి ఇందిరా గాంధి కాంగ్రెసు పార్టీ నాయకత్వం వహించారు. ప్రధానమంత్రి అయిన మొదటి రోజుల్లో అన్ని వర్గాలవారూ ఆమెపట్ల మంచి అభిమానం చూపారు. కొందరు ఆమె తాము చెప్పినట్లు విని, తమకి విధేయురాలుగా ఉంటుందని ఎదురు చూసినట్లు తోస్తుంది. అయితే, చైనాదాడి తర్వాత భారతదేశం పలుకుబడికి కలిగిన నష్టం, ఈ దాడివల్లనే కాక పాకిస్తాన్‌తో చేసిన యుద్ధంవల్ల ఆర్థిక పరిస్థితి మీద పడిన భారం, ఆహారం వస్తువుల కొరతలు, ప్రపంచ రాజకీయాలలో కలిగిన కొన్ని మార్పులు— ఇవన్నీ శ్రీమతి ఇందిరాగాంధి కర్తవ్య నిర్వహణానికి, అడ్డుపడ్తాయనే అనిపించేట్లు చేశాయి. ఆమెమాత్రం మన దేశం ఎదుర్కొంటున్న సమస్యలని పరిష్కరించే నిమిత్తం అతి ధైర్యంగా కొన్ని నిర్ణయాలకి వచ్చి, వాటిని అమలు పరచటానికి ప్రయత్నించారు. ఇంకా ప్రయత్నిస్తున్నారు. ఆహార సమస్య పరిణామాలని గుర్తించి అమెరికా సహాయాన్ని నిర్మొహమాటంగా కోరారు. కొంతకాలంగా క్రమంగా విషమిస్తూ వస్తున్న పారిశ్రామిక ఉత్పత్తి అధికం అయేందుకు కావల్సిన విధానాలని పరిశీలించటం ప్రారంభించారు. విదేశాల మైత్రికోసం అమెరికా, ఈజిప్టు, యుగోస్లావియా, రష్యా మొదలయిన దేశాలు పర్యటించారు. అన్నిటికన్నా ముఖ్యం, కొన్ని మారకం రేట్లలో రూపాయి విలువ తగ్గించటానికి వెనుదియ్యలేదు. ఆమె విధానాలు అందరికీ సంతృప్తి కలిగించకపోవటంలో ఆశ్చర్యంలేదు. మత సిద్ధాంతాలని ప్రతిపాదించేవారు వాటిని కొన్ని అవసరాలనిబట్టి ప్రతిపాదిస్తారు. ఎప్పుడో ఒకప్పుడు, ఆ మతాభిమానులే కొందరు ఆమత సిద్ధాంతాలని సంస్కరించటానికి పూనుకున్నప్పుడు తక్కినవారు మరికొందరు ఈ సంస్కరణలని ఎదిరిస్తారు. మనకన్నా అన్ని విధాలా అభివృద్ధి చెందినవని అందరూ అంగీకరిస్తున్న కొన్ని పాశ్చాత్య దేశాలలో వ్యక్తిపూజ (కనీసం రాజకీయాలలో) అతి స్వల్పంగా ఉండటం గమనించదగ్గ విషయం. విన్‌స్టన్ చర్చిల్ రాజకీయాలనుంచి ఎలా నిష్క్రమించవలసివచ్చిందో గమనించతగ్గదే. హిట్లర్ వంటి 'మహా నాయకులు' ఈ ప్రపంచాన్ని ఎలా హింసించారో వేరే వివరించ నవసరం లేదు. నేడు, చైనాలో మావ్‌ట్సె టుంగ్‌కి జరుగుతున్న పూజ లోకజ్ఞానంకలవారందరికీ బాధ కలిగిస్తుంది. మనదేశంలో ఒక శతాబ్దంలో నిజంగానే మానవీయులయిన మనీషులెందరో జన్మించారు. కాని, అధికారంలో ఉన్నవారిని పూజించటం మన జాతీయ వ్యసనం. పూజ, దూషణ. వీటి రెండిటినీ అదుపులో ఉంచుకుని సిద్ధాంతాలకోసం దేశశ్రేయస్సుని త్యాగం చెయ్యటానికి ఇష్టంలేని రాజకీయవేత్తలని సహనంతో అర్థం చేసుకొనటం వివేకవంతుల కర్తవ్యం. ●

వెలుగు బాట



డి. కామేశ్వరి

ఆలసటగా కుర్చీలో వెనక్కి వాలి కళ్ళు మూసుకొన్న డాక్టరు కృష్ణవేణి బయట స్ప్రింగ్ డోరు దగ్గిర అడుగుల చప్పుడికి కళ్ళు తెరిచి అటు చూసింది. తెల్లటి పాంటు క్రింద నల్లని మెరిసిపోయే బూట్లు [illegible] చెప్పులు, జరీ అంచు! ఎవరో క్రొత్త జంట కాబోలు!

తలుపు మీద వేలితో తట్టినట్లవగానే కుర్చీలో సర్దుకుని కూర్చుంటూ, "కమిన్" అంది.

తలుపు త్రోసుకుని ముందు అమ్మా వెనకనే వచ్చిన అతనిని చూడగానే కృష్ణవేణికి పిడుగు పడినట్టయింది. మధు!.....

అతను కూడ డాక్టరుని చూసి త్రోటుపడి, ఉన్నచోటే కొద్దిక్షణాలు నిల్చిపోయి, ఏంచేయాలో తోచని దిగ్భ్రమతో చూడసాగాడు. ఇద్దర్నీ వింతగా మార్చి మార్చి చూడసాగింది, పార్వతి.

ముందుగా కృష్ణవేణి తేరుకుని చూపులు తప్పించి 'కూర్చోండి' అంది. అతను మరలాగ కదిలి కూర్చున్నాడు.

దడదడలాడే హృదయాన్ని, వణుకుతున్న చేతిని అదుపులో పెట్టుకోవాలని వ్యర్థ ప్రయత్నం చేస్తూ, కాగితం కలం తీసుకుని "ఏమిటి కంప్లెయింట్?" అని పార్వతిని అడిగింది. ఆమె కొంచెం సిగ్గుపడి మధు కేసి 'మీరు చెప్పం'డన్నట్టు చూసింది.

అంతవరకు యీ లోకంలో లేనట్టు ఏదో ఆలోచిస్తూ, ఎదురుగ్గా గ్లాక్సో బొమ్మ కాలెండరు చూస్తూ కూర్చున్న అతను భార్య స్పర్శకి ఉలిక్కిపడి ఆమె వంక చూసి, సాధ్యమైనంత మామూలుగా "నాలుగో నెల అనుకుంటున్నాం..నెలరోజుల నించి బ్లీడింగ్ అవుతూంది..యిదివరకు రెండుసార్లు యిలాగే అయి, ఎబార్షన్, అయింది.. ఇది మూడోసారి..." అన్నాడు. ఏదో పాఠం అప్ప చెప్పినట్లు.

తలవంచుకొని కేసు హిస్టరీ రాసుకుంటున్న కృష్ణవేణి అతన్ని ఆపి "సరే, మిగతా వివరాలు ఆమె నడిగి తెలుసుకుంటాను" అంటూ కుర్చీ నెట్టి లేచి పార్వతిని లోపలికి రమ్మని సైగ చేసింది.

పెద్ద తుపానులో చిక్కుకున్నట్లు ఉక్కిరిబిక్కిరి అయింది కృష్ణవేణి. అతను యిక్కడికి ఎలా రాగలిగాడు? పైన తగిలించిన బోర్డు చూస్తే తనెవరో తెలిసేదిగా? తెలిసే వచ్చాడా? ఎంత ధైర్యం? ఎంత సిగ్గులేని తనం? తెలిస్తే ఆ తడబాటు ఎందుకు? ఆమెకేం పాలుపోలేదు. తను మధు భార్య ఆరోగ్యం కోసం కృషి చేయడం అంటే, ఏదో భయంకరమైన వ్యంగ్యం దాగున్నట్టుంది అందులో.

తిరిగి గదిలోకి వచ్చాక "మూడోమాసం నించి గర్భం ఎదగకుండా కృశించింది. వీలయినంత త్వరలో తీసేయాలి! అతని వంక చూడకుండానే చెప్పింది కృష్ణవేణి.

"మీ కెప్పుడు వీలుంటుందో చెప్పండి?" అతను కాస్త ఆగి అన్నాడు.

"సారీ! నాకు వీలవదు. ఇంకెవరి దగ్గిర కయినా తీసుకెళ్లండి" పొడిగా అంది. అతను మాటల కోసం వెదుక్కుంటూ గోడ మూల కేసి చూశాడు

"మీరు స్పెషలిస్టు కాబట్టి, కుదర్చగలరన్న ఆశతో వచ్చాను. దయచేసి కాదనకండి."

"నేను స్పెషలిస్టునయినా, నా పరిమితులు నాకున్నాయి. నేను చేయలేని పని చెయ్యమని బలవంత పెట్టకండి."

"మీరు చేయగలరన్న నమ్మకం నాకుంది.. మీరు ప్రయత్నించండి. ఫలితానికి బాధ్యత నాది. రోగం నయం చేయడం డాక్టరుగా మీ విధి. దయచేసి మీ కర్తవ్యం మీరు నెరవేర్చండి."

కృష్ణవేణి రోషంగా తలెత్తి చూసింది. "నా విధులు, బాధ్యతలు ఇంకొకరు చెప్పక్కర లేకుండానే నాకు తెలుసు...అందరి, అన్ని రోగాలు నయం చెయ్యమని నన్నిక్కడ యెవరూ జీతం యిచ్చి కూర్చోపెట్టలేదని, నేను చెయ్యాలనుకొన్నది, చేయకపోవడానికి, నాకుపూర్తిగా హక్కు, అధికారం ఉన్నాయని, చదువుకొన్న మీకు తెలిసుండాలి... నన్నింక యెక్కువగా మాట్లాడించకండి"

పార్వతి అయోమయంగా యిద్దరి వంకా చూసి, లేచింది.

"యిదే మీ ఆఖరి నిర్ణయమా?" నిలబడ్డూ అడిగాడు అతను.

కృష్ణవేణి తలదించుకుని మాటలాడ లేదు.

"కృష్ణవేణి! ప్లీజ్, బాగా ఆలోచించు, వ్యక్తిగతమైన అభిప్రాయాలు ఎలావున్నా ఒక డాక్టరుగా నీ బాధ్యత గుర్తుంచుకో"

"దయచేసి, వెంటనే వెళ్ళండి" విసురుగా, తీవ్రంగా అంది. మరోక్షణం నిలబడితే ఆమె కన్నీళ్ళు చూడవలసి వస్తుందన్న అనుమానం తగలగానే బయటికి వెళ్ళిపోయాడతను.

ఉస్సురుమంటూ అలా కుర్చీలో వెనక్కి వాలిపోయింది కృష్ణవేణి. ఏ ఆలోచనా తోచని శూన్యంలో మెదడు నిండినట్టుయింది. చేతుల్లో తల యిరికించి కాసేపు కూర్చుని, యింక కూర్చోలేక, నర్సుని పిలిచి చూస్తుండమని చెప్పి యింట్లోకి నడిచింది.

బీరువా తెరిచి, తను పదిలంగా భద్రపరుచుకున్న ఉత్తరం ఒకటి బయటికిలాకి

"నా వేణూ,

ఉత్తరం రాయాలన్న ఆరాటంతో కాగితం, కలం తీశాను గాని, ఏం రాయను? ఎలా రాయను? నా ప్రపంచం అంతా నిండిన నిన్ను ఉత్తి గీతల కూర్పులనిపించే, యీ మాటలు ఎన్నని రాసి వ్యక్తం చేయను? ఎన్నోమాటలు గుర్తుకొస్తాయి. కాని నా మెదడ్ని క్షణం విశ్రాంతి యివ్వకుండా నమిలే అనుభూతులన్నీ చెప్పాలంటే, కొత్త మాటలు పుట్టాలనిపిస్తుంది! ఏదో ఆవేదనగా వెతుకతాను. యింకా మంచివి, యింకా ఉన్నతమైనవి దొరకాలని! చివరికి ఏదో రాసి తృప్తిపడక ఏమిటో యీ బాధ అనుకుంటాను!

కృష్ణా! నీకూ అలాగే వుంటుందా? రాత్రి వెన్నెల్లో చల్లగాలి మల్లెల గుబాళింపు అందిస్తూంటే, మన యీ ఒంటరితనంలోని దైన్యాన్ని ఎవరో నిర్దయగా గుర్తుచేసి ఆడుకుంటున్నట్టు నీకూ అనిపిస్తుందా? ఏమో! యీ బాధలు నీకు లేవేమో! యీ వేదన అంతా నాకేనేమో!

ఒకోసారి నా తీయని ఊహల్లో నీ రూపం ఎలా మెదుల్తుందో తెలుసా? తెల్లగా వెలిగే మబ్బుల చాందినీ క్రింద, డాబా మీద నువ్వు, కనురెప్పల చాటున వెన్నెల దాచుకొని, నిశ్చింతంగా నిద్రపోతూంటావు. అణగక ఎదురు తిరిగే నీ ముంగురుల్తో చల్లగాలి ఆడుకుంటుంది. తీయని ఊహలో తేలే సన్నని నవ్వులో విడిన పెదాల్ని తేలిగ్గా ముద్దు పెట్టుకుంటుంది! ఏదో చెప్పలేని బాధతో నలిగిపోతాను నేను!

మూడు నెలలకోసారి యీ శలవులు లేకపోతేనేం. లేకపోతే నీ సాన్నిధ్యంలో ఏ స్వర్గాల అంచుల్లో తేలిపోయేవాణ్ణి! ప్రస్తుతం అన్నీవుండి, ఏమి లేని బికారిని నేను! నాయీ దీనస్థితి మీద జాలిపడి, నువ్వొక నాలుగు మాటలు రాస్తే, నేనెంతో అదృష్టవంతుడినని మురిసిపోతాను.

రాస్తావు గదూ! నీ

మధు.

ఆ ఉత్తరం అప్పటికెన్ని వందలసార్లు చదివిందో! అది మొదటిసారి చదివినపుడు కలిగిన తీయని అనుభూతి మాటల కతీతం. అందుకే ఎన్నేళ్ళయినా, ఆ ఉత్తరం యింత వరకు భద్రంగా దాచుకుంది. అది రాసిన మనిషి కనుమరుగయినా, ఆ మాటలు తల్చుకున్నప్పుడల్లా గిలిగింతలు పెడతాయి.

విసురుగా ఆ సిలిరంగు కాగితాన్ని ముక్కలు ముక్కలుగా చింపేసి కిటికీ బయటికి విసిరింది కృష్ణవేణి. ఆ ముక్కలన్నీ పురుగుల్లా ఎగిరిపోయాయి. వాటి వంక అలాగే చూసి, అపుకోలేని ఆవేదనతో మంచం మీద పడి తలగడలో మొగం దాచుకుంది కృష్ణవేణి. మనసు కళ్ళెంలేని గుర్రంలా ఎటో పరుగెడ్తూంది. వద్దనుకున్నా, ఎన్నో సంఘటనలు, మాటలు కళ్ళెదుట మెదుల్తున్నాయి.

మెడిసన్‌లో చేరేముందు, అసలు మెడిసన్ చదివే ఉద్దేశంలేని కృష్ణవేణి యూనివర్శిటీలో ఆనర్సు చదివేది. ఎప్పుడూ ఎవరితో మాట్లాడకుండా, చదువు తప్పించి మరే వ్యాపకం ఎరగని మధు ఆమె నాకర్షించేడు. కావాలని అతనిని పరిచయం చేసుకుంది. పరిచయం చేసుకున్నాక, పరువు మర్యాదలు, సభ్యత సంస్కృతి ఉట్టిపడే అతని నడవడి, మాటలు ఆమెని మరింతగా సన్నిహితం చేశాయి. చదువులో అందరి కంటె ముందువుండి, అందరివన్నన, గౌరవం పొందినా, ఎంతో వినయంగా నెమ్మదిగా నడుచుకునే అతని మంచితనానికి ఆకరితురాలైంది. అతన్ని తలుచుకు ఏవేవో కలలు గంది. ఏడాది తిరిగేసరికి ఇద్దరూ అతి సన్నిహితులై ఒకరి పట్ల ఒకరు అభిమానం, అనురాగం పెంచుకున్నారు. ఎన్నో కలలు గన్నారు! ఏన్నో ఊహించుకున్నారు భావిని గురించి!......కాని,......

ఆనర్సయి యింటికి వెళ్ళిన తర్వాత ఒక్కనెలవరకే అతన్నించి తను వింది. ఆ తర్వాత ఏమైందీ, ఎక్కడున్నదీ ఏమి తెలుసుకోలేకపోయింది. ఎంతో వ్యథతో, ఆవేదనతో అందరిని అడిగింది. స్వయంగా ఉత్తరాలు రాసింది. ఆ నిర్లక్ష్యానికి తట్టుకోలేక ఆమె మనసు గాయపడింది.

తర్వాత ఎవరో చెప్పారు. అతను పెళ్ళి చేసుకున్నాడని, ఏదో ఉద్యోగం చేస్తూ హాయిగా వున్నాడని!

ఎంత పెద్దయెత్తున ఆశల కోటలు కట్టుకుంటే, అవి కూలిపోయాక అంత ఎక్కువగాను బాధపడాల్సి వస్తుంది. ఆమె పనీ అంతే అయింది. అతని వినయం, మంచితనం, మరోవిధంగా, అతని మెత్తదనం, అనుకున్న దానికి కట్టుబడి పరిస్థితుల కెదురీద లేకపోవడం లాంటి బలహీనతలని తెలుసుకోలేకపోయింది! ఫలితం, ఆ లోతైన గాయం యింతవరకు మానలేదు. మాన్పుకోడానికి ప్రయత్నమూ చేయలేదు. ఒకప్పుడు తన జీవితాన్ని వెలిగించిన అన్నిరంగులూ కడుగుకు పోయి, అచేతనం, నిర్లిప్తం అయిన స్తబ్దత నిండింది. దీనికి విరుగుడు తనకి తెలియదు. చదువులో గతం మరవడానికి మెడిసన్‌లో చేరింది. డాక్టరై యథోచితంగా ప్రజాసేవ చేస్తుంది.

వెలుగుబాట

దేన్లోనూ ఆమెకు మనశ్శాంతి దొరక లేదు. కావల్సినంత ధనం, పేరు ప్రతిష్ఠలు. దేనికీ కొదవలేకపోయినా ఏదో అసంతృప్తి.

తల్లి రోజుకి అధమం ఒకసారైనా బ్రతిమాలుతుంది, పెళ్లి చేసుకోమని! తనని యీ వృద్ధాప్యంలో కష్టపెట్టవద్దని కన్నీరు పెట్టుకుంటుంది. 'నిన్నింతవరకు చదివించడం నాదే తప్పు. ఏదో సరదా పడుతున్నావని ఒప్పుకోడం నాదే బుద్ధితక్కువ' అని నిష్ఠూరం ఆడుతుంది...కాని పెళ్లాడి యీ నిర్లిప్తత మరొకరికి పంచాలా? అన్న బాధ తనని నూగదాన్ని చేస్తుంది. యీ శూన్యతలోనే ఏదో తృప్తి, ఆనందం ఉన్నాయనిపిస్తుంది. ఒక బలహీనుడి అశక్తతకి బలిగా తనని తాను అర్పించుకోడంలో ఏదో విధంగా తన పగతీరినట్టు ఒక సంతృప్తి!

* * *

పన్నెండు గంటల వేళ, పేషెంట్లు దాడి తగ్గాక, తీరుబడిగా మెడికల్ జర్నల్ తిరగేస్తున్న కృష్ణవేణి అడుగుల చప్పుడుకి తలెత్తింది. అతను! కలవరపాటు అణుచుకుని 'ఏమిటన్నట్టు?' ప్రశ్నార్థకంగా చూసింది.

"నీతో..మీతో..కొన్ని విషయాలు చెప్పాలని వచ్చాను" అతి ప్రయత్నం మీద అన్నాడు మధు.

"నాకేం వినడానికి ఓపిక, తీరుబడిలేవు. ఏదయినా పేషంటు గురించి అయితే తొందరగా చెప్పండి"

"మీతో వ్యక్తిగతంగా కొంచెం సేపు మాట్లాడాలి" సందేహిస్తూ అన్నాడు అతను

"నాకు వీలుగాదు. మీరు వెళ్లచ్చు"

"కృష్ణా! నీ కోపం నా కర్థమవుతుంది. కాని నేను చెప్పేది విన్నాక నువ్వేమన్నా అనుకో. నా బాధ్యత తీర్చుకున్నానన్న తృప్తి నాకు దక్కనీ, కనీసం యీ అవకాశం యియ్యమని ప్రార్థిస్తున్నాను!" జాలిగా అన్నాడు.

"మిష్టర్! ఎవరనుకున్నారు? ఏమిటా అతి చనువు?" రోషంగా అడిగింది కృష్ణవేణి.

జాలిగా, దయనీయంగా చూసే ఆకళ్లు మొదటినించీ తనని మాయ చేసిన ఆ అమాయకత ఆమెని తిరిగి వశం చేసుకున్నాయి. కాని....ఆమె ఓడిపోదల్చుకోలేదు.

"ఎందుకింకా నిలబడతారు, మీరు వెళ్లండి." పుస్తకంలో మొగం దాచుకుని కంపించే కంఠంతో అడిగింది. మరి కొద్ది క్షణాలకి పుస్తకం పైనించి చూస్తే అతనక్కడ లేదు. బల్ల మీద తల ఆన్చుకుంది కృష్ణవేణి. ఆగకుండా కన్నీళ్లు ధారకట్టాయి. ఆపుకోవాలని ప్రయత్నము చేయలేదు

అయిదేళ్ల తరువాత యీ కలయిక కృష్ణవేణిని అతిగా కదిలించింది.

పనిలో నిరుత్సాహం, అనాసక్తత యెక్కువయ్యాయి. ప్రతి విషయం పైన, ఎదురైన ప్రతి మనిషి పైన, తన పైనే ఏదో విసుగుదల! తనకి తెలియకుండానే వశం చేసుకుంటున్న యీ అవలక్షణాలని తప్పించుకోడానికి ఆమెకి ఒక్కటే మార్గం కనిపించింది.

కొన్నాళ్లు యీ మనుష్యులకి, పరిసరాలకి, దూరంగా ఎక్కడి కన్నా వెడితే ఆ ఒంటరితనలో ప్రశాంతతలో ఉపశమనం దొరుకుతుందేమో! కాని చాలకాలం యీ ఆలోచన ఆలోచనగానే ఉండిపోయింది.

రెండేళ్ల తరువాత ఆమె, కొన్నిరోజులు విశ్రాంతి కోసం రకరకాల చోట్లు తిరిగింది. పట్నాల కన్న, పల్లెటూర్లలో తనకి కావల్సిన ప్రశాంతత దొరుకుతుందన్న ఆశతో దూర దూరపు బంధువులందర్నీ గుర్తు చేసుకుని చిన్నచిన్న గ్రామాలన్నీ తిరిగింది. ఎక్కడన్నా వాతావరణం తనకి నచ్చితే, అక్కడే స్థిరపడాలని ఆమె సంకల్పం.

అది మరీ పల్లెటూరు. కాలిబాట తప్పించి మరే దారీలేదు ఆ ఊరు చేరడానికి. లేదంటే పడవలో ప్రయాణం చేయాలి. ఆ ఊర్లో దగ్గిర బంధువు లుండడమే కాకుండా, తన చిన్ననాటి స్నేహితురాలు శ్యామల ఉంది.

ఒక సాయంకాలం శ్యామల బలవంతాన, ఆ ఊరు చేరిన రెండురోజులకి, గుడిలో భగవద్గీత ఉపన్యాసానికి వెళ్లింది కృష్ణవేణి. ఆమెకి వేదాంతం వినాలని ఉత్సాహం లేదు. తీరా అక్కడికి వెళ్లి చూశాక తన కళ్లు తను నమ్మలేకపోయింది మధు!!

కాషాయబట్టలు, గుండ్రని తల, నిర్లిప్తంగా ప్రశాంతంగా చూసేకళ్లు ఆ ఆకారం మొదట గుర్తుపట్టలేకపోయింది. కాని ఆ మొగంలోని సౌమ్యం, ఆ గొంతులో వినయం, సాత్వీకం ఆమెకి బాగా పరిచయం. చాలసేపు ఏం తోచని స్థితిలో కూలబడిపోయింది. ఉపన్యాసం సాగిపోతూంది. ప్రజలు ఆనందిస్తున్నట్టు తలలూపుతున్నారు. ఆమెకి మాత్రం అతను చెప్పే

(45 వ పేజీ చూడండి)


ఆమె
పరీక్షల్లో
ఫెయిలయ్యేదే!
ఆమె క్లాసంతకీ ఫస్టుగా వచ్చేది.
కాని తరువాత పరీక్షలు దగ్గర
పడినప్పుడు ఓపికలేక
చదువు వెనక్కు
పెట్టింది.
ఆమెను డాక్టరుకు
చూపించేము. సరియైన
పోషణలేక పిల్లలు
కోల్పోయిన శక్తిని
మళ్లీ పొందకపోతే
యిలాగే అవుతుందని
ఆయన చెప్పేరు.
Horlicks
డాక్టరు చెప్పినట్లే
ఆమెకు హార్లిక్స్
యిచ్చేము. త్వరలోనే
ఆమె మళ్లీ ఓపికతో
చదువులో పడింది. ఫస్టుగా
ప్యాసయింది కూడా!
పిల్లలు త్వరగా శక్తిని పోగొట్టు
కొంటారు. వారికి పోషణ
కలిగించే ఆహారము ఇవ్వక
పోతే త్వరలోనే అలసిపోయి
శ్రద్ధగా ఉండరు. హార్లిక్స్
అదనపు శక్తిని కలిగిస్తుందని
డాక్టర్లకు తెలుసును. అది
పూర్తి మీగడగల పాలు,
గోధుమపిండి మరియు
మాల్టెడ్ బార్లీలతో తయా
రయింది. శ్రమగా ఉన్న
సమయాల్లో హార్లిక్స్ ఎంతో
సహాయపడుతుంది.
హార్లిక్స్
అదనపు శక్తిని
కలిగించును!
Horlicks

అర్ధాంగి

ఉన్నవ విజయలక్ష్మి



జరిగిన కథ

సుదర్శనానికి వైద్యంచేయడానికి అయిష్టాన్ని ప్రదర్శించిన డాక్టర్ హరీష్‌ను ఒప్పిస్తుంది మంజుల. హరీష్ తల్లి మంజుల పుట్టినరోజు కానుకగా నిర్మల్ పెయింటింగ్ ప్రెజెంట్ చేస్తుంది. హరీష్, మంజుల పరిచయాన్నిచూసి అసూయపడ్తాడు శంకరం. గోపాలం సుదర్శనం గురించి చెప్పిందంతా విన్నతర్వాత ఆయనపై అసహ్యం కల్గినా తన ధర్మాన్ని నిర్వర్తించడానికే నిశ్చయించుకుంటాడు హరీష్.

4

"పైకి యింత అమాయికంగా కనిపించే సుదర్శనంగారి వెనక, యింతటి పాషాణమూర్తి దాగివున్నాడుకదా. మరి మంజులమాటేమిటి? ఆమె కూడ ఆ కోవకి చెందినదేనా?.....అసలు మేనమామ చేస్తున్న దురంతాలు మంజులకి తెలుసా? తెలిసినా అనవసర విషయాల్లో తన జోక్యం ఎందుకని ఉపేక్షించి వూరుకుంటోందా? లేక ఆయన్ని సరిదిద్దాలనే కోరిక ఉన్నా ఆ అధికారం చనువు ఆమెకి లేవా? ఎంత చనువు లేకపోయినా ఇంతటి అక్రమాలు జరుగుతూంటే కనీసం ఎదిరించటానికి, వారించటానికి ప్రయత్నం అయినా చేయవచ్చునే! ఏమో......భోగ భాగ్యాలమీది మోజుతో జానకీదేవిలాగే ఈ అమ్మాయి కూడ ఆయన్ని ప్రోత్సహిస్తోందేమో.

ఛ. మంజుల అలాంటిదికాదు. ఒక్కసారి ఆమె కళ్లల్లోకి చూస్తేచాలు ఆమె మనస్సులో ఎలాంటి మాలిన్యం లేదని తెలిసిపోతుంది. ఏవిధంగానూ ఎదుటి మనిషిని నొప్పించలేని సౌజన్యమూర్తి— తెలిసో తెలియకోవచ్చి వీళ్లల్లో పడ్డందుకు తన అవసరం గడుపుకుని చేతనైతే వాళ్ల కేదైనా సహాయం చేసి మర్యాదగా తప్పుకోడంకంటె ఆమె చేయగలిగిందేమీలేదు. అలాంటి విషయాల గురించి మాట్లాడగలిగే వయస్సు కూడ ఆమెకిలేదు.

అయినా నా కెందుకీ ఆలోచనలన్నీ. మంజుల సౌజన్యమూర్తి అయితే నాకేం? బ్రహ్మరాక్షసి అయితే నాకేం? తనయింట్లో ఏం జరుగుతోంది తెలుసుకోలేని, ఏ మంచి చెడ్డలు గ్రహించుకోలేని శుద్ధ మొద్దు అయినా మహా మేధావి అయినా నా కొకటే. ఆమె గంగిగోవు అయినా, గోముఖ వ్యాఘ్రమైనా నాకు ఒరిగేది ఏమీ ఉండదు..."

"అంతేనా? నిజం చెప్పు. మంజుల అంటే నీ కెలాంటి ఆకర్షణాలేదూ? వెర్రి

వాడా. నిన్న నువ్వే విందుకు మధ్యపెట్టుకోవాలనుకుంటావు?" మనస్సు గోముగా అడిగింది.

సమాధానంగా అతని అంతరంగం ఒక తీయటి వూహాతో నిండిపోయింది. ఆభావం వలయాలుగా అతనిచుట్టూ తిరుగుతూ అనిర్వచనీయమైన మధురానుభూతిలో మైమరపింపజేసింది ఒక్క క్షణం. అంతే... మరోసారి ఆ మాధుర్యాన్ని ఆస్వాదించాలనుకునేలోపలే ఏదో అజ్ఞాతశక్తి ఎదురుగా నిలబడి,

"ఏమిటీ తెలివి తక్కువతనం. అది అసంభవం అని తెలిసి కూడ నువ్వు అలాంటి ఆశలు పెంచుకుంటావు? అర్హతలేని అదృష్టంకోసం పాకులాడితే చివరికి మిగిలేది పరాభవమే. అలాంటి పరిస్థితి ఎప్పుడూ కల్పించుకోకు. నీలో వివేకం అనేది ఏమైనా వుంటే ముందునించీ జాగ్రత్తగా ఉండు.", అంటూ హెచ్చరించింది.

అంతే.ఆ మధురభావన తీయనివూహలు, అన్నీ మాయం అయిపోయాయి. సలసల కాగుతున్న కాలకూట విషం తన విషవాయువులతో అంతరంగాన్ని నింపివేసింది. క్షణం క్రితం ప్రేయసి పొందుకోసం నిరీక్షిస్తూ నిలబడిన సుందర ఉద్యానవనం, ఒక్కసారిగా భయంకరమైన మహారణ్యంగా మారిపోగా ఆ ప్రేయసి దూరంనించే అవహేళనా పూర్వకంగా తన వైపు చేయి వూపుతూ దూరంగా ఇంకా దూరంగా వెళ్లిపోతోంది.

"భగవంతుడా! నీ చర్యల కర్థం ఏమిటి? తప్పు చేసినవాళ్లని శిక్షిస్తున్నావు. సరే... మరి నేనేం పాపం చేశానని నా కీ శిక్ష? ఈ జన్మలో నేను తెలిసీ ఎలాంటి పాపమూ చేయలేదు. క్రితం జన్మలలో చేసినపాపం నన్ను యింకా వెంటాడుతోందా? ఆ పాపానికి పరిహారం, ఈ శిక్షకి అంతం అంటూ లేనేలేదా?......" తనమీద తనకే నో విధమైన జాలి అసహ్యం కలిగి, లోకంమీద, చుట్టూవున్నమనుష్యులమీద చెప్పలేని కసి? ద్వేషం పెరిగి, అవి తీర్చుకునేమార్గం కనిపించక, ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో వెనక్కి వాలిపోయాడు.

సినీమా మధ్యలో రెండు మూడుసార్లు హరీష్‌ని పలకరించడానికి ప్రయత్నించిన గోపాలం అతను అన్య మనస్కంగా ఉన్నాడని గ్రహించి వూరుకున్నాడు.

సినీమా అయిపోయి అవతలకి వస్తూంటే, "మీరు చాల అప్‌సెట్ అయినట్టున్నారు. మన అంచెనాలు తప్పు అయిపోయాయి అని తెలియగానే డిసప్పాయింట్ అవడం సహజం. అందులో ఎంతో అమాయకులు అనుకుంటున్నవాళ్లు విష కుంభాలుగా రూపు దిద్దుకుంటే చూసి భరించగలగడానికి కొంత టైమ్ పడుతుంది." అని ఆదరంగా డాక్టరు చేయి నొక్కి శలవు తీసుకోబోతుంటే, "రండి, డ్రాప్ చేస్తాను" అంటూ కారు దగ్గరికి నడిచాడు హరీష్.

గోపాలాన్ని దింపేసి యాదాలాపంగా సుదర్శనంగారి యింటివైపు చూశాడు. అలా చూస్తూనే కారు స్టార్టుచేసి స్లోగా పోనిచ్చాడు. ఎడంవైపు గదిలో లైటు వెలుగు కనిపించింది. శ్రద్ధగా పుస్తకాలు ముందు పెట్టుకుని చదువుకుంటున్న మంజుల రూపం మనస్సులో మెదిలింది— అందం, చదువు, సంస్కారం, సహృదయం అన్నీ వున్న మంజుల—ఎవరో ఆ అదృష్టవంతుడు? బాధగా నిట్టూర్చి, ఎంత త్వరగా వీలయితే అంత త్వరగా ఆ పరిసరాలనుంచి దూరంగా పారిపోవాలన్నట్టు ఒక్కసారిగా కారు వేగం హెచ్చించాడు.

* * *

పరీక్ష లయిపోయాయి. బెడద తీరిపోయింది అన్న విశ్రాంతితో మధ్యాహ్నం పడకేసిన మంజులవళ్లు విరుచుకుంటూ కళ్లు తెరిచింది. ఇంకా నిద్ర చాలదన్నట్టు బద్ధకంగావుంది. కళ్లు మండుతున్నాయి. ఇంకాస్సేపు పడుకుందామని, మళ్లీ కళ్లు మూసుకోబోతూ యదాలాపంగా చేతివాచీకేసి చూసుకుంటూనే ఒక్కసారి ఉలిక్కిపడి, 'అయ్యబాబోయ్ అయిదయిందా. అత్తయ్య చూడలేదేమో. లేకపోతే ఈ పాటికే మంగళాష్టకం చదివేది' అనుకుంటూ ఒక్క ఉదుటునలేచి, ఎవరికంటా పడకుండా గబగబా బాత్‌రూమ్‌లోకి వెళ్లి మొహం కడుక్కువచ్చింది. టవల్‌తో తడి మొహం తుడుచుకుంటూ వంటింట్లోకి వెళ్లి చూసింది. తనకోసం గ్లాసులోపోసి మూతపెట్టి వుంచిన కాఫీ చప్పగా చల్లారిపోయింది. అది వెచ్చచేసుకునే ఓపికలేక అలాగే రెండు గుక్కల్లో తాగేసింది. ప్రొద్దున్నెప్పుడో పదిగంటలకి తిన్న అన్నం మధ్యాహ్నం నిద్ర కూడ పోవడంతో కడుపు మరీ పక పకలాడిపోతోంది. అరగ్లాసుడు చల్లటి కాఫీతో అది శాంతపడలేదు.

"హాయిగా సుశీల వాళ్లింటికి వెళ్తే వాళ్ల తమ్ముడిచేత ఏమైనా తెప్పించుకోవచ్చు. లేకపోతే ఇద్దరం కలిసి హాయిగా హోటల్‌కే వెళ్లవచ్చు" అనుకుంటూ గదిలోకివచ్చి గబ గబా జడ అల్లుకుని చీర మార్చుకుంది. అలంకరణ పూర్తయి ఇంక బయలుదేరుదామనుకునేంతలో, చిందులు తొక్కుకుంటూ శంకరం ఇంట్లో ప్రవేశించాడు. అతని మొహం జేవురించివుంది. అవమానాగ్నితో దహించుకుపోతున్నాడు. వచ్చినవాడు తిన్నగా మంజులగదిలోకే వెళ్తూ,

"రాణిగారు. ఎక్కడికో ప్రయాణం అయినట్టున్నారే? తెలివితక్కువ వెధవని ఎక్కడికి అని అడగటం ఏమిటి? ఏ పార్కులోనో ఆ డాక్టర్ని కలుసుకుని మీ ప్రేమ కలాపాలు అయింతరువాత మెల్లిగా వాడికారులో ఇంటికి చేరతావు."

"బావా!!" ఆశ్చర్యం అసహ్యం పోటీపడి గొంతు నొక్కేస్తూంటే ఎలాగో శక్తి నంతా కూడదీసుకుని శక్తికొద్దీ అరచింది. హఠాత్తుగా శంకరం ఇలా విరుచుకుపడటానికి కారణం ఏమిటో ఆమెకి తెలియటంలేదు. ఆలోచించే శక్తిలేదు.

"ఏం? ఎందుకలా గొంతు చించుకుంటావు? నే నన్నదాంట్లో తప్పేమైనా ఉందా?"

"లేదూ మరి!"

"అవున్లే. నువ్వు సిగ్గు విడిచి తిరిగితే లేని తప్పు నేను పైకి చెప్తేనే వచ్చింది. నీ కోసం కాకపోతే వాడు కానీ ఫీజు అయినా కిట్టింపు కాకుండా మన యింటి చుట్టూ ఎందుకు తిరుగుతున్నట్టు?"

"చూడత్తయ్యా, బావ ఎలాంటివి కల్పిస్తున్నాడో?" వస్తున్న దుఃఖాన్ని దిగమింగుతూ పిల్ల గొడవ విని అప్పుడే గదిలోకి వస్తున్న జానకి దగ్గరగా వెడుతూ అంది.

"ఇంకా అమాయకత్వం నటించి మమ్మల్ని నమ్మించాలనుకోడం ఉత్త తెలివి తక్కువతనం. నీ వెడు వడతని పట్టే ఇచ్చే బుజువులు ఎదురుగా కనిపిస్తున్నప్పుడు అబద్ధం ఆడి తప్పించుకోవాలనుకోడం సిగ్గు చేటు."

మంజుల కళ్లు రోషంతో ఎరుపెక్కాయి. పెదిమలు అదరసాగాయి. శరీరం తన స్వాధీనంలో లేనట్టుగా అయిపోయింది.

"మాట్లాడవేం? మీ యిద్దరిమధ్యా ఏమీ లేకపోతే నీకు బహుమతి ఇచ్చేటంత చనువు పరిచయం అతనికి ఏలావచ్చాయి? నువ్వు చేస్తున్నది తప్పు అని అనుకోబట్టే

ఆ బహుమతి నా కంటె ఒడినరికి స్నేహితు రాళ్ళు ఇచ్చారని అబద్ధం చెప్పావు...... దీనికేం చెప్తావు? ఇంకా నా మాటలు అబద్ధం అని కొట్టి పారేయాలనుకుంటు న్నావా?" తనదే పై చెయ్యి అయిందన్న మాతో నిలదీసి అడుగుతున్నాడు శంకరం.

అంతవరకూ వీళ్ల సంభాషణవింటూ బొమ్మలా నిలబడిపోయిన జానకి, "ఏమిటి శంకరం? అసలేం జరిగింది? బహుమతి ఏమిటి?" అంది ఆశ్చర్యపోతూ. తను పెంచు కున్న ఆశలన్నీ అడుగంటిపోతాయేమోనన్న భయం ఆవిడ గుండెల్లో గూడు కట్టుకోడం ప్రారంభించింది.

"ఆమధ్య ఎప్పుడో, అదే మంజులపుట్టిన రోజున తను సాయంకాలం ఎక్కడికో వెళ్లింది జ్ఞాపకంవుందా? బాగా చీకటి పడినదాకా యింటికి రాలేదు. ఇంత ఆలశ్యం అయిం దేమా అని భయపడుతూ నేను వీధి గుమ్మం లోనే నిలబడ్డాను. రాణిగారు నవ్వుకుంటూ రిక్షా దిగింది. చేతిలోవున్న ప్యాకెట్టు ప్రాణంలా చూసుకుంటూ. కుతూహలం అణుచుకోలేక అది తీసుకొని చూశాను. మాట యాభై రూపాయలు ఖరీదుచేసే పెయింటింగు—దానిని ఆక్రితం సాయంత్రం నేనూ నా స్నేహితులూ నో షాపులో చూశాం. ఎవరో ప్రత్యేకం ఆర్డరిచ్చి చేయించుకున్నారని షాపు అతను చెప్పాడు— తన స్నేహితులు పుట్టిన రోజు కానుకగా యిచ్చారని మంజూ చెప్తే నిజమే కాబోలు అందరూ కలిసి యిచ్చారనుకున్నా.

దాని అసలు బండారం ఇందాక బయట పడింది. మళ్లీ ఏదో కొనాలని మా ఫ్రెం

అర్ధాంగి

డ్సంతా కలిసి మళ్లీ అదే షాపులోకి వెళ్లాం.

బొమ్మలుచూస్తూ, అదివరకు చూపిం చిన గీతోపదేశం చిత్రం అయనెవరో తీసు కెళ్లారా?" అని అడిగాడు మా స్నేహితుడు. యధాలాపంగా.

"అది అప్పుడే తీసుకెళ్లిపోయారు. అంతే కాదు. వాళ్ల వాళ్లెవరికో అది ప్రెజెంట్ చేసేశారుట. మళ్లీ యింకొకటి కావాలని ఆర్డరిచ్చి చేయించుకు తీసుకెళ్లారు" అని సగర్వంగా సమాధానం చెప్పాడు వాడు.

"వాళ్లెవరో నీకు మంచి బిజినెస్సే ఇస్తున్నారు" అన్నాడు మా స్నేహితుడు. అంతలోనే అందరం కలిసి వాళ్ల పేరు చెప్పుమని అడిగాం.

"అతను డాక్టర్ హరీష్‌కుమార్. ఈ వూరే." అన్నాడు షాపు అతను.

నా తలలో ఏదో అనుమానంలాంటిది తళుక్కుమంది. అయినా అదేదో నిర్ధార ణగా తేల్చుకోవాలని...

"రోజూ బోలెడు మంది కొంటూ వుంటారు. వాళ్లందర్నీ నువ్వు ఎలా జ్ఞాపకం పెట్టుకుంటావు. అది ఆర్డర్ చేసింది అతనుకాదు" అన్నాను.

"మా రెగ్యులర్ కస్టమర్సుని గుర్తు పెట్టుకోలేముటండీ. అయినా మీ అను మానం ఇప్పుడే తీరుస్తాను" అంటూ ఆర్డర్ బుక్కుతీసి చూపించాడు.

నా కళ్లు చీకట్లు కమ్మినట్లయింది. మంజూ ఇంతకి తెగిస్తుందని, అసలు ఇన్ని తెలివి తేటలు ఉన్నాయని నేనెనాడూ అను

కోలేదు. హఠాత్తుగా నా అంచనాలు తప్పు అని తెలియడంతో నోట మాట రాలేదు. నా స్నేహితులందరికి నా పరిస్థితి తెలిస్తే నన్ను దద్దమ్మని చేసి తాటాకులు కడ తారని, తెలివిగా ఏదో మాట్లాడేసి, కొంచెం సేపయింతర్వాత వసుందని తప్పించుకు వచ్చాను......


ఇప్పుడు చెప్పు. "సవాల్‌చేస్తూ మంజుల వంక చూశాడు.

చెప్పడానికి ఏమీ లేదన్నట్లు మొహం ప్రక్కకి తిప్పేసుకుంది. మంజుల. జానకి వూరుకోలేదు. "ఈమధ్య కొన్నిరోజులుగా మంజుల ప్రవర్తనలో మార్పు కనిపెడు తూనే ఉన్నాను. అయినా ఏదో చిన్నతనం అని చూసీ చూడనట్లు వూరుకున్నాను. ఎలాగూ పరీక్షలయిపోయాయి కదా ఆ మూడు ముళ్లూ వేయించేస్తే కుదురుగా ఉంటుందనుకున్నాను. ఆ డాక్టర్ని దృష్టిలో పెట్టుకునే కాబోలు ఈ పెళ్లి తనకి ఇష్టం లేదని తెగేసి చెప్పింది ప్రొద్దున్న....

చెప్పు. నువ్వా డాక్టర్ మోజులో పడే కదా చిన్నప్పటినుంచీ అనుకుంటున్న బావని చేసుకోనంటున్నావు. ఇప్పుడు నీ కళ్లకి బావ ఆనటంలేదు. అప్పుడే పెద్దదానవయి పోయావు. మా అవసరం కూడా తీరి పోయింది. ఎలాగయినా మాట్లాడతావు. ఏమై యినా చేస్తావు....." అడుగులు చప్పుడయి ముగ్గురూ బయటికి చూశారు. వరండా దాటి లోపలికి వస్తున్నాడు హరీష్. ఎప్ప టిలా మంజుల ఎదురువెళ్లి అతన్ని మేన మామ దగ్గరికి తీసుకు వెళ్లలేదు. ఏదో జరగకూడనిది జరుగుతున్నట్లు అందరూ తలలు వంచుకుని నిలబడిపోయారు. హరీష్ కూడ ఎవర్నీ పలకరించకుండా లోపలికి సుదర్శనంగారి గదిలోకి వెళ్లిపోయాడు.

ఆయనా ఏదో బాధ పడుతున్నట్లు ఆలోచిస్తున్నట్లు పరధ్యానంగానే ఉన్నారు. అదివరకెప్పుడూ డాక్టర్ని చూడగానే చిరు నవ్వుతో పలకరించి ఆప్యాయంగా మాట్లాడే సుదర్శనంగారు ఆనాడు ముభావంగానే ఉన్నారు. హరీష్ కూడా డ్యూటీ చేస్తు న్నట్లు ఆయనని పరీక్షించి అవసరం అయిన ప్రశ్నలు వేస్తున్నాడు. చెపులు మాత్రం ఆయన చెప్పింది వినటంలేదు. అలాగే చూడటం అయిందనిపించి ఇవతలికి వచ్చేశాడు.

వరండాలోకివస్తూ అప్రయత్నంగానే తల తిప్పి మంజుల గదిలోకి చూశాడు—తను లోపలికి వెళ్తున్నప్పుడు మంచం దగ్గర తల



పంచుకుని చీరకొంగు మెలిపెడుతూ నిల బడిన మంజుల ఇప్పు డక్కడలేదు. శంకరం, జానకి కూడ లేరు.

"ఈసారి రేప్పొద్దైనా వీలు చేసుకుని మంజులని కలుసుకుని తను చేస్తున్నది పొర బాటని, చిన్నప్పటినుంచి అనుకుంటున్న సంబంధం ఇప్పుడు కాదనడం బాగుండదనీ చెప్పాలి. నామీద ఎలాంటి ఆశలు పెంచుకో వద్దని కూడ గట్టిగా చెప్పాలి." అను కుంటూ కారు దగ్గరికి వెళ్తూంటే, ఇంట్లోకి వెడుతున్న గోపాలం చూసి వచ్చి పలకరించాడు. క్రితంసారిలా పట్టుబడి పోకూడదు అని గట్టిగా నిశ్చయించుకుని, కాస్సేపు సరదాగానే మాట్లాడి, "వసుంది. వస్తాను" అని చెప్పేసి బయలుదేరాడు. ఒంటరిగా మిగలగానే మళ్ళీ పాత ఆలోచ నలు చుట్టుముట్టాయి. కొద్ది రోజుల క్రిందట చూసిన సంఘటన గుర్తువచ్చింది...

ఆవాళ తను వెళ్ళేసరికి కొద్దిగా ఆలస్యం అయింది. సుదర్శనంగారు భోజనం చేస్తు న్నారు. తనని చూస్తూనే లెల్లబోతూ, "మరి ఆలశ్యం అయిపోతోందని అప్పుడే తెచ్చిపెట్టాను" అంది మంజుల.

"ఫర్వాలేదు. కానివ్వండి. నేను బయట కూర్చుంటాను" అని వెళ్ళిపోబోతుంటే,

"వెళ్ళిపోడం ఎందుకు? అలా కూర్చోండి" అంటూ అటు ప్రక్కగా ఉన్న కుర్చీ చూపించారు సుదర్శనంగారు చనువుగా. వచ్చినపుడల్లా డాక్టరుగా ఆయన ఆరోగ్యం విషయాలు అడిగి వెళ్ళిపోకుండా, సరదాగా కాస్సేపు మాట్లా డుతూ కూర్చోడం అలవాటయిపోయింది తనకి. అందుకే ఆయనమాట కాదనలేక అక్కడే కూర్చున్నాడు. మంజుల సుద ర్శనంగారి మంచంమీదే ఓ చివరగా కూర్చుని ఆయనకి మంచినీళ్ళు అవీ అందించి భోజనం కాగానే చేయి కడుగుతూంటే, "వంట్లో బాగుండకపోయినా నీ కీ పని తప్పలేదమ్మా" అన్నారు ఆయన జాలిగా. ఆయన మాటలు విన్నాకగాని మంజుల ఎలాగోవున్న సంగతి తనకు తట్టనేలేదు. "ఏమిటి వంట్లో?" అని అడగబోతూంటే,

"ఇందులో కష్టం ఏముంది?" అంటూ గిన్నెలు తీసుకువెళ్ళి లోపలపెట్టి మళ్ళీవచ్చి కూర్చుంది మంజుల.

"ఇక్కడున్నావా మంజూ" అంటూ ఆమె వెనకే శంకరం దూసుకువచ్చాడు. అతను వస్తూనే ఆత్రంగా మంజుల నుదురు చెంపలు చేత్తోతాకిచూస్తూ, "అబ్బే జ్వరం లేదు. ఇందు. ఇవి వేసుకుని కాస్త కాఫీతాగు. మరి ఈ పూటకి పుస్తకం గిస్తకం ముట్టు కోకుండా హాయిగా నిద్రపో. రేపు ప్రొద్దు న్నకి అన్ని జబ్బులూ ఎగిరిపోతాయి" అన్నాడు జేబులోంచి మాత్రలు తీసి యిస్తూ.

మంజుల చికాగ్గా అతని చేయితీసేసి, "నా కిప్పుడేంలేదు. అనవసరంగా మందులు మింగితే లేని జబ్బులు కూడ వస్తాయి" అంది.

"అదేమిటి? ఇంతకు ముందేగా తల నెప్పి అని ఏడుస్తూ పడుకున్నావుట. అమ్మ చెప్పగానే మందు తేవాలని పరుగెత్తాను. నే నంత అభిమానంతో తెచ్చినందుకైనా వేసుకో." మాత్రలు అలాగే చేతిలో పట్టు కుని అన్నాడు శంకరం.

"అదేదో మహాభాగ్యంలా మందు మింగ మని బలవంతం చేస్తావేమిటి తనకేమీ లేదంటూంటే." సుదర్శనంగారు అప్రసన్నంగా అన్నారు.

"సరే. ఏం చేస్తాం. నేను అంత ప్రేమతో తెచ్చినందుకయినా వేసుకుంటా వనుకున్నాను. నీకు వంట్లో బాగుండలేదని వినగానే, నాకే ఏదో జబ్బు చేసినంత బాధ పడుతూ మందుకోసం వెళ్ళాను...." శంకరం మాటలు పూర్తి కాకుండానే.

"మరి నీకే జబ్బు చేసిందేమోనను కున్నావాడివి మందు కూడ నువ్వే వేసుకోక పోయినావా?" కసిగా అంది మంజుల.

ఫక్కున నవ్వబోయి సభ్యత కాదని వూరుకున్నాడు తను.

"ఓ యస్. నీ ఆజ్ఞ అయితే చేదు మాత్రలే ఏమిటి, విషం అయినా తింటాను" ఏదో పెద్ద జోక్ విసిరినట్లు విరగబడి నవ్వుతూ, మిగతావాళ్ళు తనతో శృతి కల పకపోయేసరికి చిన్నబుచ్చుకుని వెళ్ళిపోయాడు శంకరం.

వాతావరణం అంతా భయంకరమైన నిశ్శబ్దంతో నిండిపోయి, గాలి కూడ లేనట్లు వూపిరి సలపనట్లు అయి పోయింది. దాన్ని మళ్ళీ మామూలు స్థితికి తీసుకురావాలని ఎవరికి వాళ్ళే ప్రయత్నం చేస్తుండగా, సుదర్శనంగారు ప్రేమగా మేనగోడలి తల నిమురుతూ,

"మరీ అర్ధరాత్రి దాకా చదవకు తల్లీ. నీకు తప్పకుండా క్లాసు వస్తుంది. నే చెప్తున్నాగా. ఇవాళ అసలు పుస్తకం ముట్టుకోవద్దు. కాస్త వేడిగా అన్నం తిని పడుకో" అన్నారు.

"నువ్వూ అలాగే అంటావేమిటి? నేనేం చదివేస్తున్నానని మహా. అయినా ఎంత చదివినా యింక నాలుగు రోజులేగా" అంది చికాకు తెచ్చుకుంటూ. సుదర్శనం గారు నిండుగా నవ్వుతూ బుజ్జగింపుగా ఆమె భుజం తట్టారు. అంతలోనే ఏదో స్ఫురించినట్లు. "ఈ తల నెప్పి, జలుబు భారం తగ్గడానికి మీదగ్గరేమైనా వుంటే ఇవ్వండి" అన్నారు తనతో. తను బ్యాగ్ తెరిచి టాబ్లెట్ ఇస్తూంటే, "మా మావయ్యకి భయం ఎక్కువ. ఏం లేదని చెప్పినా నమ్మడు" అంటూ తీసుకుంది.

ఆ సంఘటనకి తనా నాడు అంత ప్రాధాన్యం ఇవ్వలేదు. ఇప్పు డాలో చిస్తూంటే దాంట్లో ఎన్నో అర్థాలు స్ఫురిస్తున్నాయి—

ఎంతో అన్యోన్యంగా ఉండకపోతే శంకరం అంత చనువుగా ఆమె నుదుటిమీద చేయివేసి అభిమానంగా పలకరిస్తాడా? మరి మంజుల ఎందుకు అంత చికాగ్గా విది లించి కొట్టినట్లు మాట్లాడింది? ఆమెలో ఆ మార్పు తనతో పరిచయం అయ్యాకనే వచ్చిందా? అవాళ సుదర్శనంగారు కూడ ఎలాగో మాట్లాడారు కొడుకుతో. మేన గోడలు తన కొడుకునికాదని మరో వ్యక్తిని అభిమానిస్తోందని ఆయనకీ కష్టంగా గానే వుందేమో. పరాయి పిల్లని ఏమీ అన లేక కొడుకుమీదే ఆ చికాకంతా చూపించా రాయన—తన అనుమానం నిర్ధారణ చేసుకోడానికే తనని మందుకూడ అడిగా రేమో. అయిన దృష్టిలో తను ఎంత చుల కన అయిపోయాడు. అయినా తన అవసరం ఉండటంవలన పైకి ఏమీ తేలటం లేదు ఆయన.

ఆలోచిస్తూ రోడ్డుమీద దృష్టినిలిపి కారు నడుపుతున్న హరీష్‌కి, కొద్దిదూరంలో నడిచి వెళ్తున్న వ్యక్తి మంజుల ఏమో అనే అనుమానం వచ్చింది. అయినా కాదా అను కుంటూండగానే కారు ఆమె దగ్గరికివచ్చే సింది. కారు ఆపాడు. మంజుల ఉలిక్కిపడి ప్రక్కకి తిరిగిచూసింది. ఆమె రెండుకళ్ళూ నీళ్ళతో నిండిఉన్నాయి.

"ఎక్కడికి వెడుతున్నారు. నేను డ్రాప్ చేస్తాను రండి" అన్నాడు డోర్ తెరుస్తూ.

అతను చూడకుండా కళ్ళు తుడుచు కోవాలని వ్యర్థ ప్రయత్నంచేస్తూ

"థ్యాంక్సు. అక్కర్లేదు. దగ్గరే, నడిచి వెళ్ళగలను" అంది.

"మీతో కొంచెం మాట్లాడాల్సిన పనుంది. రండి.....రోడ్డుమీద నలుగురూ మనల్ని ఇలా చూస్తే బాగుండదు. త్వరగా ఎక్కండి."

ఏ మనుకుందో మరేం మాట్లాడకుండా వచ్చి కూర్చుని తలుపువేసి బయటకు చూస్తూ కూర్చుంది.

సంభాషణలు ఎలా ప్రారంభించాలో హరీష్‌కి అంతు పట్టలేదు. ఆలోచిస్తూనే క్రీగంట అటుచూసిన అతనికి మూలగా ఒదిగి, బల్లిలా తలుపుని అంటుకుపోయి కూర్చున్న మంజుల, మాట్లాడ్డానికి కూడా ఓపిక లేనంత నీరసంగావుండి ఏ క్షణంలో నయినా స్పృహతప్పి పడిపోవచ్చుననిపించింది.



అప్పుడు ఏదో గుర్తువచ్చిన వాడిలా, "మీరు ప్రొద్దుటినుండి ఏమైనా తిన్నారా అసలు?" అన్నాడు ఆత్రంగా ఇటు తిరిగి.

"మీ ప్రశ్నల కన్నింటికి సమాధానం చెప్పే ఓపిక నాకులేదు. త్వరగా తీసుకెళ్ళి నన్ను సుశీలా వాళ్ళింటి దగ్గర దింపండి. ఈ ప్రక్క సందులోనే. నేను దారిచెప్తాను."

"అలాగే తీసుకువెళ్తాను. ముందు నేను చెప్పదలుచుకున్నది చెప్పనివ్వాలి.....ఈలోగా మనం ఏదైనా తీసుకుందాం. మీరేమీ అభ్యంతరం చెప్పకూడదు...." మాట్లాడుతూనే ఓ హోటల్ ముందు కారాపి "దిగండి" అన్నాడు.

మొదట అర్థంకాక తెల్లబోయి, అంతలోనే గ్రహించుకుని, "నన్నెందుకు బాధ పెడతారు. నే నిప్పుడేమీ తినలేను" అంది బ్రతిమాలుకుంటున్నట్లు.

"ఫరవాలేదు. కొద్దిగా అయినా తీసుకుందురుగాని. రండి. ప్లీజ్" కారు దిగి తన కోసమే చూస్తున్న హరీష్‌మాటను కాదనలేకపోయింది.

ముందు హాలు దాటి లోపలికి వెళ్తే మరో పెద్ద హాలు. దానిలో ఉడెన్‌పార్టిషన్సు పెట్టిన ఫామిలీ రూమ్స్ వరసగా ఉన్నాయి. వీళ్ళనిచూసి, ఖాళీగా ఉన్న రూమ్ చూపించి వెళ్ళిపోయాడు వెయిటర్.

మెనూకార్డు చూస్తూ, "ఏం కావాలి?" అన్నాడు హరీష్. టేబిలుమీద ఆనించుకున్న రెండు చేతులలోనూ తల దాచుకుని కళ్ళు మూసుకుని కూర్చున్న మంజుల తల ఎత్తకుండానే, "నా కేమీ వద్దు. మీరు తీసుకోండి" అంది.

మంచి నీళ్ళ గ్లాసులు చేత్తో పట్టుకుని, స్వింగ్ డోర్ తెరుచుకుని రాబోతున్న వెయిటర్ ఆదృశ్యం చూసి, భార్యాభర్తల నడుమ అందులోనూ అలాంటి యువజంట మధ్య అలుక కూడ ఒక శృంగార ఘట్టమే అనుకుని నవ్వుకుంటూ గ్లాసు టేబిలుమీద పెట్టి వెళ్ళిపోయాడు.—

"ఏం అలా మొహం ముడుచుకు కూర్చున్నారు. మరదలేమైనా వేదుతిని పించిందా?"

"ఏడిపించింది. నా సంగతి తన కింకా తెలియదు. నా ప్లాన్ నెరవేరిందాకా ఇలా నయానా భయానా నచ్చచెప్తాను. తరువాత యింతకన్న వేదు తినిపిస్తాను."

ప్రక్కరూమ్‌లో సాగుతున్న సంభాషణ విని త్రుళ్ళిపడి తల ఎత్తిన మంజుల, ఆ సంభాషణలు వినమన్నట్లు హరీష్‌కి సౌంజ్ఞ చేసి "శంకరం" అంది నెమ్మదిగా. అర్థం అయీ కానట్లు. అతని కనుబొమలు ముడుచుకున్నాయి. ఏమిటి అన్నట్లు ఆమె మొహంలోకి చూడబోయాడు. కాని సిగ్గుతో అవమానంతో తనలో అణువణువు దహించుకుపోతుంటే, తన మొహం ఎవరికీ చూపించలేక తల వంచుకు కూర్చుంది మంజుల.

"అయినా ఆ అమ్మాయికి అంత యిష్టం లేనప్పుడు ఇలా వెంటపడటం ఎందుకు? ఏమిటా మోజు?"

"మోజే మరి. డబ్బంటే మోజు ఎవరికుండదు చెప్పు. దాని కున్న యాభైవేల రూపాయల ఆస్తి నా స్వాధీనం అయిన తరువాత, నా మొహం చూపించవద్దన్నా సంతోషిస్తాను. అంతవరకు మాత్రం వెంట పడతాను."

స్పష్టంగా వినిపిస్తోంది సంభాషణం. ఆశ్చర్యాన్ని ఆగ్రహాన్ని మించిన అనుభూతి ఏదో తనను ఆవరించగా స్థాణువులా కూర్చుండిపోయాడు హరీష్.

"అయ్య బాబోయ్. అంత డబ్బే! ఇంక అప్పుడు నేను కనిపించనేమో మీకు."

"నువ్వు కనిపించకపోవటంకాదు. మనిద్దరం కొన్నాళ్ళపాటు వాళ్ళెవరికీ కనిపించం. ఆ డబ్బుతో దేశం అంతా తిరిగి వద్దాం హాయిగా."

రెప్పవాల్చటం, ఊపిరి పీల్చటం కూడ మరిచిపోయి ఆ సంభాషణ వింటున్న మంజుల హరీష్‌లు మళ్ళీ సర్వర్ రాకతో ఈ లోకంలో పడ్డారు. మంజులకి ఆకలి ఎప్పుడో చచ్చిపోయింది. తినాలనే ధ్యాస కూడ లేదు ఇప్పు డిద్దరికీ. కాని, ఏమీ తీసుకోకపోతే బాగుండదని కూల్ డ్రింక్సు ఆర్డరుచేశాడు ప్రక్కవాళ్ళమాటలు జాగ్రత్తగావింటూనే—

"ఆ ఖబుర్లన్నీ ఇప్పుడే. తరువాత మీ భార్య, అదే ఆ మంజులాదేవి మిమ్మల్ని గుమ్మం కదలనివ్వకుండా కట్టి పడేస్తుంది. భాగ్యవంతురాలైన భార్య మీ చెప్పు చేతల్లో ఉంటుందనుకుంటున్నారా? కాబోలు పాపం." కవ్వించింది ఆ స్త్రీ.

"నేను చెప్పినట్లు వినకపోయినా, నన్ను తన దగ్గరే ఉంచుకోవాలనే ప్రయత్నం మాత్రం చెయ్యదు ఎప్పుడూ. తనకి నన్ను చూస్తేనే అసహ్యం. చిన్నప్పటినుంచీ ఒక్క దగ్గరే పెరిగినా అదేం ప్రారబ్ధమో ఒక్క విషయంలో కూడ మా అభిప్రాయాలు కలియవు. ఎప్పుడో చాల ఏళ్ళ క్రిందట జరిగిన సంఘటన నా కింకా జ్ఞాపకంవుంది. ఎప్పుడూ ఎందుకో అందుకు పోట్లాడుకుంటూ ఉండేవాళ్ళవేమో, నాకు వళ్ళు మండి తన జుట్టు పట్టుకుని గట్టిగా పీకాను. నా పట్టు విడిపించుకోడం చేతకాక నా భుజం పట్టుకుని రక్తం వచ్చేలా కొరికేసింది రాక్షసి. అది ఒక్కటే కారణం అని చెప్పలేనుకాని ఏమిటో మా వయస్సుతోపాటే ఒకరిపట్ల ఒకరికి ద్వేషం కూడ పెరిగిపోతోంది. ఇప్పుడిప్పుడే, తన్ను డబ్బు గలదాననే గర్వం కూడ తల ఎత్తుతోంది. ఒక్కొకసారి మా అమ్మని కూడ లెక్క చేయదు."

"తన ఉద్దేశ్యం మీ అమ్మగారికి తెలియదా?"

"ఎందుకు తెలియదు. ఆ మూడు ముళ్ళూ పడే ఘడియకోసమే ఆమె కూడ ఎదురు చూస్తోంది."

"విష్ యూ గుడ్ లక్."

"థ్యాంక్సు—మరి వెళ్దామా?"

వాళ్ళు లేచినట్లు కుర్చీలు చప్పుడయి, మాటలు వినిపించడం మానేసిం తరువాత మనమూ వెళ్దామా అన్నట్లు మంజులవంక చూశాడు హరీష్. ఒంట్లో ఎక్కడా ఒక్క చుక్క రక్తం అయినా లేనట్లు తెల్లగా పాలిపోయి, జీవకళ కూడ లేని కళ్ళతో దూరంగా శూన్యంలోకి చూస్తూ కూర్చున్న మంజులని చూడగానే అతని హృదయం నీరయిపోయింది. సంతోషంగా ఆడుతూ పాడుతూ తిరిగే ఈ అమాయకురాలి చుట్టూ ఇన్ని ముళ్ళ కంచెలా అనిపించింది. మృదువుగా ఆమె చేయి తట్టి ఓ గ్లాసు అందించాడు. ఏం మాట్లాడకుండా అది అందుకుంది. ఇద్దరూ ఎలాగో గ్లాసులు ఖాళీ చేసి బయటికి వచ్చారు.

(సశేషం)

వారఫలం

19-8-1966 శుక్రవారం మొదలు 25-8-1966 గురువారం వరకు.

మేషం : వృత్తిలో కొత్తవారితో పోటీ యేర్పడడం వలన మీ కార్యక్రమాలను మార్చుకోవలసి వస్తుంది. ఆర్థిక వ్యవహారాల్లో మొగమాటాలకు లొంగి పోవడం తగదు. ఉద్యోగంలో అకారణంగా అపోహలకు గురి కాగల ప్రమాదం ఉంది. దూరప్రయాణాలు వాయిదా వేయడం మంచిది. కుటుంబ సంతోషం లభిస్తుంది

స్త్రీలకు.—బంధు మిత్రులను కల్సుకొంటారు. పుణ్య కార్యాలు చేస్తారు.

వృషభం : ఇప్పుడు మీరు చేసే ప్రయత్నాల వల్ల ముమ్ముందు తగిన ప్రయోజనాన్ని పొందగలరు. సాహసముతో కూడిన వ్యవహారాలు స్వల్పంగా లాభిస్తాయి. వ్యాపార విస్తరణ ప్రయత్నాలు శ్రమ మీద ఫలిస్తాయి. రాజకీయ వ్యవహారాల్లో అనుకూలత లభిస్తుంది ఆడంబరం కోసం వ్యయం చేస్తారు.

స్త్రీలకు.— ఆరోగ్యం బాగానే ఉంటుంది. సాటివారిలో గౌరవం లభిస్తుంది.

మిధునం భాగస్వాములతో కలసి చేసే వ్యాపారాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి వృత్తిలో నూతనావకాశాలు లభిస్తాయి సాటివారితో వాద ప్రతివాదాలకు దిగడం మంచిది కాదు. సాహిత్య కళారంగాల్లో మీ కృషి రాణిస్తుంది. ప్రయాణాలు ఫలించ గలవు. అనుకూల వార్తలను వింటారు.

స్త్రీలకు:—కుటుంబ వ్యవహారాల్లో కార్యభారం పెరుగుతుంది.

కర్కాటకం : ఆదాయం మాట యెలాగ ఉన్నా, అన్ని వ్యవహారాల్లోను గౌరవ ప్రాబల్యాలు బాగా ఉంటాయి. రావలసిన డబ్బు సమయానికి అందక పోవడం వలన యిబ్బంది కలుగు తుంది. స్థిరాస్థి వ్యవహారాలు అనుకూలంగా ఉంటాయి. సాంఘిక వ్యవహారాల్లో ప్రయోజనం గల వ్యక్తులను కల్సుకొంటారు.

స్త్రీలకు:—ఆరోగ్యం బాగా ఉంటుంది. వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు.

సింహం : వృత్తి వ్యాపారాల్లో ఆదాయం పెరిగినా, దానికి తగినట్లుగా వ్యయం కూడా పెరుగుతుంది. అవసరానికి యేదో ఒక విధంగా డబ్బు చేతికి వస్తుంది. ఉద్యోగంలో మీ పరిస్థితి సంతృప్తికరంగా ఉంటుంది. అధికారుల వలన జరగ వలసిన వ్యవహారాలు సులువుగా నెరవేరుతాయి.

స్త్రీలకు:— కుటుంబ వ్యవహారాలు బాగా ఉంటాయి. సంఘ సేవికలకు మంచి సమయం.

కన్య : ఇదివరకు వృత్తి వ్యాపారాల్లో ఏర్పడిన చికాకులు తొలగి పోతాయి. వ్యాపారంలో ప్రయోజనం గల సంభాషణలను జరుప గలరు. సాహసముతో కూడిన వ్యవహారాలు లాభిస్తాయి. ఆర్థిక వ్యవహారాలు బాగా ఉంటాయి. కుటుంబ సంతోషం లభిస్తుంది. మిత్రులకు సహాయం చేస్తారు.

స్త్రీలకు:— ఆరోగ్యం బాగా ఉంటుంది. బంధు మిత్రులను కల్సుకొంటారు.

తుల : వారం ప్రారంభంలో వృత్తి వ్యాపారాల్లో చికాకులు యేర్పడి తరువాత సర్దుకొంటాయి. వృత్తిలో కొన్ని అవకాశాలు ఆకర్షణీయంగా కన్పిస్తాయి గాని అవి కార్య రూపాన్ని ధరించడం కష్టం. ప్రయాణాల్లో మీ తాలూకు వస్తువులు పోవచ్చును. అధిక వ్యయం జరుగుతుంది.

స్త్రీలకు:— కుటుంబ కార్యక్రమాలు శ్రమ మీద నెరవేరుతాయి. సాహిత్య కళారంగాల్లో ఖ్యాతి లభిస్తుంది.

వృశ్చికం . ఈ వారం శుభా శుభ మిశ్రమంగా ఉంటుంది. కొంత మంది మిత్రుల వ్యవహారాల్లో జోక్యం చేసి కోవడం వలన కార్యభారం పెరుగుతుంది. వృత్తిలో ఆదాయం బాగా ఉంటుంది. ఉద్యోగంలో యితరులు చేసిన పొరబాట్ల వల్ల మీకు శ్రమ కలుగు తుంది. సజ్జన సాంగత్యం లభిస్తుంది.

స్త్రీలకు — సంతోషకరమ్మైన వార్తలను వింటారు. పుణ్య కార్యాలు చేస్తారు.

ధనుస్సు : వృత్తి వ్యాపారాల్లో మీరు యిది వరకు చేసిన ప్రయత్నాలు యిప్పుడు ఫలిస్తాయి. సాటివారితో పోటీ పెరగడం వలన మీరు పొందవలసినంత లాభన్ని పొందలేక పోవచ్చును. ఉద్యోగంలో అధికారుల ఆదరాభిమానాలను పొందగలరు. ప్రయాణాలు ప్రయోజనకరంగా ఉంటాయి.

స్త్రీలకు —ఆరోగ్యం బాగా ఉంటుంది. శుభ కార్యాల విషయంలో మీ ప్రయత్నాలు ఫలిస్తాయి.

మకరం : వ్యాపారంలో మీ ఆలోచనలు మీకే కాకుండ మీ మిత్రులకు కూడా లాభదాయకంగా ఉంటాయి. వృత్తిలో సాటివారితో పోటీని యెదుర్కొని అనుకూలతను సాధించ గలరు. అవసరానికి యేదో ఒక విధంగా డబ్బు చేతికి వస్తుంది. రాజకీయ వ్యవహారాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి.

స్త్రీలకు — కుటుంబ కార్యక్రమాలు నిరాటంకంగా నెరవేరుతాయి.


కుంభం : కొన్ని వ్యవహారాల్లో మీరు యెంత మంచిగా ప్రవర్తించినా అది యితరులకు చెడుగానే కన్పిస్తుంది. సాహసముతో కూడిన వ్యవహారాల్లో నష్టం వస్తుంది. వారం మధ్యలో చేసే ప్రయాణాలు లాభించగలవు. ఉద్యోగంలో ప్రయోజనం గల మార్పులు వస్తాయి. పుణ్య కార్యాలు చేస్తారు.

స్త్రీలకు.— శుభ మూలంగా వ్యయం జరుగుతుంది. విలాస వస్తువులు కొంటారు.

మీనం : పూర్తిగా నెరవేరే వరకు యే వ్యవహారాన్నీ నమ్మడానికి అవకాశం లేదు. ఉద్యోగంలో యిది వరకు మీ వల్ల ఉపకారం పొందిన వారే యిప్పుడు మిమ్మల్ని వ్యతిరేకిస్తారు. నూతన వ్యాపారాలు వాయిదా వేయడం మంచిది. సాంఘిక వ్యవహారాల్లో భేదాభిప్రాయాలు వస్తాయి.

స్త్రీలకు — ఆరోగ్యం బాగానే ఉంటుంది. వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు.

—మహేష్ ●




స్టోర్‌వెల్ భద్రతకున్ను వస్తువులను క్రమబద్ధంగా
విలవ చేయుటకున్ను తగినట్టిది – చోర,
అగ్ని నిరోధమునకు ప్రసిద్ధయినది.

ప్రత్యేక పేటెంటెడ్ సుగుణములతోను,
అనమానమైన తుప్పు-నిరోధక
సంధానముతోను అత్యధికంగా నిర్మించబడు
చున్నట్టి ఈ అద్భుతమైనది, శ్రేష్ఠమైన
విలువ అనిపించే ధరకు మీదగును.

బీరువాలన్నిట్లో ఉత్తమ విలువైనది

స్టోర్‌వెల్



1981 మి.మీ. ఎత్తు x 914 మి.మీ. వె.
x 483 మి.మీ.లోతు
(78" ఎత్తు x 36" వె. x 19" లోతు)

గోద్రెజ్ ప్రదర్శనా గృహము (షో రూమ్) లందు గాని లేక భారతదేశమందంతటాగల స్టాకిస్టులవద్దగాని ప్రదర్శింపబడు చున్నట్టి వివిధ స్టోర్‌వెల్ రకములను చూడుడు.

Godrej
గోద్రెజ్

(GT.1-TEL.)



అసంకల్పం

రత్న

"పార్వతీ!"

"ఇదుగో నిన్నే! ఒకసారి యిలా వచ్చి వెళ్ళు." విశ్వనాథం కేక వేశాడు.

సమాధానం రాలేదు.

"అమ్మాయ్ రాధా! అమ్మ యెక్కడుంది? యిలా పిలు."

కొంచెం సేపటికి పార్వతమ్మ వచ్చి గుమ్మంకి ఆనుకుని నిలబడింది.

"నిద్రపోతున్నావా? పెద్దాడికి ఉత్తరం వ్రాసాను." చేతిలో పెన్ను ప్రక్కనపెట్టి పడకకుర్చీలో వెనక్కివాలి అన్నాడు విశ్వనాథం.

"చదవండి"

విశ్వనాథం చదివాడు. "చి. సత్యంని ఆశీర్వదించి నీ తండ్రి వ్రాయునది. ఇక్కడంతా క్షేమము. నీకు వారంరోజుల క్రితం ఒక ఉత్తరం వ్రాశాను. అందినదనుకుంటాను. నీవద్ద నుంచి జవాబుకై యెదురు చూస్తున్నాం. లోగడ వ్రాసిన ప్రకారం రాధకి పెద్దాపురం సంబంధం నిశ్చయం చేశాము. అన్నివిధాలా బాగుంది. లాంఛనాలతో సహా ఆరువేలు కట్నం యిచ్చుటకు నిశ్చయమయిందని నీకు క్రితం ఉత్తరంలో వ్రాశాను." విశ్వనాథం ఆగి భార్య ముఖంలోకి చూసాడు.

"వింటున్నాను చదవండి."

"పెళ్ళి ఖర్చులు, అవీ పైన యింకొక నాలుగువేలయినా అవుతాయి. మీ చదువులకి పోను మిగిలిన ఒక యెకరం అమ్మితే నాలుగు వేలు వస్తాయనుకుంటాను. మిగిలిన సొమ్ము ఏదో విధంగా మీ అన్నదమ్ములిద్దరూ చూడవలసి ఉంటుంది. శేషగిరికి కూడా పరిస్థితులు తెలియబరచినాను. తనకి చేతనయిన సహాయం చేస్తానని వాడు వ్రాశాడు. బహుశ మూడు, నాలుగువేలు సర్దుబాటు చేయగలడని అనుకుంటున్నాను. నీవు కూడా కొంచెం సహకరించి కుటుంబమునకు తోడ్పడితే పెద్దవాళ్ళం సంతోషిస్తాము. ఉన్నది ఒక్క తోబుట్టువు. ఇది మీ అన్నదమ్ముల బాధ్యత. నీవు పెద్దవాడివి యింతకంటె వివరంగా వ్రాయ నవసరంలేదు. పిల్లలు ఆరోగ్యంగా ఆడుకుంటున్నారని తలుస్తాను. కోడలికి నా ఆశీస్సులు. ముహూర్తం నిశ్చయించగానే తెలియబరుస్తాను. బహుశ అట్టే వ్యవధి ఉండదు. వెంటనే జవాబు వ్రాయి.

ప్రేమతో

నీ తండ్రి విశ్వనాథం.

విశ్వనాథం ఉత్తరం మడత పెట్టి కవరులో తోసాడు.

"రాధా! ఈ కవరు అంటించి కాస్త పోస్టులో వేసిరా"

"సరిపోయింది. యింకా యెన్నాళ్ళు? పెళ్ళి కాబోతున్న పిల్ల! అదెందుకు? రాధా ప్రక్కింటివాళ్ళ అబ్బాయి కియ్యి. వేసి వస్తాడు. అయినా యివాళ పోస్టు యింకా రాలేదు. యివాళ వస్తుందేమో సత్యం దగ్గర నుంచి." పార్వతమ్మ భర్తకేసి తిరిగి అంది.

"ఆ! వారంరోజుల నుంచి చూస్తున్నాం. వచ్చినట్టే."

పార్వతమ్మ మాట్లాడలేదు.

"పెళ్ళి గురించి వ్రాసాను కదూ! డబ్బు పంపాలని భయంవేసి ఉంటుంది. ఎవరూ వేలు కదల్చకపోతే యెలా అవుతుందనుకున్నాడో?" విశ్వనాథం చిరాకుగా అన్నాడు.

"వాడి దగ్గర అసలు డబ్బుందో లేదో."

"ఏం? ఎందుకు ఉండదు? పదేళ్ళ నుంచి ఉద్యోగం చేస్తున్నాడు. ఉన్నది పట్నమా? ఏమయినా, వచ్చిన రెండువందలా యేం చేస్తాడు? యింటికి యెలాగూ పంపడు. ఎరగడా చెల్లెలు పెళ్ళి కెదిగిం

దని?" విశ్వనాథం మరింత కోపంగా అన్నాడు

పోస్ట్‌మాన్ కేక వేశాడు.

విశ్వనాథం లేచి ఆత్రుతగా అందుకున్నాడు. ఉత్తరం చదువుచున్నంత సేపు భర్త ముఖంలో భావాలు చదువుతూ నిలుచుంది పార్వతమ్మ.

"ఎవరు?"

"వియ్యంకుడు." విశ్వనాథం చదవటం ముగించాడు. "ఈ నెల 27న ముహూర్తం బాగుందిట. అబ్బాయికి అది సెలవుకి వీలుగా ఉందిట. అందుచేత అది నిశ్చయిద్దామని వ్రాశాడు."

"ఇంత త్వరగానా. గట్టిగా పదిహేను రోజులు కూడా లేదే." పార్వతమ్మ కంగారుగా అంది.

అసలు యింతవరకూ కట్నం సొమ్ము వెయ్యికూడా సమకూరలేదు. పొలం అమ్మకం సొమ్ము వారంరోజులలో వస్తుందనుకో.మిగిలి వదో! నేనింకా టైము వుంది కదా అని కూర్చున్నాను. వీళ్లేమో ఆఖరినిముషం వరకూ తేలరు." విశ్వనాథం కొడుకుల నుద్దేశించి అన్నాడు.

"శేషగిరికి టెలిగ్రాం యివ్వండి. పెద్ద ఉద్యోగంలో ఉన్నాడు. వాడి దగ్గర ఉండక పోదు. వెంటనే పంపించమనండి. అంతగా పూరిగా తన దగ్గర లేకపోతే ఎక్కడయినా సంపాదిస్తాడు." పార్వతమ్మ విశ్వాసంగా అంది.

కొంచెం ఆలోచించి విశ్వనాథం అన్నాడు "అంతే చేయాలి మరి."

"టెలిగ్రాంలో అన్ని విషయాలు తెలియవు పోనీ యివాళ హైదరాబాదు వెళ్లి రానా యేమిటి?" విశ్వనాథం భార్యముఖంలోకి ప్రశ్నార్థకంగా చూశాడు.

"పోనీ ఆపని చేయండి. డబ్బు మీతో కూడా తీసుకురావచ్చు. వీలుంటే అబ్బాయిని, కోడలిని వెంటతీసుకువచ్చేయండి. ఆట్టే రోజులు కూడా లేదు."

"సరే అయితే. ఆ తెలుగు కేలండరు యిలా పట్టా. సంచీలో నాలుగు పంచలు పెట్టు. తరువాతపెట్టో. నిన్న రంగయ్య యిచ్చిన నాలుగువందలు తీసుకురా. వీలుంటే రాజమండ్రిలో పెళ్లి బట్టలు కొంటాను. యిలాగూ వచ్చేటపుడు సత్యం దగ్గర దిగాలి కదా. వాడి దగ్గర యెంతుందో యేమిటో."

"పెళ్లి బట్టలకి సత్యం దగ్గర ఉండక పోదు. మీరు తీసుకుని వెళ్లడమెందుకూ డబ్బు?"

"తప్పననుకో. పోని యెందుకయినా మంచిది దగ్గర ఉంచుతాను. రాధా!" విశ్వనాథం పిలిచాడు.

"అదుగో ఆ ఉత్తరం పోస్టులో వేయించడానికి ప్రక్కింటికి వెళ్లినట్టుంది. మీ బండి నాలుగు గంటలకి కదూ. రెండు గంటల నుంచి వర్షం ఉంది. యేంచేస్తారు?"

"ఏంచేస్తాం? యిప్పటి నుంచీ ఆస్టేషనులోనే కూర్చుంటాను. ఆ సంచిలో నా భగవద్గీత కూడా పెట్టు."

విశ్వనాథం బట్టలు మార్చుకున్నాడు.

ఇదుగో డబ్బు. యెక్కడ పెట్టుకుంటారు? రుమాలులో కట్టనా?"

"పర్వాలేదులే. జేబులోనే పెట్టుకుంటాను. లాల్చీయేగా. ఏదీరాధ యింకా రాలేదేం?"

"మీకు ఆలస్యం అవుతుంది. వర్షం వచ్చేస్తుందేమో. బయలుదేరండి" పార్వతమ్మ హెచ్చరించింది.

"సరేలే" విశ్వనాథం మెట్లు దిగుతూ ఉండగా రాధ యెదురు వచ్చింది ఆశ్చర్యంగా చూస్తూ.

"శకునం బాగుంది. వెళ్లిరండి. ఆలశ్యమయితే ఒక కార్డుముక్క యిక్కడికి వ్రాసి పడేయండి." పార్వతమ్మ సంతృప్తిగా అంది.

"అలాగే. వస్తాను" విశ్వనాథం అడుగు ముందుకు వేశాడు. విశ్వనాథం వీధి మళ్లే వరకూ అలాగే చూస్తూ నిలుచున్నారు తల్లీకూతుళ్లు.

* *

మర్నాడు ప్రొద్దున్న పదిగంటలకి చేరుకొన్నాడు విశ్వనాథం హైదరాబాదు. బస్సు లెక్కి యిల్లు చేరేసరికి యింకొక గంట పైన పట్టింది.

సరిగా శేషగిరి ఆఫీసుకి వెళ్తూ యెదురయ్యాడు.

"అదేమిటి నాన్నా! యిలా వచ్చేసావు? పోనీ ఉత్తరం వ్రాస్తే స్టేషనుకి వచ్చేవాడినిగా. లలితా! నాన్న వచ్చారు." శేషగిరి కేక వేశాడు. విశ్వనాథం కుర్చీలో ఆయాసంగా చేరగిలబడ్డాడు. లలిత గుమ్మంలో వచ్చి నిలుచుంది.

"ఏమమ్మా? అంతా కులాసాయేనా? అమ్మానాన్న దగ్గరనుంచి ఉత్తరాలు వస్తున్నాయా?" విశ్వనాథం ప్రశ్నించాడు.

లలిత సమాధానంగా తల ఊపింది.

"కాపిని చల్లని మంచినీళ్లు తెచ్చిపెట్టు తల్లీ. యీ ప్రయాణం కాదు కానీ ఒళ్లు హూనం అయింది." విశ్వనాథం కోడలితో అన్నాడు. ఆమె లోపలికి వెళ్లింది.

శేషగిరి వాచీ చూసుకున్నాడు.

"ఆఫీసుకి వెళుతున్నావా యేమిటి?" విశ్వనాథం కొడుకుతో అన్నాడు.

"ఊ. టైమయిపోయింది. నువ్వు స్నానం, భోజనం అదీ చేసి విశ్రాంతి తీసుకో. మధ్యాహ్నం వస్తాను మళ్లీ. ఏమిటి హడావుడి? ముహూర్తం నిశ్చయించారా?"

"అవునురా. 27న నిశ్చయించారు. నిన్ననే వాళ్ల దగ్గర నుంచి ఉత్తరం వచ్చింది. సరేలే వెళ్లు. మధ్యాహ్నం కొంచెం పెందరాళే యింటికిరా. కొంచెం మాట్లాడాలి. వీలుంటే రాత్రి బండికి యింటికి వెళ్లిపోతాను."

"అంత తొందరేముంది? మధ్యాహ్నం వస్తాను. ఇదుగో వీరయ్యా! బాబుగారికి నీళ్లు తోడు. స్నానం చేస్తారు." శేషగిరి నౌకరుతో చెప్పి హడావుడిగా బయలు దేరాడు.

విశ్వనాథం మంచినీళ్లు త్రాగి విశ్రాంతిగా వెనక్కి వ్రాలి పడుకున్నాడు. మనసులో సంతోషంగా ఉంది కష్టపడి, చదువు చెప్పించినందుకు శేషగిరి ప్రయోజకుడయ్యాడు. పెద్ద ఉద్యోగం! నలుగురిలో పేరు! ప్రతిష్ఠ! యింటి దగ్గర ఎపుడూ నౌకర్లు! కోడలు కూడా అయినింటి పిల్ల. రాజాలాంటి జీవితం. తనంటే యిద్దరికీ యెంతో గౌరవం.

విశ్వనాథంకి అసలు సంగతి జ్ఞాపకం వచ్చింది డబ్బు ఎంత సర్దగలడో? తనెపుడూ వాడిని అడగలేదు. బాంకులో దాచుకుని ఉండాలి. ఒకవేళ అనుకున్న దానికి వందో, రెండువందలు తక్కువయితే అప్పుతేగలడు. బోలెడు పలుకుబడి. విశ్వనాథం సంతృప్తిగా కళ్లు మూసుకున్నాడు.

గడియారం రెండుగంటలు కొట్టింది.

విశ్వనాథంకి మెలకువ వచ్చింది. ఫాను గాలి వెచ్చగా తగులుతోంది. శేషగిరి మాట వినపడింది.

"నాన్న డబ్బు అడగడానికి వచ్చినట్టున్నాడు."

"నేనప్పుడే అనుకున్నాను." కోడలి కంఠం.

విశ్వనాథం లేవబోయి మళ్లీ పడుకున్నాడు.

"మొన్న ఉత్తరానికి మీరు జవాబు ఏమని

ప్రాసేరేమిటి?" కోడలు అడిగింది.

"నా చేతనయినదేదో చేస్తానని వ్రాసాను"

"అలా యెందుకు వ్రాసారు? తిన్నగా వ్రాయక. పోనీలెండి. యిప్పుడయితే యేమయింది? వెయ్యి, పదిహేను వందల కంటె యివ్వలేమని చెప్పండి."

విశ్వనాథం గుండెలో రాయిపడింది. కొడుకేమంటాడో వినాలని చెవులు రిక్కించాడు. మాటలు వినపడలేదు. విశ్వనాథంకి భయం వేసింది. ఫాను గాలి మరింత వేడిగా ఉంది. స్విచ్ ఆఫ్ చేశాడు.

"బాగా నిద్రపట్టిందా?" శేషగిరి గదిలోపలికి వచ్చాడు.

"లలితా! నాన్న లేచారు. టిఫిను పట్టుకురా." శేషగిరి కేకేసాడు.

"ఇప్పుడేం వద్దురా. ఆలస్యంగా భోజనం చేసాను." విశ్వనాథం అన్నాడు.

శేషగిరి అవీయివీ మాట్లాడుతున్నాడు. ప్రమోషనులు! ఆఫీసు గొడవలు! రాజకీయాలు అరగంట గడచిపోయింది. విశ్వనాథంకి చిరాకుగా ఉంది. డబ్బు మాట యెత్తడు!

చివరికి తనే అన్నాడు. "పొలం అమ్మకం పెట్టాను."

"ఎంత బేరం వచ్చింది?"

"నాలుగువేలు. స్టాంపు ఖర్చులు మూడు వందలుపోతాయి."

"ఓహో!" అని ఊరుకున్నాడు శేషగిరి.

విశ్వనాథంకి యింక యెలాగ మాట్లాడాలో తెలియలేదు. చాలాసేపు యిద్దరూ మాట్లాడకుండా కూర్చున్నారు.

చివరికి శేషగిరే ప్రారంభించాడు. "చేస్తున్నది పెద్ద ఉద్యోగమన్న పేరేగాని యేమిటో యేమీ మిగలటంలేదు. ఇంటి అద్దె ఒక్కటే వందరూపాయలు. ఈ ఊళ్లో ధరలు మరీను. పదిరూపాయల నోటు ఒక్క రోజుతో సరి. దానికి తోడు ఎవరో ఒకరు స్నేహితులు వస్తుంటారు కదా!"

విశ్వనాథంకి ఒళ్లు మండింది. ఎవడికి కావాలి? జమా ఖర్చులు! యిదంతా తనెక్కువ యివ్వలేనని చెప్పడం కాబోలు. డొంక తిరుగుడు. తను ఆశలన్నీ వీడి మీద పెట్టుకుని వస్తే యిదీ ఫలితం!

విశ్వనాథం కోపం దిగ్రమింగి కూర్చున్నాడు. తనదీ అవసరం. తనూ కోపగిస్తే కార్యం అవతే చెడుతుంది.

"అది కాదురా మరి ఉన్నది కాస్తా అమ్మి చదువులు చెప్పించాము. రాధ మెడలో గట్టిగా మూడుకాసులు బంగారం లేదు. మీరు పైకి వచ్చారు. మరి యేదో మాకూ ఆశలుంటాయి. అయినా ఉన్నది యెందరు? ఒక్క ఆడపిల్లగదా. చూసి చూసి బికారి చేతులలో పెట్టలేము కదా! ఈ ఒక్క కార్యం తీరిందంటే మీకింకేమీ బాధ్యత లుండవు. మీ జీవితాలు మీవి." విశ్వనాథం ఆగి కొడుకు ముఖంలోకి చూసాడు.

విశ్వనాథం మళ్లీ అన్నాడు. "ఎలాగ లేదన్నా అయిదువందలు సంపాదిస్తున్నావా? ఉన్నది భార్యాభర్తాను. మరి కాస్త మిగుల్చుకోవాలి. రేపు నీకు కూడా పిల్లలు పుడతారు. జాగ్రత్త పడకపోతే యెలాగ? యేదో నువ్వే పెద్ద సహాయం చేస్తావని ఆశతో వచ్చాను."

చివరికి విశ్వనాథం కొంచెం కోపంగా, నిష్టూరంగా మనసులో మాట అడిగేసాడు.

"మరి నా దగ్గర మాత్రం ఎక్కడ మిగిలింది? క్రిందటి నెలలోనే స్కూటరు కొన్నాను. యిన్స్యూరన్సు కట్టాలి. లలితకెపుడూ యేదో అనారోగ్యం. డాక్టరు బిల్లులు వందలకి వందలు అవుతున్నాయి. మీరు యింకా నేనేదో దాచుకుని యివ్వటం లేదనుకుంటారు." శేషగిరి అన్నాడు.

"డబ్బు లేదని మావాళ్లు యీ వేసంగిలో కాశ్మీరు వెళదామని రమ్మంటే కూడా మానేసాము." గుమ్మంలో నిలుచుని లలిత అంది. విశ్వనాథం శరీరంలో ప్రతి అణువు మండిపడింది.

"ఏం? స్కూటరు కొనకపోతే ప్రాణం పోయిందా" అని అందామని నోటిదాకా వచ్చి ఆగిపోయాడు. చివరకి అందరూ కలిసి తనని నట్టేట్లో ముంచుతారు కాబోలు.

"మరి యెవరికి వారు చేతులు ముడుచుకు కూర్చుంటే యెలాగరా?" నీరసంగా అన్నాడు విశ్వనాథం.

"నా దగ్గర ప్రస్తుతం వెయ్యి రూపాయలు ఉన్నాయి బ్యాంకులో. పెళ్లినాటికి బహుశ యింకొక అయిదువందలు తీసుకువస్తాను." శేషగిరి స్థిరంగా అన్నాడు.

పెళ్లి ఖర్చులో బోడి పదిహేను వందలు యేమూలకి? విశ్వనాథం మనసులోనే విసుక్కున్నాడు.

"అన్నయ్య యెంతిస్తున్నాడు?" శేషగిరి మనసులో సందేహం బయట పెట్టాడు.

"వాడింకా జవాబు వ్రాయలేదు." విశ్వనాథం నిస్పృహగా అన్నాడు.

మళ్లీ కొంచెం సేపు మౌనం ఆక్రమించింది. ఆరువేలు కట్నమేమిటి? పోనీ యే మూడు, నాలుగు వేలలోనో తగ్గ సంబంధం చూడలేకపోయారా?"

విశ్వనాథంకి చిర్రెత్తింది. "ఒరేయి! పనికిమాలిన కబుర్లు చెప్పకు. తల తాకట్టు పెట్టిచేస్తాను పెళ్లి!" కోపంగా అన్నాడు.

"సరే అయితే మరి నేను చేయగలిగింది చెప్పాను. నా పరిస్థితులు అలాంటివి" శేషగిరి అన్నాడు.

"యేమిటిరా పరిస్థితులు? ఇది నీ చెల్లెలు పెళ్లి. వీధినపోయే వెంకమ్మది కాదు. సరేలే యింకెందుకు? నేను వచ్చిన పని త్వరగానే అయింది. సాయంకాలం నేను వెళ్తున్నాను" విశ్వనాథం చిరాకుగా అన్నాడు.

"భోజనంచేసి రాత్రి బండికి వెళ్ళవచ్చుగా"

"ఎందుకు? అవసరంలేదు. పోనీ డబ్బు యివ్వలేనన్నావుసరే. పోనీ యెక్కడయినా అప్పు అయినా తేగలగా ఒక అయిదువేలు?"

విశ్వనాథం అడిగాడు.

శేషగిరి మాట్లాడలేదు.

"ఏరా! మాట్లాడవేం?"

"దొరుకుతుందికానీ..... నేను యిక్కడ అందరినీ అడగడం బాగా ఉండదు. మన వూళ్లో ప్రయత్నించకూడదూ?"

"ఓహో! నీ ఉద్యోగానికి పరువుతక్కువ. యింకెందుకు నా పాట్లు నేను పడతాను. మీరు దర్జాగా పెళ్లి ముహూర్తానికి దిగిరండి." విశ్వనాథం మండిపోయాడు.

ఇంక అక్కడ ఒక్క నిముషం కూడా ఉండడానికి మనసు ఒప్పటంలేదు.

వెళ్లిపోయేముందు విశ్వనాథం కొడుకుతో అన్నాడు.

"నువ్వు రాలేకపోయినా నీ భార్యనయినా ఒక వారంరోజులు ముందుగా పంపు. పెళ్లి కదా! యేదయినా అవసరం కలుగుతుంది."

"దానికి ఒంట్లో అనారోగ్యం...." శేషగిరి నసిగాడు.

విశ్వనాథం వీధి మెట్లు దిగాడు మాట్లాడకుండా.

"స్టేషనుకి వస్తాను ఉండు."

"అవసరంలేదు" విశ్వనాథం సాగిపోయాడు.

పెళ్లి యెలాగ జరుగుతుంది? విశ్వనాథంకి అంతా కంగారుగా ఉంది. యింకొక అయిదువేలన్నా లేనిదే పెళ్లి జరుగదు. ఎక్క

కని అప్పు దొరుకుతుంది? వ్యవధిలేదు. ఉద్యోగంచేస్తూ బాగా సంపాదిస్తున్న చిన్న కొడుకు నిర్వాకం చేసాడు. యింక పెద్ద వాడు సత్యం యేం చేస్తాడు? వాడసలే తప్పించుకుంటాడు. పిల్లా పాపాలేని శేష గిరి అయిదు వందలు సంపాదిస్తూ పది పాను వందలే యిస్తే, యిద్దరు పిల్లలు, తక్కువ జీతం, నేనేం యివ్వగలనంటాడేమో? వా డసలు యింతవరకూ నోట ముత్యం రాల్చలేదు. అసలు మగ పిల్లలకి పూడ్చి పెట్టి చదువులు చెప్పించడం తన పొర పాటనిపిస్తోంది. రాధ పెళ్ళికి తను ముందుగా జాగర్తపడవలసింది. వీళ్ళు సంపాదించి ఆ మాత్రం ఉద్ధరించరా అనే ఆశతో పూరు కున్నాడు. చివరకి ఎవరి సంపాదన వారిది. తనేమనగలడు? విశ్వనాథం ఆలోచనలలో మునిగిపోయాడు.

"బాబూ! తమరు కొవ్వూరులో దిగుతా మన్నారుకదూ!" ఆసామి మగతగా కళ్ళు మూసుకున్న విశ్వనాథంని లేపాడు.

"అప్పుడే వచ్చేసిందా ఏమిటి?" విశ్వ నాథం కంగారుగా గెడ్డుదిగిపోయాడు.

"మీ సంచి!" కిటికీలోనుంచి అందిం చాడు ఆ మనిషి.

"ఓహో. మరచిపోయాను" కృతజ్ఞతా పూర్వకంగా చూస్తూ అందుకున్నాడు.

యిల్లు చేరేసరికి సూర్యుడు నెత్తిమీద నిలుచున్నాడు. యింటికి తాళంవేసిఉంది. విశ్వనాథం ప్రాణం ఉసూరుమంది. తను వస్తానని తెలిసి సత్యం భార్యా పిల్లలతో ఎక్కడికయినా వెళ్ళాడా యేమిటి? వీళ్ళు! కొడుకులు! విశ్వనాథం కసిగా పళ్ళ నుక అనుకుంటూ అరుగుమీద కూల బడ్డాడు.

ఏం చేయాలి? అసలు వూళ్ళో ఉన్నారో లేదో? లేకపోతే వచ్చే రైలుతో తరువాత బండి యెక్కేయ్యాలి అంతకుమించి గత్యం తరంలేదు.

దూరంగా ఎవరో వీధి చివర వడి వడిగా వస్తున్నారు. విశ్వనాథం చూపు సారించాడు. కోడలు లక్ష్మి! పోల్చాడు.

విశ్వనాథం కుదుటపడ్డాడు.

"ఎంత సేపయిందిమామయ్యా వచ్చి? ఎండలో కూర్చున్నారు." తాళం తీస్తూ కొంచెం బాధపడుతూ అంది లక్ష్మి.

"యేదమ్మా. యిప్పుడే వచ్చానమ్మా" విశ్వనాథం యింట్లోకి నడిచాడు.

ఇల్లు బాగా చిన్నది. రెండు గదులు, చిన్న వంటగది. పాత యిల్లు గోడలన్నీ వల్లగా ఉన్నాయి.

"కూర్చోండిమామయ్యా" మంచం వాల్చింది లక్ష్మి.

మంచి గ్లాసు పక్కనపెడుతూ అడిగింది. "అత్తగారు, రాధా అందరూ కులాసాయేనా? అత్తయ్య పెళ్ళి అని జయ పూరికే సరదా పడుతోంది."

"యేదీ? కనపడదేం?" విశ్వనాథం అడిగాడు.

"స్కూలుకి వెళ్ళింది." లక్ష్మి తలుపు వారగా నిలుచుంది.

విశ్వనాథం కోడలిని పరీక్షగాచూసాడు. యేదో మాసిపోయిన చీర కట్టుకుంది. అక్కడా అక్కడా చిరుగులు. విశ్వనాథం కొంచెం బాధపడ్డాడు. లక్ష్మి ఆయన ముఖంలోకి చూసి తలదించుకుంది.

"స్నానం చేయండి. భోజనంచేద్దురుగాని"

"కొంచెంసేపు విశ్రాంతి తీసుకుని చేస్తాను. నీ పని చూసుకో అమ్మా." విశ్వ నాథం ఆయాసంగా పడుం వాల్చాడు.

దృష్టి గది నాలుగు మూలలా మళ్ళింది. మాసిన బట్టలు చిందర వందరగా దండెం మీద పడి ఉన్నాయి. 'చూస్తే వీడికి వచ్చే డబ్బు సరిపోతున్న ట్టుగా లేదు.' విశ్వనాథం అనుకున్నాడు.

"అమ్మాయ్ లక్ష్మీ! చంటాడిని వం టింట్లో పడుకో బెట్టావేమిటి? యిలాగ తీసుకురా" విశ్వనాథం కేక వేశాడు.

లక్ష్మి పిల్లాడిని మంచం వారగా పడుకో బెట్టింది.

ఈ సారి చీర మార్చుకుని వచ్చింది. తను బీదరికం తనకి తెలియకూడ దని కాబోలు! చిన్న కోడలికి, పెద్ద కోడలికి సహస్రం తేడా ఉంది. విశ్వ నాథం మొదటి సారిగా అనుకున్నాడు.

"అమ్మాయ్! వీడి కడుపు యిలా యెత్తుగా ఉందేం! ఒళ్ళు కూడా బాగా వేడిగా ఉంది. యేమిటిది?" విశ్వనాథం కంగారు పడ్డాడు.


"మూడు నెలల నుంచి యిలాగే ఉంది మామయ్యా. బల్లయేమో అని అనుకుంటున్నాము. యివాళ కొంచెం జ్వరం యెక్కువగా ఉంది."

"కొంచెం యేమిటి? ఒళ్ళు పేలి పోతుంటేను. అయినా మూడు నెలల నుంచీ ఉంటే నాకెందుకు ఉత్తరం వ్రాయలేదు? డాక్టరెవరు? వైద్యం సరిగా జరుగు తోందా?" విశ్వనాథం ఆదుర్దాగా ప్రశ్నలు కురిపించాడు.

"ప్రక్క వీధిలో ఆయనకి తెలిసిన ఆయుర్వేద వైద్యుడు ఉన్నాడు. ఆయనే చూస్తున్నాడు. ఇవాళ కూడా అక్కడికి మీరు వచ్చే ముందే తీసుకొని వెళ్ళాను."

"మతి లేక పోతేసరి! మూడు నెల లయింది. ఆ వైద్యం, యీ వైద్యం అని నాటు వైద్యం చేయించి జబ్బు ముదర పెట్టుకుంటారా? చివరకి యే మనుకుని ప్రయోజనం? అయినా డబ్బు పారేస్తే పూరి నిండా యింగ్లీషు డాక్టర్లు ఉన్నారు కదా", విశ్వనాథం కోడలి ముఖంలోకి తీక్షణంగా చూసాడు.

లక్ష్మి ఒక్క సెకను చూసి కళ్ళు వాల్చేసింది. ఆ చూపులో విశ్వనాథంకి



అర్థంకాని భావాలు యెన్నో ఉన్నాయి. వెంటనే బాధపడ్డాడు. ఒకవేళ చేతిలో డబ్బు లేదేమో.

"యేదో మీరందరూ సుఖంగా ఉన్నారనే దూరంగా ఉన్న మేము అనుకుంటాము. కాస్త మాకు యిటువంటివి తెలియబరచక పోతే యెలాగ? డబ్బు యిబ్బందులు లేనిదెవరికి? పెద్దవాళ్లం వెనకాల ఉన్నాంగా." విశ్వనాథం అనునయంగా అన్నాడు.

లక్ష్మి సిగ్గు పడి పోయింది.

"స్నానానికి లేవండి. నీళ్లు తోడాను."

విశ్వనాథం మనసు చికాకుగా అయిపోయింది.

భోజనం చేస్తున్నంత సేపూ యేదో ఆలోచిస్తూనే ఉన్నాడు.

"ఆయన యేదో పని మీద వూరికి వెళ్లారు." లక్ష్మి మంచం మీద ప్రక్క వేస్తూ అంది.

"యే వూరు?"

"యేదో ప్రక్క వూరు. ఎప్పుడు పని పూర్తయితే అప్పుడు వస్తానన్నారు."

"అదేమి టమ్మాయ్! యివతల పిల్లాడికి వంట్లో బాగా లేదు. బుద్ధుండక్కర్లా! అంత పని యేమిటి మించి పోయింది? యిక్కడ ఆడదానివి ఒక్కర్తివీ యేం చేస్తావని అనుకున్నాడు." విశ్వనాథం కొడుకు మీద కోప్పడ్డాడు.

"ముహూర్తం నిశ్చయించారా?" లక్ష్మి సంభాషణ మార్చింది.

"ఆ. యీ నెల 27 నే. అందుకే కంగారు." విశ్వనాథం అన్నాడు.

"అసలు నిన్నూ పిల్లలినీ నాకూడా తీసుకుని పోదామను కున్నాను. యేదీ, పత్యం వూళ్లో లేడు. చంటాడికి జ్వరం. ఆ పల్లెటూరు యిలాగ తీసికొని వెళ్తే అసలు వైద్యం జరగదు." తనలోతాను అనుకున్నట్టుగా అన్నాడు.

"శేషగిరి, లలిత యెప్పుడు వస్తున్నారు పెళ్లికి?"

"ఇదిగో యిప్పుడు హైదరాబాదు నుంచే వస్తున్నాను. వాళ్లు సరిగా పెళ్లికి వస్తారు. యేమిటో నమ్మా యెలాగ జరుగుతుందో యీ పెళ్లి! యింత వరకు ఒక్కపని జరుగ లేదు. డబ్బు కూడ లేదు. శేషగిరి పెళ్లి నాటికి యెలాగో పదిహేను వందలు యివ్వడానికి నిశ్చయించాడు. యేం చెయ్యను చెప్పు?" విశ్వనాథం దిగులుగా అన్నాడు.

"మీరు విశ్రాంతి తీసుకోండి." లక్ష్మి వంటింట్లోకి వెళ్లి పోయింది. అలసట మీద విశ్వనాథం మనసు త్వరగా నిద్రకు లొంగి పోయింది. మనవరాలు జయ మాటలతో మళ్లీ మెలకువ వచ్చింది.

"అమ్మా! తాతయ్య ఎప్పుడు వచ్చాడే?"

"మధ్యాహ్నం. అల్లరి చేయకు నిద్ర పోతున్నారు."

"కాఫీ యియ్యి. తాగుతాను."

"ఊహు! తాతగారికి."

"నాకూ కావాలి."

"తప్పు కదూ. అలా గొడవ పెట్ట వచ్చా."

"మరి నా కెందు కివ్వవు?"

"కాఫీ పొడి లేదమ్మా. పోనీ ప్రక్కింటి వాళ్ల నడిగి తీసుకురా నీకూ యిస్తాను."

"వాళ్లు యివ్వరు. క్రిందటి సారే విసుక్కున్నారు."

"బంగారు తల్లివి కదూ! నాన్న తెస్తారుగా. అప్పుడు త్రాగుదు గాని యేం? యిప్పుడు పంచదార యివ్వనా?"

"అన్నీ అబద్ధాలే. నాకు పంచదార వద్దు."

"పోనీలే కాని, తాతయ్య లేచారేమో చూడు."

"తాతయ్యా! లేచావా?" జయ అరచుకుంటూ దగ్గరకి వచ్చింది.

"ఏం తల్లీ! స్కూలు నుంచి అప్పుడే వచ్చేసావా?" విశ్వనాథం లేచి మనవరాలిని ఒళ్లో కూర్చో బెట్టుకున్నాడు.

"ఇవాళ మధ్యాహ్నం సెలవు."

"జయా!" కోడలు పిలిచింది.

జయ కాఫీ గ్లాసుతో తిరిగి వచ్చింది.

"మనిద్దరం త్రాగుదామేం?" విశ్వనాథం అన్నాడు.

జయ తల అడ్డంగా వూపింది.

"పోనీలే. వేడిగా ఉంది. యింకో గ్లాసు తీసుకురా."

జయ తెచ్చిన గ్లాసులో సగం కాఫీ పోసి చేతికిచ్చాడు.

"అమ్మకి కోపం వస్తుంది." విశ్వనాథం చెవిలో అంది జయ.

విశ్వనాథం గుండె పిండి నట్లయింది. బలవంతంగా త్రాగించాడు. కొంచెం సేపు కబుర్లు చెప్పాడు.

"మొన్న నా పుట్టిన రోజుకి కొత్త బట్టలు కుట్టించ మంటే నాన్న కొట్టారు." జయ ఫిర్యాదు చేసింది.

"జయా!" లక్ష్మి కోపంగా పిలిచింది.

జయ బిక్క ముఖం వేసింది.

"నువ్వు ముఖం కడుక్కునిరా. మనం బజారుకి వెళ్లి బోలెడు కొత్త గౌనులు కొనుక్కుందాం." విశ్వనాథం జయ చెవిలో అన్నాడు. జయ ముఖం వికసించింది.

"అమ్మాయ్! తలుపు వేసుకో. మేమలా బజారుకి వెళ్లి వస్తాం" మనవరాలి చెయ్యి పట్టుకుని వీధిలోకి నడిచాడు విశ్వనాథం.

బజారంతా తిరిగి యింటికి వచ్చే సరికి చీకటి పడుతోంది. వీధిలో యెవరో పెద్ద మనిషి నిల్చుని మాట్లాడు తున్నాడు తలుపు వోరవాకిలిగా తెరచి ఉంది. లోపలి నుంచి కోడలి కంఠం విన పడుతోంది.

"మరి యిలా గయితే యెలాగమ్మా! మేమూ యీ అద్దె మీదే బ్రతకాలి కదా." ఆ వ్యక్తి యేదో అంటున్నాడు.

విశ్వనాథంకి అంతా అర్థ మయింది.

"బాబూ! మీ కెంత యివ్వాలి?" అడిగాడు

మామగారి కంఠస్వరం విని లక్ష్మి తలుపు పూర్తిగా తెరచింది. ముఖం మ్లాన మయింది.

"మూడు నెలల అద్దె అండి. డబ్బయి అయిదు రూపాయలు."

విశ్వనాథం లెక్క పెట్టి యిచ్చేసాడు.

"మాకూ కష్టాలు తెలుసు బాబూ. మేమూ మధ్య తరగతి వాళ్లమే. అబ్బాయి ఉద్యోగం పోయిందని మాకూ బాధగానే ఉంది. యేం చెయ్యగలం చెప్పండి. మా బ్రతుకులు కూడా అటువంటివే కదా. యేమను కోకండి." ఆ వ్యక్తి నమస్కారం చేసి వెళ్లి పోయాడు.

విశ్వనాథం స్థాణువులా నిలబడి పోయాడు. చివరకి నిస్తేజంగా లోపలకి నడిచాడు.

లక్ష్మి తలవంచుకుని లోపలికి వెళ్లి పోతోంది.

"అమ్మాయ్ లక్ష్మీ!" విశ్వనాథం పిలిచాడు

లక్ష్మి దోషిలా నిలబడి పోయింది.

"సత్యం ఉద్యోగం యెందుకు పోయింది?"

"పోలేదు. సస్పెండు చేసారు నాలుగు నెలలు." వస్తూ ఉన్న దుఃఖాన్ని నిగ్రహించడానికి చేసిన ప్రయత్నం ఫలించలేదు.

"ఎందుకనిట?"

"ఆయన పొరపాటు వల్ల ఆఫీసులో డబ్బు పోయిందిట. సుమారు అయిదు వేలో యెంతో. ముందు ఉద్యోగం పోతుందనే అనుకున్నారు. కాని చివరకి ఆయన దగ్గర ఉన్న రెండు వేలు చిల్లర ఆఫీసులో కట్టేసారు. అందుచేత యింతటితో వదిలేసారు." లక్ష్మి కంఠ స్వరం వణకింది.

"ఎన్నాళ్లయింది? యిది జరిగి"

"ఇది రెండో నెల."

విశ్వనాథం మంచం మీద కూలబడి పోయాడు. యేమిటిదంతా? యేం చేయాలి? కళ్లు చెమ్మగిల్లాయి. కాని వూళ్లో డబ్బుకి పెళ్లాం పిల్లలతో కష్టపడుతూ తన కెందుకు వ్రాయలేదు సత్యం! తను కాని వాడా!

"అమ్మాయ్ లక్ష్మి! అబ్బాయ్ నీతో చెప్పే వెళ్లేడా" కొంచెం మనసులో భయంగా అన్నాడు.

"నిన్ననే వెళ్లారు. హైదరాబాదు వెళ్తున్నానని చెప్పారు. ఈ విషయం గురించే పై ఆఫీసర్లతో మాట్లాడి వస్తానన్నారు."

విశ్వనాథం కొంచెం స్థిమిత పడ్డాడు.

"నువ్వూ పిల్లలూ బట్టలు సర్దుకోండి. రాత్రి బండికి యింటికి వెళ్లిపోదాం." నిశ్చయంగా అన్నాడు.

"వద్దు మామయ్యా. ఆయన యివాళో రేపో వస్తారుగా."

"ఆ, వచ్చి మాత్రం యేం చేస్తాడు?" విశ్వనాథం బాధగా అన్నాడు

ఇద్దరూ ఆలోచనలలో మునిగి పోయారు.

"చంటాడికి జ్వరం యీ పూట యింకా యెక్కువయింది మామయ్యా"

"అవును సుమా. ఆ సంగతి మరచే పోయాను. ముందు వాడిని యెత్తుకొనిరా. ఎవరయినా డాక్టరుకి చూపించుదాం."

లక్ష్మి విశ్వనాథం మాటటకి ఎదురు చెప్పలేదు.

"ఆలస్యం చేసారండి. అయినా పర్వాలేదు. ఒకవారం, పది రోజులలో తగ్గుతుంది." డాక్టరు పరీక్ష చేసి యింజెక్షను యిచ్చాడు. యింకా యేవో మందులు కొనమని వ్రాసాడు.

రాత్రి పడుకునే ముందు విశ్వనాథం డబ్బు లెక్క చూసాడు. ఒక వందలోపు ఉంది.

"అమ్మాయ్, రేపు మీ అత్తయ్యకి ఒక కార్డు వ్రాసి పడెయ్యి నేనింకో రెండు రోజులకి కాని రానని."

"అయ్యో! పెళ్లి అట్టే రోజులు కూడాలేదు. మీరు వెళ్లండి మామయ్యా! ఆయన వస్తారు." లక్ష్మి విశ్వాసంగా అంది.

విశ్వనాథం ఆలోచించాడు ఆమాట కూడా నిజమే. బోలెడు పనులు!

"అవుననుకో. యీ అడవిలో మిమ్మల్నిలా వదలి వెళ్లడం ఎలా? సరేలే. ఉత్తరం వ్రాయక. రేపు సాయంకాలం" వరకు చూసి బయలు దేరతాను.

మర్నాడు కూడా సత్యం రాలేదు. ప్రొద్దున్నే వెళ్లి నెలకి సరిపడే పప్పులు ఉప్పులు అన్నీ మోయించుకుని వచ్చాడు విశ్వనాథం. లక్ష్మి విస్తు పోయింది.

సాయంకాలం బయలు దేరాడు విశ్వనాథం.

"లక్ష్మి! చంటాడిని రోజూ ఆ డాక్టరు దగ్గరకి తీసుకుని వెళ్లు. అశ్రద్ధ చేయకు. యేమీ కంగారులేదు. దేనికినీ యిబ్బంది పడకండి. సత్యం రాగానే అందరూ కలసి బయలుదేరి వచ్చేయండి. నేను ఉందామంటే చేతి నిండా పనులు! ఇదిగో! ఈ పాతిక రూపాయలు దగ్గరుంచుకో. వెందుకయినా అవసరం. సత్యం యీలోగా వస్తే ప్రయాణం ఖర్చులకి ఉంటాయి. నేను యింటికి వెళ్లి యింకొక ఏభయి పంపిస్తాను. మరి నేనింక ఉండనా!" విశ్వనాథం మనవరాలిని ముద్దు పెట్టుకున్నాడు.

ఇంతలో పోస్టుమాన్ వచ్చాడు. విశ్వనాథం అందుకుని చూసాడు. కవరు! తను వ్రాసినదే బయలుదేరే ముందు. విశ్వనాథం పెదవుల మీదకి చిన్న చిరునవ్వు వచ్చింది. తను బయలు దేరిన ఉద్దేశ్య మేమిటి? జరిగిం దేవిటి? కవరు జేబులో పెట్టు కున్నాడు. విశ్వనాథం రెండడుగులు వేసి ఆగిపోయాడు.


"సత్యం వస్తే దిగులు పడ వద్దన్నానని చెప్పు. పెళ్లేమీ ఆగి పోదు. అవసరమయితే ఆ యిల్లు కూడా అమ్మేస్తాను" విశ్వనాథం వెనక్కి తిరిగి దృఢంగా అన్నాడు.

లక్ష్మి క్రింద పెదవిని మునిపండ్ల మధ్య నొక్కిపెట్టి మనసులోని—అదెమిటో అవ్యక్తం— అణచడానికి ప్రయత్నించింది. కనుల నుండి రెండు వెచ్చని నీటి బిందువులు జారి పడ్డాయి. మసకగా అయిపోతున్న మామగారి వంక కృతజ్ఞతతో చివరివరకూ చూసింది.

గుమ్మంలో అడుగు పెడుతూ ఉండగానే పార్వతమ్మ ప్రశ్నించింది. "వెళ్లిన పని జరిగిందా? పిల్లలెవరూ రాలేదా? బట్టలేవీ తీసుకు రాలేదేం?"

విశ్వనాథం భార్య వంక చూసాడు.

"ఆ డబ్బు ప్రయాణంలో పోయింది పార్వతీ." విశ్వనాథం నవ్వాడు. ●



ఖుదా ఇ ఖిద్మద్గార్

వి. ఎస్. సుక్తాంకర్

"స్వరాజ్యంకోసం మీతోబాటు మేమూ పోట్లాడాము. కాని స్వాతంత్ర్యం రాగానే మీరు మమ్మల్ని వదిలి వెళ్లిపోయారు. మేము పాకిస్తానీ కారాగృహాల పాలయ్యాము!" అన్నారు 76 సంవత్సరాల వయస్సుకల ఖాన్ అబ్దుల్ గఫర్‌ఖాన్. ఆయన 15 ఏళ్లు బ్రిటిషువారి జెయిళ్లలోనూ, 15 ఏళ్లు పాకిస్తానీ జెయిళ్లలోనూ గడిపారు. ఒకప్పుడు అఖిలభారత దేశానికీ పూజనీయులయిన "ఫ్రాంటియర్ గాంధీ" ఇండియా 'ఫఖ్తూనిస్తాన్' కావాలనేవారిని బలపరచలేదని ఆరోపించారు. కాని ఈమధ్య విలేఖరులతో గోష్ఠి జరుపుతున్నప్పుడు ఎవరిపట్లా ఏ రకమయిన ద్వేషమూ లేకుండా ప్రశాంతంగా మాట్లాడారు.

"దేశ విభజనకి మొదట అంగీకరించినవారు వల్లభాయిపటేల్. పాకిస్తాన్ నిర్మాణం అవసరం అని ఆయన జవహర్‌లాల్ నెహ్రూకికూడా నచ్చచెప్పారు; అప్పటి పరిస్థితులు అలా తయారయ్యాయని ఆయన వాదించారు. ఇద్దరూ వర్కింగ్ కమిటీ మీటింగ్‌లో దేశ విభజనని బలపరుస్తూ వాదించి కమిటీ ఆమోదన పొందారు" అన్నారు గఫూర్‌ఖాన్ కాబూల్‌లో విలేఖరులతో మాట్లాడుతూ. ఆయన ఆవేదనలో న్యాయం లేదని నేడు మనలో ఎంతమంది అనగలము? మన దేశ చరిత్రని ఈకాలంలో ఆవరించిన చీకట్లో ఒక ఉజ్జ్వలమయిన కిరణం వెలుగు మనకి కనిపిస్తుంది— ఈ వెలుగే ఈ మహాపురుషుడి హృదయం యొక్క వైశల్యాన్ని నింపి, అదెంత గొప్పదో మనకి తెలుపుతుంది.

ఒక విలేఖరి, 'ఇందిరాగాంధి ప్రధాని మంత్రి కావటం గురించి మీ అభిప్రాయం ఏమిటి?' అని అడిగినప్పుడు ఆయన ముఖంలో సంతోషరేఖ ఒకటి వికసించింది. "ఇందిరాగాంధి ప్రధానమంత్రి అవటంలో నాకేమీ ఆశ్చర్యం కనిపించటంలేదు. ఆమె ఆ పదవికి అర్హురాలు. ఆమె నా కుమార్తెవంటిదే!" అన్నారు ఖాన్ అబ్దుల్ గఫర్‌ఖాన్.

అబ్దుల్ గఫర్‌ఖాన్ కల్లా, కపటం ఎరగని మనిషి. మన ప్రధానిమంత్రిపట్ల ఆయన చూపే పితృవాత్సల్యం వెనుక చరిత్ర తెలుసుకోవాలంటే మనం కొన్ని దశాబ్దాలు వెనక్కి వెళ్లాలి.

* * *

"1930 కరాచీ కాంగ్రెసు సమావేశానికి మంచి 'ఎర్ర చొక్కాల' దళం ఒకటి వచ్చింది. వారి నాయకుడు అబ్దుల్ గఫర్‌ఖాన్. ఈ ఎర్ర చొక్కాల వారంటే అందరికీ అభిమానమే; వారెక్కడికివెళ్లినా వారికి హర్షధ్వనులతో స్వాగతం చెప్పేవారు. 1930 ఏప్రిల్‌నుంచీ వారు చాలా హింసలకి లోనయ్యారు కాని వారు సంయమనంతో, ధైర్యంతో ఈ హింసలని ఎదుర్కొన్నారు. వీరి ధైర్యం భారతదేశాన్ని చకితులని చేసింది. అందరూ వీరిని 'ఎర్ర చొక్కా' అని పిలిచినా వారు తమకి పెట్టుకున్న పేరు 'ఖుదా ఇ ఖిద్మద్గార్'లు (భగవంతుడి సేవకులని అర్థం.)...ఫ్రాంటియర్ ప్రావిన్స్‌లో అప్పటి మిలిటరీ పరిపాలన శాంతియుతంగా ప్రవర్తించే జనసమూహాలపైన తుపాకీపేల్చి ఎందరో మరణించటమేకాక ఇంకా ఎక్కువమంది గాయాలకి లోనయేట్లు చేసినా అబ్దుల్ గఫర్‌ఖాన్ గొప్ప ఉద్యమాన్ని లేవదీశాడు. ఒక గ్రామంనుంచి మరొక గ్రామానికి నడిచి వెళ్లేవాడు ఈ ఆరడుగుల పఠాన్, ఆయన 'ఎర్ర చొక్కాలు' సైనిక సాంప్రదాయం కలవారే అయినా చాలా శాంతంగా నడుచుకునేవారు. 'ఫక్ర్—ఎ—అఫ్గన్', 'ఫక్ర్—ఎ—పఠాన్' (పఠాన్‌ల గర్వకారణం), గాంధి ఎ—సర్హద్' (ఫ్రాంటియర్ గాంధి) వంటి బిరుదులతో తమ నాయకుడిని గౌరవించేవారు. ఆయన నిటారయిన చెయ్యెత్తు మనిషి. ఆయన దేహంలోనూ, బుద్ధిలోనూ కూడా వక్ర స్వభావం కనిపించదు. ఆయనకి అనవసరమయిన హడావుడి, అధిక ప్రసంగం ఇష్టంలేదు. స్వాతంత్ర్యమే ఆయన లక్ష్యం. గాంధిగారి సత్యాగ్రహం ఆయనకి బాగా నచ్చింది. అహింసా సిద్ధాంతాన్ని మనలో ఎందరికన్నా ఈ పఠాన్ స్వీకరించటం ఆశ్చర్యకరమే.....1930 లో నేనూ, అబ్దుల్ గఫర్‌ఖాన్ జెయిళ్లలో ఉన్నాము. డెహ్రా—డూన్ జెయిల్లో ఒక మధ్యాహ్నం నాకు కునుకుపట్టి ఒక చిత్రమయిన కల వచ్చింది. అబ్దుల్‌గఫర్‌ఖాన్‌మీద అందరూ విరుచుకుపడుతున్నారు, అన్ని వైపులనుంచీ. నేను అతన్ని రక్షించటానికి ప్రయత్నిస్తున్నాను. మెలకువ వచ్చేసరికి అలిసిపోయి ఉన్నాను. మనస్సు చెడిపోయింది. కన్నీళ్లతో నా తలగడా తడిసిపోయింది"— (జవహర్‌లాల్ నెహ్రూ స్వీయ చరిత్రనుంచి.)

"ఖాన్ అబ్దుల్ గఫర్‌ఖాన్ క్రమ

శిక్షణవల్లనే యుద్ధానికి ప్రసిద్ధి చెందిన పఠాన్‌లు అహింసా సిద్ధాంతాలని స్వీకరించారు. ఒకసారి వీరిమీద తుపాకి పేల్చటానికి గాహ్‌ర్‌వాలీ సోల్జర్ల దళం అంగీకరించలేదు. ఏ రకమయిన అల్లరీ చెయ్యకుండా ప్రశాంతంగా నుంచునిఉన్న వీరి గుంపుమీద తుపాకీ గుళ్లు పేల్చటానికి ఒప్పుకోని ఈ సైనికులకి 10, 15 సంవత్సరాల కారాగృహ నివాసం శిక్షగా విధించారు అధికారులు.''—కాంగ్రెసు చరిత్ర ('పట్టాభి' గారి ఇంగ్లీషు గ్రంథంనుంచి.)

పై రెండు ఉదాహరణలూ—ఇద్దరు రాజకీయ నాయకుల గ్రంథాలనుంచి తీసినవి—'ఎర్ర చొక్కా'ల అభివృద్ధిని చూసి దేశంలో వారందరూ ఎంత ఆనందించారో తెలుపుతాయి. అందుకనే 1931లో లక్షకి పైగా సభ్యులుకల ఈ సంస్థని కాంగ్రెసు తనలో చేర్చుకుంది. అయితే ఈ కలయికకి ముందు గాంధిగారు ఒకసారి ఫ్రాంటియర్‌ని చూసిరావాలనుకున్నారు. అక్కడి పరిస్థితులని పరిశీలించాలని ఆయన అనుకున్నారు. కాని ఇర్విన్ ప్రభువు దీనికి అంగీకరించలేదు. అందుచేత శ్రీ దేవీదాస్‌గాంధి ఈపనికి పూనుకున్నారు. ఫ్రాంటియర్‌కి వెళ్లివచ్చిన దేవీదాస్‌గాంధి 'ఖుదా ఇ—ఖిద్మత్‌గార్' లని చాలా ప్రశంసించారు. కాంగ్రెసు ఉద్యమంలో వీరు చేరినప్పుడూ దేశంలో వారందరూ హర్షించారు.



శ్రీమతి ఇందిరాగాంధి

ఫ్రాంటియర్ ప్రాంతాలని పర్యటించిన దేవీదాస్‌గాంధి ప్రభుత్వం చేయించిన తుపాకి కాల్పులలో వికలాంగులయిన 'ఎర్రచొక్కా'ల బాధలని కళ్లారా చూశారు. భారతదేశంలో తక్కిన ప్రాంతాలలో ఇటువంటి అనాచారాల తీవ్రత తక్కువనీ, ఒకవేళ జరిగినా దెబ్బలు తిన్నవారికి వైద్యసదుపాయాలు ఇక్కడికన్నా అధికంగా లభిస్తాయనీ ఆయన అన్నారు.


1930లో అలహాబాదు సహాయ నిరాకరణోద్యమంలో పోలీసు తుపాకీగుళ్లకి గురిఅయిన వారిని నెహ్రూకుటుంబం వారు (తమ 'ఆనంద్ భవన్'ని ఒక ఆసుపత్రిగా మార్చేసి) ఎలా సేవచేశారో దేవీదాస్ గాంధి గఫర్‌ఖాన్‌కి చెప్పారు.

నెహ్రూ కుటుంబంలోకెల్లా చిన్నఅయిన పన్నెండు సంవత్సరాల ఇందిర ఈ సందర్భంలో ఎంత దీక్ష, ఎంత కరుణ చూపించిందో సగర్వంగా చెప్పారు ఆయన. ఒకసారి కాంగ్రెసుదళంలో పాల్గొన్న ఒక యువకుడికి ప్రమాదకరమయిన గాయాలు కొన్ని తగిలాయి. అతన్ని 'ఆనంద్ భవన్'కి తీసుకువచ్చారు. కడుపులో తుపాకిగుండు తగలటంవల్ల అతని పరిస్థితి చాలా విషమించింది. నెహ్రూ కుటుంబంలోని ఆడవారంతా ఇతనికి నిర్విరామంగా సేవ చేశారు. బాలిక అయిన ఇందిర ఇతనిమంచంపక్కన ఎన్ని గంటలు కూర్చుని అతని సేవలో నిమగ్నురాలయిందో! ఈ యువకుడి పరిస్థితి క్రమంగా మరింత విషమించటం ప్రారంభించింది. ఇక కొన్ని గంటలకన్నా బ్రతకడన్నారు డాక్టర్లు. ఇందిర దుఃఖానికి అంతు లేదు.

''పేదరైతు కుటుంబంలో ఒకడే కొడుకయిన ఈ నా సహోదరుడి ప్రాణం కాపాడితేనే నువ్వున్నావని నమ్ముతా''నని దేవుడిని ప్రార్థించింది. ఆమె ప్రార్థన ఫలించింది. ఆ అబ్బాయి బ్రతికాడు....

దేవీదాస్‌గాంధి చెప్పిన ఈ కరుణామయ గాథ విని అబ్దుల్‌గఫర్‌ఖాన్ చలించిపోయారు. ''ఇందిర నిజంగానే ఒక ఖుదా ఇ ఖిద్మద్గార్!'' అన్నారు. ''జవహర్‌లాల్‌కి దేవుడు ఎన్నో ఐశ్వర్యాలని ప్రసాదించాడు. నాకు అతన్నిచూస్తే కొన్నిప్పుడు అసూయగా ఉంటుంది! కాని, ఆయనకి దేవుడు ప్రసాదించిన వరాలన్నిటిలోనూ గొప్పవరం ఆయన కుమార్తె, చిన్న ఇందిర! ఇటువంటి ఆత్మ సౌందర్యంకల అమ్మాయి నాకుమార్తె అయితే ఎంత బాగుండును!''

1966లో పత్రికా విలేఖరులతో 'ఇందిర నా కుమార్తె' వంటిది అన్న మాటల వెనుక ఎంత చరిత్ర ఉంది! కాలగర్భం లోతుల్లోంచి వినబడే ప్రతి ధ్వనులు ఎన్ని మనకి వినిపిస్తాయి! అన్నిటికన్నా ఫ్రాంటియర్ గాంధి వాత్సల్యం ఎంత ప్రగాఢమయినదో తెలుపుతాయికదా...... ●



ఎవరయినా కుక్కకి తమ రచనని అంకితం ఇస్తారా? ఇవ్వరూ? అయితే, వినండి! మరాఠీలో అటువంటి పుస్తకమే ఉంది. సుప్రసిద్ధ మహారాష్ట్ర రచయిత గడ్కారా తన నాటకాన్ని ఒకదానిని ఒక కుక్కకి అంకితం ఇచ్చారు. ఆ కుక్క కథే గనుక మీరు వింటే గడ్కారా అంకితంలో ఎంత ఔచిత్యం ఉందో మీకు తెలుస్తుంది.


ఆ కుక్క ఛత్రపతి శివాజీది. ఆయనకి అదంటే ప్రాణం. కోటకి వెళ్లినా, యుద్ధానికి వెళ్లినా, చివరికి రాజభవనంలో ఎక్కడ ఉన్నా ఆయనతో ఉండ వలసిందే.


ఒకనాడు శివాజీ రాయఘుర్ కోటలో మరణించాడు. దేశం మారుమూలలనుంచి ఎందరో ప్రజలు తమ ప్రియతమ ఛత్రపతికి ఆఖరిసారిగా తమ అంజలి అర్పించటానికని వచ్చారు.

చితి చుట్టూ వేలాది సైనికులు కళ్ల నీళ్లతో, వినమ్రులై తమ నాయకునికి సెలవు చెప్తున్నారు. భేరీలు మోగాయి. ఫిరంగులు పేలాయి. చందనపు చెక్కలతో పేర్చిన చితి మంటలు పైకి లేస్తున్నాయి. ఒక నిముషం గడిచింది. ఇంతలో శివాజీ కుక్క పరిగెత్తుకుంటూ వచ్చి జ్వాలలోకి దూకింది. ఈ దృశ్యాన్ని చూసిన ప్రజలంతా చకితులయ్యారు.

కొన్ని దినాల తర్వాత శివాజీ సమాధి నిర్మించారు. ఆయన సమాధి పక్కనే ఆయన కుక్కకి కూడా ఒక సమాధి కట్టారు.

రాయఘుర్ కోటలో నేటికీ ఈ రెండు సమాధులని చూడవచ్చు. మానవుడికీ మూగ జంతువుకీ మధ్య స్నేహం ఎంత ప్రగాఢమయినదో ఇవి తెలుపుతాయి.




OK
విటమిన్‌లు చేరివున్న
పశుగ్రాసం
పచ్చిమేత ఒక్కటే చాలదని నిపుణుల అభిప్రాయం. మీ పశువులకు
ఎ. డి విటమిన్‌లు కూడా కావాలి. ఓకెలో ఈ విటమిన్‌లు చేరివున్నవి.
ప్రోటీన్‌లు, మినరల్స్‌తో పుష్టికరమైనదికూడా. జాతిని వృద్ధిపరిచి.
పశువులను రోగాలనుంచి ఓకె కాపాడుతుంది. ఆవులకు,
గేదెలకు ఓకె రుచిగా వుంటుంది. ఓకెను అలాగే పశువులకు
పెట్టవచ్చు. రుబ్బడంతోగాని, కలపడంతోగాని పనిలేదు.
OK
విటమిన్‌లు చేరివున్న
పశుగ్రాసంతో ఎక్కువ పాలు
ఉత్పత్తిదారులు:
ఈస్ట్ ఏషియాటిక్ కం (ఇండియా)
ప్రైవేట్ లిమిటెడ్
మద్రాసు-1.
మీ సమీపంలోగల డీలర్‌నుగాని లేదా డిస్ట్రిబ్యూటర్‌నుగాని కలుసుకొని
మీకు కావలసిన సరుకు తీసుకోండి.

'నాటికం

(పాత్రలు : పర్వతాలరావు, పానకాలరావు, చిరంజీవి, దాశరథి, లక్ష్మి)

[మొదటి రంగం]

[ఒక పెద్ద గది. మధ్య బల్ల, దాని చుట్టూ కొన్ని కుర్చీలు. ఒకమూలగా గోడకి ఆనుకుని నాటకాలకి ఉపయోగపడే 'బాక్‌గ్రవుండ్ దృశ్యాలు మరొకవైపున చిందర వందరగా పడిఉన్న ఇతరవస్తువులు—ఎక్కువగా నాటకాలకి ఉపయోగపడేవి. వంకరగా మంచోపెట్టివున్న ఒక బోర్డుమీద "ఆంధ్ర నాటకరంగం—రిజిస్టర్డ్ ఎసోసియేషన్" అని కనిపిస్తాయి. ఆ గది పై ఎసోసియేషన్ కార్యాలయానికి సంబంధించినదని తెలుపుతాయి. తెరపైకి లేచేసరికి ఒకకుర్చీలో పర్వతాలరావు కూర్చుని నిద్ర పోతూ ఉంటాడు. కొన్ని క్షణాల తర్వాత ఎదురు గోడలు స్టేజికి ఇంచుమించు మధ్యగా కనిపించే తలుపు తెరుచుకుని పానకాలరావు హడావుడిగా లోపలికి వస్తాడు. నిద్రపోతున్న పర్వతాలరావుని తట్టి లేపుతాడు.]

పానకాలరావు:—ఇంకా నిద్రేమిటి లేరా!

పర్వతాలరావు:—(కళ్ళు తెరచి నిద్రమత్తుతోనే) ఏమయిందేంట్రా?

పా. రా:—ఏమయిందేమిటి కొంప మునిగింది!

ప. రా:—కొంపా? ఎక్కడ మునిగింది? ఎవరి కొంప? ఎందులో?

పా. రా:—నీ మొహం ఎవరికొంపా ఏమిటి? అందర్నీ, అందులో మన్నీ, మరీ లోతుగా!

ప. రా:—అయితే వరద బాధితుల నిధికి ఎప్లికేషన్ పెట్టాలా?

పా. రా:—వరద బాధితులేమిట్రా చచ్చుమొహమూ నువ్వూ! అసలేం జరిగిందో అడగవేం?

ప. రా:—అడగమంటావా? సరే, అడిగాననుకో. కొంపేమిటి? మునగడమేమిటి? ఎక్కడ? ఏం—

పా. రా:—(అతని మాటకి అడ్డంవస్తూ) ప్రశ్నవేసి చంపకు. అసలేం జరిగిందంటే, అందరూ గొప్ప వాళ్లయిపోతున్నార్రా! అదీ నా బాధ.

ప. రా:—(అనుమానంగా) ఏం, అవకూడదని ఎవ రయినా అన్నారా?

పా. రా:—ఎవరో అనడమేమిటి? నేనే అంటూ ఉంటే......అంత గొప్పవాళ్లయిపోతూ ఉంటే మనం మాత్రమిలా ఉన్నాం. చూడు ఆనందరావెంతవాడయి పోయాడో. 'అఖిలాంధ్ర నాటక పోటీ'లో మన ఎసోసియేషన్ అతని నాటకాన్నే ఆడిస్తోందిట. ఇక సన్మానాలూ, సభలూ, పత్రికల్లో ఫొటోలూ—మనమో? ఎప్పుడు డ్రామాల్లో పోర్షనిస్తారా అని కాచుకూర్చున్నాం. అడ్డమయిన వాళ్ల చుట్టూ తిరుగుతున్నాం—

ప. రా:—అర్థమయిందిరా మన బాధ. కాస్త, మనం



ఆనందంగార్నే పోర్షనిమ్మని అడుగుదామా? ఇస్తాడంటావా?

పా. రా:—పోర్షనా? నీకూ, నాకూనా? చస్తే ఇవ్వడు. ఇచ్చినా, ఇవ్వపోయినా నా బాధేమిటంటే వాడిలా గొప్పవాడయిపోతున్నాడే అని ....ఆ! నాకోటని పిస్తోంది. శ్యామ్రావు లేడూ? అతన్నడిగి మరో నాటకం రాయిద్దాం. దాన్నే ఎసోసియేషన్ ఎంట్రీకింద పంపమని ప్రెసిడెంటుతో చెబ్దాం. ఏమంటావ్?

ప. రా:—అమ్మ బాబోయ్, శ్యామ్రావే! అతన్ని చూస్తేనే నాకు హడలు. ఒకసారి రిహార్సల్లో నన్ను బయటికి తరిమి మళ్ళీ తన డ్రామాల్లో పోర్షన్లడగొద్దన్నాడ్రా.... .

పా. రా:—అదీ నిజమే. నేనూ అతని నాటకాలు బాలేవని ప్రచారం చేసినవాడ్నే. అదికాదు, అసలు పోయినేడే అతని నాటకాన్ని పోటీకి పంపించారు. మళ్ళీ ఈ ఏడాది పంపమంటే బావుంటుందా?

ప. రా:—హారే, కార్యసిద్ధికి తాయత్తులమ్మబడును అని ఏదో ప్రకటన చూశారా. అవేమయినా కట్టుకుని తిరిగితే—

(ఇంతలో స్టేజికి కుడివైపు తలుపు ఒకటి తెరుచుకుని దాశరథి లోపలికి వస్తాడు. వస్తూనే—)

దాశరథి—మీకేం భయమక్కర్లేదు. నే చూపిస్తాదాని.

ప. రా:—(ఆశగా అతనివైపు తిరిగి) మంచితాయెత్తు లెక్కడ్దొరుకుతాయో మీకు తెలుసా? జలంధర్, లూధియానా.....

పా. రా:—హారేయ్‌పర్వతాలూ, నీ గోలాపు. దాశరథి గారూ! మంచి సమయానికే వచ్చారు! మాకు మీరే మార్గం చూపించాలి. అదేదో చూర్ణం ఉందిట, నాలికమీద వేసుకుంటే కవిత్వం బాగా వస్తుందిటగా. అదేదయినా ఇప్పించండి, మే మే నాటకాలు రాసిచూస్తాం!

దా:—(ఒక చెయ్యి పైకెత్తి) కంగారు పడకండి. ఆనందరావు నాటకం పోకూడదనేగా మీ అభిప్రాయం? దానికి నే నో మంచి ఉపాయం ఆలోచించాను. శ్యామ్రావుగారిని పద్దాం. ఆయన—

ప. రా:—(ఆయన మాటకి అడ్డువస్తూ) ఆయనేం లాభం? పోయినేడు ఆయన్నాటకం పోటీకి పంపాం. మళ్ళీ వేయనిస్తారా?

దా:—దానికో దారుంది. నాతో రండి చెప్తా.

ప. రా, పా. రా:—(ఇద్దరూ కలిసి) శ్యామ్రావు దగ్గరకయితే మేం రాం! కసురుకుంటాడు!!

దా:—ఆయన దగ్గిరిక్కాదు లెండయ్యా, రండి....

(అంతా నిష్క్రమిస్తారు.)

[రెండవ రంగం]

తెర పైకి లేస్తుంది.

(మొదటిరంగంలో కనిపించిన గదిలోనే బల్ల చుట్టూ మూడు కుర్చీలలో పర్వతాలరావూ, పానకాలరావూ, చిరంజీవి కూర్చుని ఉంటారు. దాశరథి సిగరెట్టు పీలుస్తూ, ఇటూ అటూ నడుస్తూ మాట్లాడుతూ ఉంటాడు.)

దా:—మీరేం సందేహించకండి. అంతా నా కొది లెయ్యండి. మీరు మాత్రం శ్యామ్రావుతో మాట్లాడాలంతే.

చిరంజీవి:—అతనొప్పుకుంటాడా అని; అసలే కథ రాసేవాళ్లనిచూస్తే అతని కిష్టంలేదు. నా కథలేవీ బాలేవని పీళ్లతో వాళ్లతో అన్నాట్టకూడా.

ప. రా:—నేనే చెప్పాకదండీ మీతో. నోసారి, రిహార్సల్లో నానటన బాలేదని కోప్పడ్డాడు. నా పోర్షన్ ఇంకోళ్లకిచ్చేస్తా నన్నాడు. అప్పుడు మీరు నా నటన బాగుందన్నారని కూడా చెప్పబోయాను. "వాడికేంతెలుసు, చవకబారు కథ రాసేవాడు!" అని కోప్పడ్డాడండీ! (దిక్కుమొహంతో) చేతిలో, కర్ర పెట్టి కొడ్తాడనుకున్నానండీ....

పా. రా:—నిన్ను చస్తే కొట్టడ్రా. నే చెబుతున్నాగా

ప. రా:—(సంతోషంగా) నిజంగానా? నీ కెలా తెలుసూ?

దా:—కర్ర విరుగుతుందని భయంలేకాని, అసలు సంగతి మర్చిపోతున్నారు. చిరంజీవిగారి కథ నొకదానిని నాటకంగా మార్పించాలి. అసలు శ్యామ్రావుగారికి పెడదాం. అతను రాశాడంటే ప్రయిజు మనదే. అయ్యా! పర్వతాలరావుగారూ, పానకాలరావుగారూ! మీ సాయం కావాలి.

ప. రా:—మీరేంచెయ్యమన్నా చేస్తాం. నాటకంలో పోర్షన్లిప్పించడంతే. ఏరా పానకాలూ అంతేనా.

పా. రా:—ఎప్పుడూ అంతేరా!

చి:—శ్యామ్రావు నాట—అదే మా నాటకంలో మీ రిద్దరూ వేస్తారా? అత నొప్పుకుంటాడా? అయినా ఏ పోర్షన్లిస్తాడు?

దా:—అవన్నీ తర్వాత చూసుకుందాంలెండి! ముందు నే చెప్పేది వినండి. మన ప్రెసిడెంటుగారూ, శ్రీమతి లక్ష్మి గారున్నారు చూశారూ ఆవిడకి

నచ్చచెప్పి మన్నాటకమే పోటీకి ఎం(టీగా పంపించేట్లు చెయ్యాలి.

చి—అంత తేలిక పనికాదనిపిస్తోంది.

దా—అందుకే పర్వతాలరావుగారినీ, పానకాలరావు గారినీ వెళ్ళి ఆవిడని కలుసుకుని ఎసోసియేషన్లో ఆనందరావుగారి నాటక మేదీ బావుళ్ళేదని అందరూ అనుకుంటున్నారని చెబ్తారు.

ప. రా—కావలిస్తే మహజరు తీసుకు పోతామండీ—

చి—మన్మధరావుగారితో నో మాట చెప్తే బావుం టుం దేమో?

దా—తప్పకుండా. ఏమండీ. మీ రిద్దరూ ఆ పని కూడా చూసుకుంటారా?

ప. రా—వో!

చి—అలాగే శ్యామ(లావుగారినీ కల్సుకోండి—

ప. రా—బాబోయ్ నే కలవను. ఆసంగతేదో మీరే చూసుకోండి.

దా—అదంతా తర్వాతగాని, మీ రిద్దరూ రాజ నగర్లో లక్ష్మి గారింటికి వెళ్ళిరండి.....

[తెర]

[మూడవ రంగం]

((శీమతి లక్ష్మి ఇంట్లో గది. ఒక వైపు పుస్త కాల బీరువా, మరోకవైపు సోఫా, కుర్చీలూ, (వాత బల్ల వగయిరాలు. అది ఆఫీసుగది, అని తెలుస్తోంది. తెర పైకి లేచేసరికి పర్వతాలరావూ, పానకాలరావూ కూర్చుని ఉంటారు.)

పా. రా—మన్మథరావు గారెలాగూ లాల్పూర్ వెళ్ళి పోయారుకదరా. ఇక మనం చూసి నచ్చచెప్పేది (పెసిడెంటుగారు మాత్రమే. మనం తల్చు కుంటే అవకేం చేస్తుందిలే. అదీకాక మెంబ ర్లంతా మనవంపేగా—

ప. రా—ఏ మెంబర్లు? ఒక దాశరధిగారేగా?


పా. రా—వోరేయ్, కాసేపు నోరు మూసుక్కూచుం టావూ? మన మిప్పుడు మెజార్టీ (పతినిధులం, నాయకులం—అర్థమయిందా?

ప. రా—మెజార్టీ ఉందన్నికెలా తెల్సురా?

పా. రా—శ్యామ(లావుగారూ, దాశరధిలాంటి వాళ్ళు కలిస్తే మెజార్టీ ఉండకేం చేస్తుంది. అయినా ఇంత ముఖ్యమయిన పని మనకి వప్పచెప్పారంటే అర్థ మేమిటీ?

ప. రా—మన (పెసిడెంట్ (శీమతి లక్ష్మిగారు తిడ్తే పడ్దామనేమో.....

పా. రా—అపశకునప్పక్షి వంటే నువ్వే! (పెసిడెం ట్తో నే మాటాడినంతసేపూ నోరు తెరవక, అర్థమయిందా? (రహస్యంగా, ముందుకి వంగి) ఎసోసియేషన్లో ఆనందరావుగారి నాటకం ఎవరికీ



నచ్చలేదనీ, ఎవరికీ పోర్షన్లు సరిగ్గా ఇవ్వలేదనీ గొడవ గొడవగా ఉందని చెబ్దాం. చిరంజీవి గారి నాటకం—

((శీమతి లక్ష్మి లోపలికి వస్తూ—)

లక్ష్మి—(చిరునవ్వుతో)—ఏమిటండీ పానకా(లావు గారూ రహస్యాలు చెప్తున్నారు?

పా. రా—(కంగారుగా లేచి నుంచుంటూ) నమస్కార మండీ


ప. రా—(లేచి నుంచుంటూ) నమ—(మళ్ళీ ఏదో గుర్తుకి వచ్చినట్లు మాటని మధ్యలో ఆపివేసి, భయంగా పానకాలరావువంక ఒకసారి చూసి, చేతుల్తో నమస్కారంచేసి వూరుకుంటాడు.)

ల—నమస్కారం కూర్చోండి. ఏమిటిలావచ్చారు? (అంతా కూర్చుంటారు.)

పా. రా—మరేం లేదండీ, ఈమధ్య ఎసోసియేషన్లో అల్లర్లౌతున్నాయిలెండి. వాట్నిగురించి మీకు చెబ్దామనీ—

ల—అల్లర్లా? ఏమిటవి?

పా. రా—అదేనండీ, ఈమధ్య పోర్షన్ల గురించి పెద్ద బాధగా ఉంది ఆనందరావుగారి నాట కంలో వేసేవారంతా తమ కిచ్చిన పోర్షన్లు సరిగ్గా ఇవ్వలేదంటున్నారండీ. కొందరేమో తమ కసలు పోర్షన్లివ్వకుండా బయిట ఉంచేశారని గోల పెడుతున్నారండీ అందుకనే, అంతా కలిసి ఈ



నాటకం బదులు మరోదాన్ని పోటీకి పంపిం చాలనుకుంటున్నామండీ.....

ల—ఇప్పుడా? నాటకాన్ని మార్చటమా? అదెలా?

పా. రా—మీరు తల్చుకుంటే వీలుకానిదేముం టుంది లెండి. చిరంజీవిగారు నాటకం రాశా రని తెలిసింది. ఆయన్నే అడిగాను. రాసినట్లు ఒప్పుకున్నాడు. దాన్ని మీరు చూస్తే బావుం టుంది.

ల—చిరంజీవిగారు నాటకాలు రాస్తారా? ఆయన కథా రచయితకదూ?

పా. రా—ఈమధ్య ఆయనకి నాటకాలమీదకి మనస్సు పోయిందిలెండి. ఆయన నాటకం చూస్తే మీకు బాగా నచ్చి తీరుతుంది.

ల—(కొంచెం ఆలోచించి) ఏమండీ పర్వతాలరావు గారూ మీ అభి(పాయంఏమిటీ?

ప. రా—(నిస్సహాయంగా పానకాలరావువంక చూ స్తాడు.)

పా. రా—చెప్పవయ్యా, సందేహిస్తావెందుకూ?

ప. రా—నేనూ, పానకాలరావూ, దాశరధిగారూ— మా అందరి అభి(పాయమూ ఒకటేనండీ. ఆనందరావు నాటకంకన్నా శ్యామ(లావు నాట కమే బావుంటుంది.

ల—శ్యామ(లావు నాటక మేమిటీ?

పా. రా—అదేలెండి. పర్వతాలరావుకి కొంచెం మతి మరుపు. చిరంజీవి, అనబోయి శ్యామ(లావు అన్నాడు.

ప. రా—అవునవును అంతేనండి. ఏదో పొరపాటు.

((శీమతి లక్ష్మి వెంటనే జవాబు చెప్పదు. కొంత సేపు నిశ్శబ్దం. చివరికి ఆమె లేచి, ఒక బల్ల సొరుగు తెరిచి, ఒక కాగితం బయటికితీస్తుంది. మళ్ళీ తన కుర్చీలో కూర్చుని దాన్ని చదివి—)

ల—పానకా(లావుగారూ, మీ ఉద్దేశమేమిటో నాకు బాగా అర్థమయింది. పోర్షన్లివ్వలేదని మీ బాధ! దానికి నే నో మార్గం చూపిస్తాను. కొంతకాలం (కితమే శ్యామ(లావు గారో మంచి (పహసనం రాశారు. దాంట్లో ఇద్దరు విదూషకులకి మంచి నటులు దొరకలేదు. దాటికి మీ పేర్లిస్తే బావుంటుందనుకుంటున్నాను. బాగా పని చేస్తా రని ధైర్యంగా ఉంది.

(ఇంతలో లోపల ఎక్కడో 'అమ్మగారూ!' అని పిలుస్తారు.)

ల—క్షమించండి. ఎవరో పిలుస్తున్నారు. వస్తాను. (నిష్క్రమిస్తుంది.)

పా. రా—ఛా, మన పని ఎప్పుడూ ఇంతేరా

ప. రా—ఇప్పుడూ ఇంతేరా!!

(తెర)



LHGC-2 TE

మేలిరకం "డస్ట్" టీలలో సాటిలేనిది



లిప్టన్స్
హిమాలయన్
గోల్డెన్ డస్ట్ టీ

ఈ టీతో మీరు కమ్మని, చిక్కని బంగారు ఛాయగల టీ కప్పుల వెంబడి కప్పులు అతి త్వరలో తయారుచేయకలుగుదురు ఈ పానీయమును మీరే త్రాగి చూడండి. మీ అతిథులకుకూడా యివ్వండి. మీరు తప్పక సంతోషముతో వికసిస్తారు. అవును — మీ ఆనందభరితులైన అతిధులుకూడాను. లిప్టన్స్ హిమాలయన్ గోల్డెన్ డస్ట్ టీ మేలిరకం టీలలో నిజంగా అద్వితీయమైనది.


LIPTON

లిప్టన్స్
అంటే
మంచి టీ

వైజ్ఞానిక గాథావళి-71- డాక్టర్...

రోగాల కథ


- శ్రీనరి



రోగాలు పూర్వజన్మలో మనము చేసిన చెడ్డ కర్మను మనము అనుభవించేటట్లు చెయ్యడానికి వస్తాయని నమ్మేవారు ఎప్పుడో మాటకేం ఇప్పటికీ ఉన్నారు. అయితే, తమకు రోగాలువస్తే మందులు తిన కుండా కర్మానుభవాన్ని దాని హయామున దాన్ని చెలాయించ నిచ్చేవారు లేరనే అనవచ్చునేమో. క్రితము జన్మలో అసంపూర్తిగా విడిచేసిన పూజలూ, నోములూవల్ల తమకు కాకున్నా—భర్తకో, బిడ్డలకో రోగాలువస్తాయనే నమ్మకము వీరశైవము వ్యాపించిన కాలములో వ్యాపించింది. మానవ శరీరము పంచ భూతాత్మకము కనక పంచ భూతాత్మకమైన ప్రకృతి వాత పిత్త శ్లేష్మముల ప్రకోపమువల్ల ఏర్పడి శీతా తప వర్షకాలములవల్ల బాధితమైనట్లే మానవ శరీరము వాత పిత్త శ్లేష్మములవల్ల రోగ గ్రస్తమవుతుందన్న త్రిదోషవాదము కర్మనీ, పూర్వజన్మల్నీ వదలి రోగాలకు భౌతిక కారణమును చెప్పగలిగినంతవరకూ మెచ్చుకోదగినదే. కారణము ఏది అయినా రోగానికి మూలికలూ, భస్మాలూ మందులుగా వాడడము మాత్రము చిరకాలంనుంచి వస్తున్న అలవాటు.

రోగాలకు సూక్ష్మజీవులు కారణమని మొదట చెప్పిన వైజ్ఞానికుడు లూయీ పాశ్చరు. ఫ్రాన్సులో అతనికాలంలో బీరూ, వైనూ తయారుచేసే వర్తకులు గాలిలో వెచ్చని బీరును అలాగ వదిలిపెట్టి అది పులిస్తే దాన్ని ఇంకా కొన్ని వంట ప్రక్రియలవల్ల శుద్ధి చేసుకునేవారు. ఒక్కొక్కప్పుడు బీరు అతిగా పులిసిపోయి పనికి రాకుండాపోయేది. వర్తకులు మొరపెట్టితే పనికివచ్చే బీరుమీదిదీ, పాడైపోయినబీరు మీదిదీ, మడ్డి— బురుగులాటిది— తీసి సూక్ష్మదర్శనిలో పరిశీలించాడు. రెండు వేర్వేరు రకాలసూక్ష్మ జీవులు గాలిలోంచే వచ్చాయన్నాడూ, అవి ధారాళంగా బీరులో ప్రవేశించడానికి ప్రతిబంధాల్ని సూచించాడు. అంతటితో ఆ చిక్కుతీరిపోయింది....పట్టు పురుగులు ఏదో తెగులు తగిలి చచ్చిపోతున్నాయని 1866 లో దక్షిణ ప్రాంతమువారు మొరబెడితే పాశ్చరు ఆ వ్యాధిని కలిగించే సూక్ష్మజీవుల్ని గుర్తించి వాటి వృద్ధిని అరికట్టి ఆ వ్యాధిని నివారించాడు. వ్యాధులకు సూక్ష్మజీవులు కారణమని అతనికి గట్టి నమ్మకము ఏర్పడింది. యాంత్రాక్సు అన్న రోగంతో పశువులు చచ్చిపోతున్నాయి. బీరుని ఖరాబుచేసి, పట్టు పురుగుల్ని రోగ గ్రస్తము చేసిన సూక్ష్మజీవులతో పరిచయముగల పాశ్చరు యాంత్రాక్సు రోగము వచ్చిన పశువు నెత్తురుతీసి, దానిలోని పుడకల్లాంటి సూక్ష్మ జీవులను నెత్తురు ద్రవాలలో పెంచాడు. అవి అనతికాలంలోనే సంఖ్యలో పెరిగి పోవడమూ ఇవి ఉన్న ద్రవము యాంత్రాక్సు రోగాన్ని కలిగించడమూ నిరూపించాడు. సూక్ష్మజీవులే రోగ కారకాలన్న విశేష విజ్ఞానమునకు లూయీపాశ్చరే జనకుడు. తరవాత తరవాత మలేరియా, కలరా క్షయావంటి వ్యాధులనేకాలు సూక్ష్మజీవులవల్లనే కలుగుతాయని తేలింది.

అంతమాత్రమేకాదు. వ్యాధులన్నిటికీ సూక్ష్మజీవులే కారణమన్న నమ్మకము కుదురుకుని సంజురోగమూ, అనాస, స్కర్వీ అన్న వ్యాధులకు కారణములైన సూక్ష్మక్రిముల కోసము వైద్యులు దశాబ్దలపాటు వెతికేరు నిరర్థకంగా. హాలెండు విజ్ఞాని క్రిస్టియన్ ఐక్‌మన్, ఇంగ్లీషు డాక్టరు జాన్ హాప్‌కిన్సుల పరిశోధనలవల్ల శరీర భాగాలు కొన్నిటికి పోషక ఆహారము స్వీకరించడానికి— కొద్ది పాళ్లలో, విటమినులన్న రసాయనిక సంశ్లిష్ట పదార్థాలు ఉండితీరాలని తెలిసింది. ఇవి లేకపోవడమువల్ల వచ్చే వ్యాధులు విటమిన్ లోపజన్య (Deficiency) వ్యాధులు. ఇవి చిత్రమైన రకాలు.



“గురూగారూ—ఓపెన్ ఇస్తారా?”

వైజ్ఞానిక గాథాశతి

పొగాకుమీద మచ్చలు వృద్ధియై ఆ ఆకుని పనికిరాకుండా చేసే వ్యాధి సూక్ష్మజీవులవల్లనే కలుగుతుందని వూహించి ఆ మచ్చలున్నంత మేరా కత్తిరించి, పిండి, రసముతీసి సూక్ష్మజీవులు దూరిపోలేనంతటి సూక్ష్మాతి సూక్ష్మ రంధ్రాలుగల 'వడ పోత కాగితము' (అందాము)లో మంచి వడ పోసినా, కాగితముమీద సూక్ష్మజీవులు దొరకలేదూ, అడుక్కి దిగిన రసము రోగ కారకమే అయింది. ఆ రసాన్ని సాంద్రత మము చెయ్యగాచెయ్యగా స్ఫటికాలు తేలేయీ, అవి వ్యాధిని కలిగించాయి. వీటిని వైరసు లన్నారూ, వైరసులవల్ల కలిగే వ్యాధులు, పడి శము, పొంగు, మశూచికము వంటివి చాలా తెలిశాయి. కారణము కోసము ఎప్పటికప్పుడు వెతకడమేగాని 'ఇదివరకటి కారణమే అన్నిటికీ కారణము' అనుకుంటే పొరపాటే తేలుతుంది.

నెత్తురులోని Rh—గుణము భార్యాభర్తలది వేరుకావడమువల్ల వారి సంతానము రోగగ్రస్తము అవుతుందన్నది మహా విచిత్రము. 1937 లో డాక్టర్ లీనెరు కోతి నెత్తురును ఎక్కించిన కుందేటి నెత్తురులో ఈ Rh గుణము—అనగా ఒక విశిష్ట రసాయనమును గుర్తించాడు. తరవాత ఇది శ్వేతజాతులలో మాటికీ ఎనభై అయిదు గురిలో కనిపించింది. పర రక్త ప్రమేళనము చేసిన కేసులు వికటించినప్పుడల్లా 'ఈ Rh గుణము సరిపడకనే కాబోలు అది అపాయకారి కావడము' అని అనుకునే వాడు వీనర్. Rh లో ధన (positive) ఋణ (negative) గుణాలున్నాయి. ఆ నెత్తురూ ఈ నెత్తురూ చేర్చితే అల్లరి ప్రారంభించేది. తండ్రి నెత్తురులో Rh ధనమూ, తల్లి నెత్తురులో Rh ఋణమూ వుంటే, బిడ్డకు తండ్రిద్వారా సంక్రమించిన Rh ధన గుణముమీద తల్లి ఋణ గుణము బిడ్డ గర్భములో ఉన్నప్పుడే దండెత్తవచ్చునూ, ఆ బిడ్డ అక్కడే చచ్చిపోవచ్చునూ.లేదా,పుట్టిన కొన్నాళ్లకి (కామెర్లు వచ్చి) నెత్తురులోని ఎరుపు క్షీణించి చచ్చిపోవచ్చును. ఒక పిల్లవాడికి ఈ కారణమువల్ల నెత్తురంతాతీసేసి రెండోరకము నెత్తురు నక్కించడము నే నెరుగుదును. రోగాలన్నిటికీ కారణాలు అన్వేషించి పట్టాలిగాని పోలికలనుబట్టి నిర్ణయించరాదు. పరిశోధన లేని వైద్య పద్ధతి దండుగ. ●


అమృతాంజనం
వాడి శీఘ్రంగా నివారణ పొందండి
స్థానికంగా ఉండే బాధను నివారణ చేసుకోడానికి ఊరికే మందులు ఎందుకు పుచ్చుకుంటారు? నొప్పి ఉన్న చోటుమీద అమృతాంజన్ రాసి అమోఘంగా శీఘ్రంగా నివారణను పొందండి. ఏ అపాయం లేకుండా బెణుకులకు కండరాల నొప్పులకు తలనొప్పికి ఇంకా కీళ్ల నొప్పులకు అమోఘంగా గుణమిచ్చే అమృతాంజన్ 10 రకాల ఔషధాల చేరిన మందు. అమృతాంజన్ గుండెజలుబుకు సాధారణ జలుబులకు కూడా మంచి మందు. కొంచెం కొంచెమే ఉపయోగించవలసి ఉంటుంది. కాబట్టి ఒక సీసా మీ కుటుంబానికంతా కలిసి నెలలు తరబడి వస్తుంది. అవసరానికి ఎప్పుడూ అమృతాంజన్ ఉంచుకోండి. అమృతాంజన్ 70 ఏళ్ల ప్రసిద్ధిని పొందిన నమ్మకమైన గృహ ఔషధం.
అమృతాంజన్ నొప్పుల జలుబుల
నివారణకు 10 రకాల ఔషధాలు
చేరిన మందు।
బెణుకుడు నొప్పి
ఎంత ఎక్కువగా ఉన్నా
బెణికినచోటే కదా!
AMRUTANJAN
Pain Balm
AMRUTANJAN
PAIN BALM
AMRUTANJAN LTD.
అమృతాంజన్ లిమిటెడ్,
మద్రాసు - బొంబాయి - కలకత్తా - ఢిల్లీ

JWT/AM/2818a



జరిగిన కథ

ఆమ్రపాలి అందచందాలను గురించి విన్న మగధరాజు బింబిసారుడు ఆమె నెలాగైనా తన దాన్ని చేసుకోవాలనే ఉద్దేశ్యంతో వైశాలీనగరంలో పుత్తళికల సూత్రధారుడుగా ప్రవేశిస్తాడు. శేవా ఆదేశానుసారం పాలి భవనంలో ప్రవేశించి ఆమె దృష్టిని ఆకర్షిస్తాడు. బింబిసారుడు నేర్పుతో ఆపందుడిపి, పాలిని ఆపదనుంచి తప్పిస్తాడు. పాలి, బింబిసారులు ఉద్యానవనంలో కల్సుకుంటారు. ఇరువురిహృదయాలలో ప్రేమ అంకురిస్తుంది. పాలి, బింబిసారుల హస్తాల్ని పరీక్షించి కోర్కెలు నెరవేరుతాయని చెప్తాడు వేదాంతి, అభిరాముడు వేదాంతిని గౌతముని దగ్గరకు తీసికెళ్తాడు. తనని గురించి అడిగిన పాలికి అప్పటికప్పుడు తానేమీ చెప్పలేనని సమాధానమిస్తాడు బింబిసారుడు. అదివిన్న పాలి బింబిసారునిపై తన అవిశ్వాసాన్ని ప్రదర్శించి కోపంగా వెళ్ళిపోతుంది. అభయుడు సభ ఏర్పాటుచేసి పాలి వివాహ విషయాన్ని పరిష్కారం చేయటానికి పూనుకుంటాడు.

12

'కాని అకస్మాత్తుగా రేపే వైశాలి వెళ్ళిపోడానికి కారణ మేమిటి?'

'అది నా కోరిక.'

'కాని రెండు మూడు రోజులుండి వెళ్ళ్లదురు గాని.'

'కాదు, రేపే వెళ్ళాలి.' పాలి సంక్షిప్తమైన గట్టి జవాబు వినోద ప్రియుడైన ఆనందుడికి వినిపించింది. వృద్ధుడు అభిరాముడు ఒక తాళ పత్రం చూడడంలో మునిగి ఉన్నాడు. సోదర సోదరీల వ్యర్థ కలహానికి విసిగి అతడు తాళ పత్రాన్ని ఒక వేపు పెట్టి అన్నాడు — 'ఓహో, బాగు బాగు, అమ్మాయీ, నిన్ననే వెళ్ళాలి అనేమాట వచ్చినప్పుడు 'కాదు' అన్నావు. నేడు అందరూ కాదంటూంటే నీవు వెళ్ళడానికి సిద్ధపడ్డావు. నీ వెందుకోసం వెళ్ళ నిశ్చయించావో ఇది గర్హ్యం. అవునా, అమ్మాయీ?'

''ఏమీలేదు తాతా' అని పాలి మునపటి లాగే కోపంతో అంది.

'నీవూ అలాగే అంటున్నావా, తాతా. ఏనాడో పాలి నకారణంగా కోపించింది. నీవామె కోపానికి కారణం ఇప్పుడడుగుతున్నావా?'

'పోనీ నన్ను 'పిచ్చిది' అని అనకూడదా సోదరా? అవును, నేను పిచ్చిదాన్నే. నా కిప్పుడు కోపం తెప్పించకు. నేను రేపు ప్రాతఃకాలమే వెడతాను' అని పాలి ఉద్విగ్నమై అంది.

అభిరాముడు పాలిని శాంతింపచేయడానికి ఇలా అనసాగాడు—'కాని నీ నేటదిమందికి మించిన బాలికలను రేపటికి పిల్చావు. మీ అందరినీవెంటబెట్టుకొని ఆ గిరిజాబ్రాహ్మణి —మరచావా?— ఎక్కడికి తీసుకుపోతుం దమ్మా?.......'

'మీనాక్షి మందిరానికి' అని పాలి ముఖం తిప్పకుండానే జవాబిచ్చింది. 'అవునవును. ఆ పర్వతాలలోఉన్న మీనాక్షి ఆలయానికి తీసుకెడుతుంది. నేటినుండీ బాలికలు భోజనం నృత్యం ఇంకా అనేక విధాలైన వనక్రీడలు— వీని వూహలో ఉత్సాహితలై గ్రామంలో తిరుగుతున్నారు. మరి నీవు......'

'పోనీ తాతా, స్త్రీలకి మాట తప్పితే ఏ దోషం అంటదు. కాబట్టి రేపే పాలి వెడితే దోషమేమీలేదు.....'

'వాగ్దానంచేసి మోసపుచ్చడంలో స్త్రీ ఎక్కువ నిపుణురాలో, పురుషు డెక్కువ నిపుణుడో భగవంతునికే ఎరుక. నే నీ విషయంలో వాదించకోరను. రేపు నన్ను తీసుకు పోతావాలేదా?'

'తాతా, విశ్వసనీయా, బుద్ధిమంతురాలూ అయిన నీ ఈ ప్రియ పుత్రికకు ఏ జవాబివ్వాలో నీవే తెలుసుకో.'

'నాకేమీ తెలియదు........'

'అనగా రేపు నన్ను తీసికొని వెళ్ళ గోరడం లేదన్న మాట — ఇంతేనా?'

'ఏమైనా, నటరాజా మన అతిథి. అతడు రేపే వెడతానని చెప్తున్నాడు. మా కర్తవ్య మేమిటి, తాతా? అతడు వెళ్ళిన తరవాతనే యజమానుడనైన నేను ఇంట్లోంచి వెళ్ళాలి కదా?'

'అతిథి ఇష్ట ప్రకారం చేయడానికి అతడేమీ చక్రవర్తి కాడు. నేడు, ఇప్పుడే ఇక్కడ నుండి వెళ్ళాలని ఆజ్ఞాపించు.'

'తాతా, ఒక లిచ్ఛవీయ కన్య ఒక లిచ్ఛవీయ యువకుణ్ణి కర్తవ్యవిముఖుణ్ణిగా చేయకోరుతోంది. నన్ను రక్షించు తాతా, నేను ధర్మసంకటంలో ఉన్నాను.'

పాలి అంది — 'సోదరా, నేను పారవద్దాను. ఆ నీ అతిథిని నెత్తి నెక్కించుకొని పూజించు. ఇక్కడ నందీ గ్రామంలోనే ఉండు. చూడు, వైశాలి కెన్నడూ రాకు. లేకపోతే, కర్తవ్యచ్యుతుడ వవుతావు. తాతా, రథంకూడా ముందుకు వెళ్ళలేదని తోస్తోంది. అవునా? అశ్వాలు మేతకై విడవబడ్డాయి. కాబట్టి గ్రామంలో ఎక్కడా వాహనం లేదు. దొరకడం కష్టం. నిజమేనా? నేనెరుగుదును.. పోనీ. నేను కాలినడకనే వైశాలి చేరతాను.....'

'విన్నావా, తాతా? సింహరాజు మహామాముని ఏకైక పుత్రిక కాలినడకను వెడితే కళంకం నాకు వస్తుంది, అవునా? కాదు బాబూ, ఈ విషయంలో నా రాముడు నమ్మతించడు.'

పాలి రోషపూరిత కంఠంతో అంది — 'సోదరా, నేను రేపు ఉదయం వెళ్ళిపోతాను.'

ఇలా అని అతివేగంతో పాలి ఎవరి జవాబూ లెక్క చెయ్యక అక్కడ నుండి వెళ్ళిపోయింది. పాలి కళ్ళు అశ్రుపూరితాలై ఉన్నట్లు అతనికి సందేహం కలిగింది. అభిరాముడు పాలిని చూడకుండానే ఆమె కళ్ళు అశ్రువులతో నిండి పోతున్నట్లు నమ్మాడు.

'అకస్మాత్తుగా ఇద్దరికీ ఏం సంభవించింది, తాతా?' అని పాలి వెళ్ళిం తరవాత ఆనందుడు మెల్లగా అభిరాముణ్ణి అడిగాడు.

'నానెత్తి....' తాళపత్రం ఒక వైపుంచి అభిరాము డన్నాడు.

'నేటి ఉదయం నీకేమి చెప్పాను?

నిన్న పొద్దుట ఏం చెప్పాను? ప్రతి దినం ఉదయం, సాయంకాలం ఏం చెప్పుతాను? కాని, నీవు కూడా పాలి సోదరుడవేకదా. అతడెక్కడి రాజకుమారుడో అతిథిని ఎందుకడగ లేదు? ఇప్పుడే ఈ బాలిక బుద్ధిని సరి చేయ గలను..... కాని ఈ విషయం నువ్వడగవు, నన్నడగనీయవు.'

'కాని తాతా, ఇద్దరిలో......'

'అవును బాబూ, అవును. ఇద్దరికీ జగడమయింది. కావలసిందే. లేకపోతే మళ్లీ మరింత ప్రేమతో ఎలా కలుస్తారు? హద్దులేని ప్రేమకి హద్దు ఏర్పరచడానికి ఒకరు ఇంకొకరి కోసం కన్నీరు కార్చడం ఎందుకు? అబ్బాయీ, ఇవన్నీ వంకలు.... కొంత కోపం, కొంత విరోధం, కొంత మిషతో కూడిన కోపమో లేక రోషమో— ఇవన్నీ ఇద్దరినీ కలపడానికి కావలసిన సాధనాలు. నాకీ విషయం కొత్తకాదు. నీ తండ్రినీ ఇలాగే దెబ్బలాడుతూండడం నేను చూశాను. నీ పెత్తండ్రీ, మామా ఇలాగే చేసేవారు. కాని ఇప్పుడు కొంచెం ఆలోచించి విను— అతిథి రాజకుమారుడు, ఇందులో వాళ్లే మాత్రమూ సందేహం లేదు. అతడు సర్వగుణ సంపన్నుడని నీ నమ్మకం కూడాను. చక్రవర్తి అయ్యేయోగం అతనికి ఉన్నదనడంలో వేదాంతికి కూడా సందేహం లేదు. అయితే ఆలస్యం దేని కోసం? అతణ్ణి పిలు, మన మిప్పుడే అడుగుదాం. మహానాముడికి నేను నచ్చ చెప్తాను. లే, ఒకరికోసం ఒకరు వ్యాకుల పడే ఈ ఇద్దరిని గురించీ నిర్ణయిద్దాం. తరువాత నీవు నీదారినీ, నేను నాదారినీ పోదాం—'

ఇలా అని అభిరాముడు లేచి నిల్చు



న్నాడు. అతడానందుని చెయ్యి పట్టుకొని ఈడుస్తూ బింబిసారుని ఇంటి లోపలికి వచ్చాడు.

కాని అక్కడ మధ్యాహ్నపు ఎండలో ఎండి దూరం నుండి వచ్చిన శుష్కముఖుడైన బ్రహ్మదత్తుని యెదుట నిల్చున్నాడు. ఆనందుడాతని వైపు కోపంతో చూడ సాగాడు. అభిరాముడతణ్ణి ఒక సహాయ నటుడని భావించి బ్రహ్మదత్తు నడిగాడు— 'నటరాజెక్కడ?'

ఒక విధమైన కంపనం బ్రహ్మదత్తుని శుష్కమైన పెదవులను కదలింప సాగింది. అతని నోరు మూతపడింది. కొంత సేపయ్యాక ఒక్కసారిగా నవ్వి అన్నాడు — 'ఇ —క్క —డ'.

అభిరాముడూ ఆనందుడూ విస్ఫారిత నేత్రాలతో బ్రహ్మదత్తుణ్ణి చూడసాగారు. మూగవానిలా అభినయిస్తూ బ్రహ్మదత్తుడు చేసైగలతోటే, కనుసైగలతోటే బింబిసారుడు బయట కెక్కడికో వెళ్లాడనీ, కొంత సేపటిలో రాగలడనీ వారికి తెలియ జెప్పాడు. ఈ కొత్త మూర్తిని అభిరాముడు ఆసక్తితో చూడ సాగాడు.

సంభాషణలో పట్టు బడి పోతానేమో అను భయంచేత బ్రహ్మదత్తుడికా సమయంలో మూగాడు కావాలనే యుక్తి తోచింది. అభిరాముడు అతనిని పూరికే వదిలేవాడు కాడు. అతడు కొంచెం యోచించి ఆనందుడి చెయ్యి పట్టుకొని ఒక పట్టు పాన్పు మీద కూర్చున్నాడు. బ్రహ్మదత్తుని ముఖం తెల్లబార సాగింది. ప్రాసాదంలోనే అనేమిటి, బింబిసారుడు నంది గ్రామంలో కూడా లేడు.—

బింబిసారుడు వేగంగా పరుగెత్తి గంగా తీరంలోని - రాతి గుట్ట దగ్గరకు

చేరాడు. అతని దృష్టి నది కవతల వైపుకు పోయింది. చూడగానే అతని మనస్సు పాడయింది. అతడే దృశ్యాన్ని చూశాడో దానివల్ల అతడు కంపించాడు. గుర్రాన్ని దిగి, కిందికి వచ్చి, కేకవేసి నది యొడ్డున నున్న వటవృక్షం వైపు పరుగెత్తాడు.

వటవృక్షం క్రింద రాజ గృహానికి చెందిన వృద్ధ మహామాత్యుడు రక్తసిక్తమై పడి ఉన్నాడు. అతని కుడి చేయి తెగి దూరంగా పడి ఉంది. సంజయుడూ ఇతర యోధులూ మహామాత్యుడికి సమీపంగా నిలబడ్డారు. వాళ్ళ శరీరాల మీద రక్త బిందువులు చిమ్మబడి ఉన్నాయి. మహామాత్యుని క్షత స్కంధం నుండి రక్త స్రావాన్ని ఆపడానికి సంజయుడు వ్యర్థ ప్రయత్నం చేస్తున్నాడు.

'ఇది ఏదుష్టుని కార్యం? ఆరాక్షసుడెవడు?' అని ఆహతుడైన మహామాత్యుని దగ్గర కూర్చుంటూ అరచి బింబిసారు డడిగాడు.

'ఎవరూ కాదు మహారాజా, ఎవరూ కాదు' అని మహామాత్యుడు ఉత్తరమిచ్చాడు.

చనిపోయేటప్పుడు కూడా ధైర్యంతో ఉన్న మహామాత్యుడు నవ్వడం చూచి బింబిసారుని వక్షం పగల సాగింది. అతడు

'సంజయా, మహామాత్యుని భుజాన్ని ఏ కాపురుషుడి కరవాలం అంటింది?'

'కాపురుషుడు కాదు, మహారాజా, వీరుడను, నిర్భీతుడను. నిర్భీతుడైన ఒక వీర లిచ్ఛవీయ యువకుని ఖడ్గం ఈ వృద్ధ సైనికుని మూపున నాటి ఉంది.'

బింబిసారుడు పండ్లు కొరికి 'లిచ్ఛవీయుడా?' అన్నాడు — 'పితృతుల్యుడైన మహామాత్యుడు! ఈ వెలుగు చున్న సూర్యునిపై ఒట్టు పెట్టుకుని చెప్తున్నాను.....'

మహామాత్యుడు బింబిసారుణ్ణి అడ్డగించడానికి శిరం పైకెత్తి అరచాడు — 'మహారాజా, శాంతించండి, నేను చెప్పినట్లు చేస్తానని ప్రతిజ్ఞ చేయండని ప్రార్థిస్తున్నాను. అదేమిటో చెప్పనా?,

'నీ అభీష్ట మేమిటి, వయోవృద్ధుడా? ప్రాణం ఇచ్చి అయినా నేను దాన్నిపూర్తి చేస్తాను.'

ఆమ్రపాలి

'నా వీరమూర్తిని నేను ఎక్కడ గుర్తించ లేదూ?.... నాకు నామీద కంటె కూడా మీ మాటలలో ఎక్కువ విశ్వాసం ఉంది. దయచేసి మొట్టమొదట ఒక పని చెయ్యండి. నాకు మృత్యువు దాపురించింది. నదికి ముందు భాగంలో వైశాలి హద్దు సమాప్తమవుతోంది. నన్ను వైశాలికి చెందిన నేల మీద పరుండ బెట్టండి. సంజయా, నా ఖండితహస్తాన్ని కూడా తీసుకో, త్వరపడు.....'

బింబిసారుడు ఒక్కక్షణమైనా ఆలస్యం చేయకుండా, మహామాత్యుడు వద్దంటూన్నా, అతణ్ణి తన చేతులలో ఎత్తుకుని సంజయుని సహాయంతో నదికి అవతలి వేపున నున్న ఒక వృక్షం క్రింద అతణ్ణి పరుండ బెట్టాడు. అతని నాడులు తెగిపోడం ఆరంభించాయి. బింబిసారుని హస్తాన్ని దృఢంగా తన చేతిలో తీసుకొని భీష్మ పితామహుని లాగ అతడు చెప్పడం ఆరంభించాడు — 'ఆజాను బాహుడా, నీకంతా శీఘ్రంగా చెప్పాలి— అవివేకులైన కొందరు లిచ్ఛవీయులు సందేహించి మనల్ని అకస్మాత్తుగా ముట్టడించారు. అందరి కంటే మొదట నేనే దెబ్బ తిన్నాను. నా చేయి ఖండితమైంది. కాని నేనందరినీ హంతకులను ఎదుర్కోనీయలేదు. మాగధీయుల అందరి ఆవేశం ఆపివేశాను. దీని ఫలితం ఏమయిందో మీకు తెలుసా? ఒకరి నొకరు చంపుకోడానికి ఉద్యుక్తులై ఉన్న వందమందికి మించిన లిచ్ఛవీయులకూ, మాగధీయులకూ మధ్య యుద్ధం ఆగి పోయింది. శత్రువులు నన్ను చూచి విరోధం ఎచటి వెళ్ళిపోయారు. అందరికంటె ముందు నేనే లిచ్ఛవీయులకు ఎదురుగా వచ్చాను మహారాజా. కారణం, నేను వైశాలి వాడనవడం. నాచెయ్యి తెగి క్రింద పడ్డప్పుడు నీ మిత్రుడైన ఆ రాజ సన్యాసి గౌతమ బుద్ధుని మాటలు జ్ఞప్తికి వచ్చాయి. వానిలో నాకు సత్యం గోచరించింది. లిచ్ఛవీయుల్ని ఎదుర్కోకుండా ఉండడంలోనే నాకా సత్యం సాక్షాత్కరించింది. మహారాజా, ఆ సత్యాన్నే వినండి. లిచ్ఛవీయులు వీర క్షత్రియులు. మీరు వాళ్ళమీద శస్త్రం ప్రయోగించకుండా ఉంటే వాళ్ళూ ప్రయోగించరు. ప్రేమిస్తే వాళ్ళూ ప్రేమిస్తారు. సంవత్సరాల బట్టి వస్తూన్న పురాతన వైరాన్ని విడిచి పెడితే వాళ్ళు పూర్తిగా మీ వాళ్ళవుతారు. మహారాజా, నాజీవితంలో రెండే పెద్ద కోరిక లున్నాయి — చనిపోవడానికి ముందు లిచ్ఛవీయులూ మాగధీయులూ కలిసి ఉండగా చూడాలని మొదటి కోరిక. రెండవది, నా యీ జన్మ భూమిలోనే నా ప్రాణాలు పోవాలని. రెండో కోరిక ఇప్పుడే నెరవేరుతోంది, కాని మొదటిది మిగిలింది.... మహారాజా లిచ్ఛవీయుల్ని ప్రేమతో జయించడానికి శక్తితో ప్రయత్నిస్తానని ప్రకాశిస్తున్న సూర్యుడు మీద, ఈ గంగ మీద, ఈ వృద్ధుడి ప్రామాణికమైన సేవమీద శపథం చేయండి.'

మహామాత్యుని నేత్ర జ్యోతి లీనమవుతూండడం చూచి బింబిసారుడు తనశక్తిని కూడ దీసుకొని ఇలాఅన్నాడు— 'వృద్ధుడా, లిచ్ఛవీయుల్ని ప్రేమతో జయించడానికి నేను పూర్తి యత్నం చేస్తానని మాట ఇస్తాను. మీ జన్మ భూమిని మీదిగా చేయడానికీ నారాజ్యాన్ని లిచ్ఛవీయులదిగా చేయడానికీ......'

కాని బింబిసారుని వాక్యం పూర్తి కాకమునుపే బింబిసారుని శపథంలోని పూర్వ భాగం విని పులకితుడైన వృద్ధ మహామాత్యుని ఆత్మ పరలోక మార్గానికి పయనించింది. ద్రవిత హృదయాన్ని వశపరచుకొని బింబిసారుడు వృద్ధుని గౌరవార్థం పూజ్యభావంతో తలవంచాడు. ఒక్క ఎక్కిలిగాని, తుమ్ముగాని, స్వల్పమైన ఆక్రందనం గాని — ఏమీ వినిపించలేదు. పుణ్యాత్ముని మాటలూ, మహారాజు అంతిమ వచనాలూ మాగధీయుల్ని సంశయంతో నిల్చొలాగ చేశాయి. ఆజ్ఞ, ఆజ్ఞాపాలనం — రెండింటి మహత్వాన్నీ వాళ్ళెరుగుదురు. సంజయుడు కన్నీరు గారుస్తున్నా హృదయాన్ని కఠినంగా చేశాడు. మహామాత్యుని ఖండిత భుజాన్ని, ఖడ్గాన్నీ అతని దగ్గర ఉంచాడు. అప్పుడు ఇతర యోధులకు చితిని తయారు చేయడానికి ఉత్తరువిచ్చాడు.

అగ్నిహోత్రుడు ఒక్క పెట్టుగా మహామాత్యుణ్ణి భస్మం చేశాడు. ఆకాశాన్ని అంటే చితి మంటలలో బింబిసారుడు వృద్ధుని స్మితాననాన్ని చూస్తూ ఉన్నాడు.

కన్నీటి బిందు ఒకటి అతని కళ్ళ నుండి రాలింది. అప్పుడు అతడు మెల్లగా అనసాగాడు —

'నేను లిచ్ఛవీయుల్ని జయించడానికి శక్తి కొలదీ ప్రయత్నిస్తాను....'

సంజయుడూ, ఇతర యోధులూ నతమస్తకులై నిలబడ్డారు. తిరిగి రావడానికి అధిక ప్పైన ఆలస్యం చేస్తూరదని తలంపు కలగగానే బింబిసారు డొకసారి అగ్నిశయ్యకు అంతిమ నమస్కారం చేశాడు. మూడురోజులైన తరవాత రాజధానికి తిరిగివస్తానని మాటిచ్చిపోయి గుర్రంమీద కూర్చున్నాడు.

అశ్వం ఆమ్రపాలి ప్రాసాదం వైపుకు పరుగెడుతోంది. వృద్ధుని 'ప్రేమతో జయిందు' అన్న శబ్దాలు అతని హృదయంలో మాతనోత్సాహాన్ని వ్యాపింపజేశాయి. అతనికి మాటవల్ల ఒక కొత్త మార్గం లభ్యమైంది. ఇందుచేత అతడు శీఘ్రగతితో ప్రాసాదంవైపుకి పోతున్నాడు.

దాదాపు రెండు జాములవరకూ అభిరాముడు మూగ బ్రహ్మదత్తుడితో వాదిం



చాడు. నటరాజును గురించి మెల్లగా ఆ మూగవాని సహాయంతో యదార్థాన్ని తెలుసుకోడాని కభిరాము డెంతో యత్నించాడు. కాని బ్రాహ్మణుడు మాట్లాడనేలేదు. చివరి కభిరాముడు విసిగి ఆనందుణ్ణి వెంట తీసుకొని అక్కడనుండి వెళ్ళిపోయాడు. అతడు పోగానే అక్కడకు బింబిసారుడు ప్రవేశించాడు. అతణ్ణి చూడగానే దౌడకంటేఉన్న బ్రహ్మదత్తుని వాలుక కొంచెం కదిలింది. వ్యాకులం, మానసిక సందేహంతో వ్యధితుడైన బ్రహ్మదత్తుడు విశ్చేష్టుడై బింబిసారుని కాళ్లపై పడ్డాడు.

మహానాముని మరణ వృత్తాంతం విన్న బ్రహ్మదత్తున కిసుమంతైనా ఆశ్చర్యం కలగలేదు. సంజయునివద్దనుండి ఆహూతుడైన మహానాముని సమాచారాన్ని గ్రహించి అతడు బయలుదేరినప్పుడే మహామాత్యుని అంతిమ గడియలు లెక్కింపబడుతున్నట్లు అతనికి తోచింది. అయినా బ్రహ్మదత్తు డావేశ పూరితుడై ఏమైనా చేస్తాడేమో అని బింబిసారు డతనికి అక్కడనుండి పోడానికి ఆజ్ఞాపించాడు. తరవాత తా నొకచోటకూర్చుండి గాఢాలోచనలో నిమగ్నుడయ్యాడు.

ఆ సమయమందే తన శయనగృహంలో సందేహ వ్యూహంలోపడి ఆనందుడు అభిరాముణ్ణి ప్రశ్నమీద ప్రశ్న వేస్తున్నాడు.

'ఏ పురుషుని దగ్గర అట్టి మూర్ఖు లుంటారో అతణ్ణి ఏమని భావించాలి?'

'మహాధూర్తుడు కుమారా, ఈ నటుడు సామాన్యుడుకాడు. అతడు రాజవుతాడు. అప్పుడూ సామాన్యుడుకాడు!'

'తాతా, నా సందేహం ఎక్కువవుతున్నట్లు నాకు సంశయం కలుగుతోంది.'

'కావచ్చు. నీవు సందేహం కలవాడివి ఎందుకు కాదు? ఆనందా, మనుష్యులను గుర్తించడం ఎప్పుడు నేర్చుకుంటావు?'

'తాతా, ఈత డెవడో గూఢరాజ దూతలా ఉన్నాడు!'

'ఏల కాగూడదు?'

'ఎవడో గూఢచారి.'

'కానిమ్ము.'

'తాతా, నేను వేడుకకోసం చెప్పడంలేదు. ఇతడు తన రహస్యాన్ని ప్రకటించనిచో ఇతనిని శీఘ్రంగా తొలగించాలి.'

'అప్పుడుగదా?......సరే. ఇతడు స్వచ్ఛమైన నిస్వార్థ ప్రేయసుడైతే నీ వీతని ముక్కముక్కలుగ చేసినా ఇక్కడినుండి తొలగిపోడు.'

ఆమ్రపాలి

'తాతా, నేను నిజంగా భయ భీతుణ్ణి అవుతున్నాను. పాలిలో కల్పనాతీతమైన పరివర్తన కనబడుతోంది. ఈ నంద్రిగామం పాలి యెక్కడ? ఆ వైశాలి పాలి ఎక్కడ? తాతా, సూర్యుడు చంద్రుడైనాడు. నిప్పు నీరైనది......ఈ పరదేశి విచిత్రమైనవాడు! పరదేశి నిజంగా అద్భుతమైనవాడు కాకపోతే పాలి మనసు నొప్పించడం హిమాలయాన్ని కరగించడంవలె అసంభవం అని మీరంతా ఒప్పుకున్నారు!'

'పరదేశి నివాసం తెలిసినప్పుడే రెండవ మాట చెప్పడానికి సాధ్యమవుతోంది తాతా. నేను రేపు ప్రాతఃకాలమందే పాలిని ఇక్కడినుండి తీసుకొనిపోతాను!'

'కాదు......' అని ఎవరో నిషేధించడం వినవచ్చింది. ఆనందుడు ఉలికిపడి ద్వారం వైపునకు చూచెను. అచ్చట తలవాల్చియున్న రేవా నిల్చుంది.

'రేవా?......'అభిరాము డన్నాడు. రా, లోపలికి రా. 'కాదు' అని ఎందుకంటున్నావు? ఇంత రాత్రివేళ ఇక్కడా?..... అందరూ క్షేమంగా ఉన్నారా?'

'లేదు, తాతా. తండ్రిగారు ఆనందుని ఒంటరిగ వైశాలి వచ్చివేయమని ఆజ్ఞాపించారు. దేవి నిక్కడ ఉంచి వేయవలసిందని చెప్పారు!

'ఏమైనది, రేవా? ఏదైనా అశుభమైన సంఘటన జరిగిందా?

ఆనందుడు ఉద్విగ్నుడైనా ప్రశ్నమీద ప్రశ్న వేయసాగాడు. రేవా. స్వీకృతి సూచకంగా తల ఆడించి 'అవును' అంది. తరవాత పాలికోసం పరుక్కుని చావడానికి సిద్ధమైన లిచ్ఛవీయ రాజపుత్రులు, అభయుని ఆశ్రయంలో ప్రోత్సాహం పొందిన లిచ్ఛవీయ యువకులు, అభయునిచేత సంథాగారానికి ఆమంత్రితమైన లిచ్ఛవీయ పరిషత్తు మొదలైన సమస్త సంఘటనలను గురించి ఆమె సంక్షేపంగా తెలియజెప్పింది. పాలిని నంద్రిగామమందే ఆపి ఉంచవలసినదిగ మహానాముడు పట్టుదలతో చేసిన సూచననుకూడా ఆమె చెప్పింది.

అభిరాముడు, ఆనందుడు ఒకరినొకరు చూచుకొనసాగారు. సందేశాన్ని వినిపించిన తరువాత రేవా పాలి శయనం గృహం వైపు వెళ్లిపోయింది. ఆనందునితోకూడ మహానాముణ్ణి కలిసికోడానికి వైశాలి వెళ్లాలని అభిరామునికి కోరిక కలిగింది.

ఏదో మహా విపత్తురానిదే మహానాము డటువంటి ఆజ్ఞ ఎన్నడూ ఇవ్వడు. కాని పాలి రక్షణార్థం ఆనందుడు అతణ్ణి ఆపివేశాడు.

ఆ సమయమందే బింబిసారుడు కక్ష్యలో ప్రవేశించాడు. ఇద్దరూ ఉలికిపడి అతనివైపు చూశారు. మెల్లగా బింబిసారుడు ఆనందుని దగ్గరకువచ్చి కూర్చుండి గంభీర స్వరంతో అన్నాడు—'సామీ, నీవు లిచ్ఛవీయుడవు, పరాక్రమవంతుడవు. నేను చెప్పినదాన్ని శాంతియుతంగా విందునని మాట ఇయ్యి. నా మాటలు విన్న తరవాత కత్తి ఎత్తడం అవసరమైతే, గాయపరచడానికి ముందూ వెనకా, నేనుఈ పవిత్రమైన నిస్వార్థ ప్రేమలో ఆసక్తుడనై, నిన్ను నా వానినిగా చేసికొన గోరుచున్న ఒక పరదేశినని మాత్రం జ్ఞాపకముంచుకో.'

ఇట్లని అతడు వెంటనే ద్వారాన్ని బంధించివేశాడు. ముఖంమీద నేర్పుతో అంటించుకున్న వెంట్రుకలు, రంగు మొదలగువాటిని తీసివేశాడు. పిదప ఇద్దరివద్దకూ వచ్చి,ఇద్దరి హస్తాలనూ తన చేతిలోకి తీసుకొని మాట్లాడడం ఆరంభించాడు—'నే నెవడనో చెప్పడానికే ఇక్కడకు వచ్చాను'

ఆనందుడు, అభిరాముడు విస్మితులై అతనివైపు చూస్తూ ఉన్నాడు.

*   *   *

స్థానికమైన సభాసదులతోటే, లిచ్ఛవీయ ప్రదేశానికి చెందిన ఇతర స్థానాల నుండి వచ్చిన సభాసదులతోటే వైశాలీ సంథాగారం వృద్ధిఅవుతోంది. ఈ నెలలోనే మూడుసార్లు పరిషత్సభ జరుగుట చేత ఈసారి కొంత అధికమైన చాంచల్యం కన్పిస్తోంది. నేడు పాలిని గురించిన విషయం ప్రసంగింపబడుతుందని ప్రతి సభాసదుడూ, దాదాపు ప్రేక్షకులంతా ఎరుగుదురు. కాని ఈ ప్రసంగానికి వెనక అభయుని కూటనీతితో కూడిన సంబంధం కూడా ఉంది. దీనికి ఫలితమేమంటే, లిచ్ఛవీయ నాయకులు పాలిని గురించి అనేకమైన అపవాదులు వేయడాని కారంభించారు. దీనివల్ల ప్రతి వ్యక్తీ ఆసక్తితో ఏదో భయంకరమైన ఉల్కాపాతం కోసం ఎదురుచూడసాగాడు.

పట్టుదలతో ఏదైనా వస్తువును కోరినప్పుడు దానిని ప్రాణమిచ్చో లేక ప్రాణం తీసో పొందడం యుద్ధప్రియులైన లిచ్ఛ

వీయులకు స్వాభావికమైన విషయం. ఈ పట్టుదల మూలంగానే వాళ్ళప్పుడప్పుడు తమ శక్తియొక్క హద్దును ఉల్లంఘించే వారు. నేడు కూడా సంథాగారంలో అట్టి వాళ్ళు ఒకళ్ళిద్దరు కారు, ఐదు వందల లిచ్ఛవీయ యువకులున్నారు. వాళ్ల హృదయజ్వాలని అభయుడు ప్రజ్వలింప జేసిన తరవాత ఇప్పుడు వేగంగా మండింది. ప్రతియువకుడూ పాలికోసం తన ప్రాణం ఇవ్వడానికి సంసిద్ధుడయ్యాడు. ఆ బుద్ధిహీనులైన భావుకులను అభయుడు తన జన్మ హక్కులకోసమూ, స్వయంగా మహానాముణ్ణి యుద్ధాని కాహ్వానించడానికీ, మంచి దక్షతతో ప్రోత్సహించాడు. వాళ్ళకిప్పుడు నచ్చచెప్పడానికి అభయుడు వెళ్ళినా వాళ్ళు అతనితో కలహించడానికి సిద్ధపడతారు. సంథాగారంలో ఒక సుందరికై లిచ్ఛవీయులు పోరాడి మరణించడం కొత్త విషయమేమీకాదు. నేటికి ముప్పది సంవత్సరాలకి వెనక అభయుడు స్వయంగా అప్పటి దేశ వర్తకి రేణుక కోసం పోరాడి జయాన్నికూడా సాధించాడు......నేడూ విజయమతనిదే.

చిత్తా నక్షత్ర తీవ్రతాపం యువకుల్ని దహించివేసింది. కాబట్టి సభాసదులకు మామిడి, నేరేడు, ద్రాక్ష మొదలైన వాని రసం పంచిపెట్టబడసాగింది.

సంథాగారం క్రిక్కిరిసిఉంది. కేవలం మహానాముడిదే ఆలస్యం. ఈ విషయాన్ని గురించే ఒకవైపున ఒక యువకుడూ,మరొక వైపువ వృద్ధులూ రక రకాలుగా తర్కిస్తున్నారు......అక్కడ సభాసదులలో ఈ విషయాన్నిగూర్చి దుఃఖించే వ్యక్తులూ ఉన్నారు. వీరందరికీ మహానాముడితో ఇతర విషయమందు అభిప్రాయభేద మున్నా, మహానాముని శౌర్యం, నీతి, న్యాయ తత్పరతల ముందు వాళ్ల మస్తకాలు వంగిపోతాయన్నది మాత్రం నిశ్చితం. ఈ విషయంలో అతని శత్రువులూ అతణ్ణి ప్రశంసిస్తున్నారు. ఒక ఆద్భుర లిచ్ఛవీయుని పేర్కొన్నప్పడు సమస్త వైశాలి కళ్ళు అతనిమీద లగ్నమవుతాయి. ఆ వైశాలీ దేశ నాయకుని పుత్రిక భవిష్యం నేడు సంథాగారంలో నిశ్చితం కాబోతోంది. దానిని నిర్ణయించడానికే నే డిక్కడ రాజులు, రాజప్రతినిధులు, గణాలూ చేరాయి. ఇది ఒక ప్రబలమైన మానసిక సంఘర్షణ. ఇందు తత్తరపాటు అధికంగా ఉంది. దుఃఖం గాఢమైనా లజ్జ అత్యల్పంగా ఉంది.

(సశేషం)

వెలుగుబాట

(12వ పేజీ తరువాయి)

మాటలేవీ తలకెక్కడంలేదు. ఎన్నో ఆలోచనలు ఉప్పెనగా ఆమెని ముంచెత్తాయి. ఉపన్యాసం ముగిసినా ఆ సంగతి ఆమెకి గుర్తులేదు. అందరూ లేచి అతను కూర్చున్న చోటికి వెళ్ళి నమస్కరించి వెడుతున్నారు.

"చాల బాగుంది కాదూ! అద్భుతమైన శైలి! ఎంత వేదాంతమైనా వినుగెత్తకుండా వినబుద్ధి వేస్తుంది. చిన్నపిల్లలకి కూడ బోధపడే అంత బాగా చెపుతారు...తిండి తిప్పలు కరవై పొట్టపోసుకోడానికి సన్యాసం పుచ్చుకున్న దొంగసన్యాసి కాదాయన. ఆయన చరిత్ర వింటే ఆశ్చర్యపడతావేమో! ఎం.ఏ. ప్యాసయ్యారు. మంచి ఉద్యోగం, బోలెడు పొలాలు, యిల్లు—అన్నీ వదులుకున్నారు. ఎందుకో ఆయనకి విరక్తి కలిగింది. రామకృష్ణ మిషన్లో చేరారు. ఆస్థి అంతా మిషన్కే రాసిచ్చారు....

"గోదావరి వడ్డున పూరిపాకలో మకాం. చిన్నపిల్లలకి పాఠాలు చెపుతారు. పెద్దలకి పురాణగ్రంథాలు, వేదాంతగ్రంథాలు చదివి చెపుతారు. అందుకు ప్రతిగా ఊర్లోవాళ్ళు వంతులు వేసుకుని రోజు ఆయనక్కావలసిన పళ్ళుపాలు పంపుతారు. ఆయనంతట ఆయన ఎవరినీ దేనికి యాచించరు. వీళ్ళు పంపినవి ఆయనకి ఎక్కువైతే పేదలకు పంచిపెడుతారు..... సంవత్సరానికి ఒకవూరు చొప్పున తిరుగుతున్నారు, ఇక్కడికి వచ్చి ఆర్నెల్లయింది."

దారి పొడుగునా శ్యామల స్వామివారి గురించి చెప్తూనే ఉంది. కృష్ణవేణికి ఆకాశం, నేల, పైకి క్రిందికీ గుండ్రంగా తిరిగి స్థలాలు మార్చుకుంటున్నట్టుంది.

ఏమయింది, మధుకి, జీవితం మీద అంత విరక్తి పుట్టడానికి! తనలో పెల్లుబుకుతున్న ఉద్రేకాన్ని అణుచుకుంటూ "నేనాయనతో మాట్లాడాలి!" అంది కృష్ణవేణి.

"మాట్లాడ లేకపోయావా? యింతకన్న మంచి సమయం ఎప్పుడు దొరుకుతుంది? మిగత సమయాల్లో ఆయన చదువు చెపుతోనో, ధ్యానంతోనో ఉంటారు, ఆ సమయాల్లో ఆయన సాధారణంగా ఎవరితోనూ మాట్లాడరు!" నడుస్తున్నదల్లా ఆగింది శ్యామల.

అంతమందిలో ఏం మాట్లాడుతుంది? ఎలా?

"వద్దులే, యిప్పుడుగాదు!" యింటికి వచ్చేసింది కృష్ణవేణి.

ఒకరు మనకి చేసిన అన్యాయానికి ప్రతిగా మనకి మనం శిక్ష వేసుకుని సత్యాగ్రహం చెయ్యడంలో ఒకరకంగా పగ తీర్చుకున్నామన్న తృప్తి కలుగుతుంది. తను పెళ్ళి చేసుకోకుండా త్యాగంచేసి ఒకవిధంగా తన కసి తీర్చుకోగలిగిందనీ, అతన్ని సాధించగలిగిందనీ అనుకుంది. కాని ఆమె అంచనాలన్నీ తారుమారయ్యాయన్న సత్యం ఎదుట నిలవగానే ఆమెకి దిక్కు తోచనట్లయింది. యిక ముందేమిటి చెయ్యాలి? తను ఒక్క సంసార సుఖాన్నే వదులుకుంటే, అతను మొత్తం అన్నీ వదులుకున్నాడు!

ఆ మర్నాడుదయం, ఒంటరిగా అతనున్న చోటికి నడచి వెళ్ళింది కృష్ణవేణి.

ఒకటే రాట మీద వేసిన చిన్నపాక. పక్కల్న గోడల్లాంటివేం లేవు. చూరు క్రిందకంటా దిగింది. నేల నెరియలు తీసి గట్టిపడింది. కొబ్బరి ఆకుల్తో అల్లిన చాపల్లాంటివి రెండుమూడు, ఒక కుండ, మూకుడు, మట్టిచెంబు, ఒకటో రెండో ఆరవేసిన కాషాయ గుడ్డలు, ఒక క్రర చెక్క మీద పదో పన్నెండు పుస్తకాలు. అవీ అతని ఆస్థి!

ఆమె వెళ్ళేసరికి అతను నేల మీద మఠం వేసి కూర్చుని ఏదో పుస్తకం చదువుతున్నాడు. ఆమె పాక ముందు నిలబడి లోపలంతా కలయ చూసింది. కన్నీళ్ళు పెల్లుబికాయి.

"ఎవరు?.. కృష్ణా! ఇవాళ ఎంత సుదినం?" నవ్వాడతను, కూర్చున్న చోటునించి కదలకుండానే.

ఆమె అలాగే నిలబడింది.

"నీ కభ్యంతరం లేకపోతే లోపలికి రావచ్చు..కాని..నిన్ను కూర్చోపెట్టడానికి యీ చాపలు తప్పించి ఏంలేవు!" లేచి ఓ చాప ముందుకు వేశాడు. అతని గొంతులో ఏ తడబాటు, ఆందోళనలేదు. ఆనందం, విచారం, సంతోషం, బాధ లాంటివేవి ఎరగని ప్రశాంతత అతని మొగంలో, మాటల్లో మెరుస్తోంది.

మౌనంగా కదిలి కూర్చుంది కృష్ణవేణి ఆమె అంతవరకు వేసుకున్న చెలియలి కట్ట తెగిపోతూంటే, మోకాళ్ల మధ్య తల యిరికించి కన్నీళ్ళు దాచుకుంది.

"ఎందుకేడుస్తావు వేణూ! ఏమిటి నీ బాధ? నాతో చెప్పకూడదా?" అదే గొంతు! ఏ కదలిక, సంచలనంలేని ఆ ధోరణికి ఆమె తట్టుకోలేకపోయింది.

"మధూ, ఏమిటిదంతా?" ఒక్కసారి విసురుగా తలెత్తి గట్టిగా అడిగింది. కళ్ళు జోత్యుల్లా ఎర్రగా వున్నాయి.

"నీకు తోచినట్టు నువ్వు పిలవచ్చుగాని, నా పేరదిగాదు యిప్పుడు!"

"ఏమిటది?"

"ఏమయింది?" అదే చిరునవ్వు!!

"ఎందుకు నన్ను చిత్రవధ చేస్తావు యీ మాటల్తో? నన్ను కాలుస్తున్న అనుభూతులు నీలో కలగడంలేదా? ఎందుకిలా రాయైపోయావు? యిలా యెందుకు మారాల్సి వచ్చింది? ఎవరు మారమన్నారు? ఎవరికి శిక్ష యిది?"... ఆవేశంతో అడిగింది కృష్ణవేణి.

అతను మాట్లాడలేదు. మొగంలో మార్పులేదు. కళ్ళు నిశ్చలంగా దూరంగా చూశాయి.

"మధూ, నన్ను మోసం చెయ్యకు! నీ మనసులో రేగుతున్న తుఫానుల్ని బలవంతాన ప్రశాంతత ముసుగు కప్పి అణచాలని చూడకు! నిన్ను ప్రార్థిస్తున్నాను...ఎందుకు, ఎందుకిలా అయావు?"

అతను పొడుగ్గా ఊపిరి తీసి మరొకసారి నవ్వాడు. ఆ నవ్వు చాల లోతుగా ఆమెని తాకి చకితురాలిని చేసింది.

"ఎందుకంత ఆవేశం కృష్ణా! నీ కంత వినాలని కుతూహలంగా ఉంటే, దాచాలని నాకూలేదు. అలా బయటికిరా, ఆరుబయట గోదావరిఒడ్డున కూర్చుంటే బాగుంటుంది" అతను లేచి ముందు నడిచాడు. ఆమె అనుసరించింది.

దర్భగడ్డి దుబ్బుల్లోంచి క్రిందికి యిసకలోకి దారితీశాడు. యిసకలో వేళ్ళలాగ నీటిపాయలు రెండుమూడు అంగుళాల లోతున పారుతున్నాయి. స్వచ్ఛమైన నీటి జాలు క్రింద రంగురంగుల గులకరాళ్ళు మెరుస్తున్నాయి. యెదురుగ్గా లంకల్లో జొన్నచేలు. మంచె. యిటుప్రక్క ఒడ్డున తెల్లగా కాలిన నేల. అక్కడక్కడ ఎత్తయిన దిబ్బలు, శ్మశానాన్ని గుర్తు చేస్తున్నాయి. కొంచెందూరంలో ఆకులన్నీ రాల్చిన మోడు కొమ్మలతో పెద్ద రావిచెట్టు. ఎర్రటి ఇటుకల మీద మొల్చిన మొక్కల్తో పాడుబడ్డ శివాలయం, దూరంగా అవతలి పాయలో నీలంగా గోదావరి. చుట్టుప్రక్కల ఎవరూ లేరు. రెండుమూడు ఫర్లాంగులు దూరాన పశువుల్ని మేతకోసం లంకల్లోకి తీసుకెళ్తున్న పాలేర్లు పదాల్లు, కొంగలు, గరుడ

పక్షులు చేసే కూతలు తప్ప యింకేం శబ్దం లేదు.

ఒక నీటి జాలు ప్రక్కగా యిసకలో కూర్చున్నారిద్దరూ.

"యిప్పుడు కురిపించు నీ ప్రశ్నలు!" నవ్వుతూ అన్నాడు.

"పార్వతి ఏమయింది?"

"చనిపోయింది, ప్రసవించలేక."

వెలుగుబాట

చనిపోయింది తన భార్య కానట్టు అతనంత మామూలుగా చెప్తే, ఆ నిర్లిప్తతతో విషాదం ఆమె భరించలేక మూగబోయింది చాలసేపు. ఏదో పెద్ద నేరం చేసినట్టు, ఆమెని తనే హత్య చేసినట్టు అనిపించింది. అతనంతట అతనే యింకా యెన్నో చెప్తాడని ఆశించిన ఆమె, అతని మౌనాన్ని భంగం చేస్తూ విధిలేక అడిగింది.

"అప్పుడు..నన్నంత సులభంగా ఎలా మర్చిపోగలిగారు?"

"మర్చిపోయానా?..నిన్నా, లేదే! అప్పుడు పరిస్థితులలా వచ్చాయి.

ఆనర్సు పూర్తయి యింటికి వెళ్ళగానే నాన్న పెళ్ళి సంగతి తెచ్చారు" ఆమె ప్రశ్న నర్థం చేసుకున్నట్టు అతను చెప్పడం మొదలుపెట్టాడు.

"కృష్ణా, చిన్నప్పటినించి, నేను దురదృష్టవంతుడినే! నేను పుట్టగానే అమ్మ పోయింది. అమ్మని అతిగా ప్రేమించే నాన్నకి నేను పుట్టగానే అమ్మపోవడం నా మీద ఆయన కొక విధమైన నిర్దయకు కారణం అయింది. నన్ను చూడ్డమే మహాపాపం అన్నట్లుండేవారు. ఆయా దయాధర్మాల మీద ఏ అలానా, పాలనా, ముద్దుముచ్చటా లేకుండానే గాలికి అయిదేళ్ళు పెరిగాను. ఇంట్లో అక్క, అన్నలు అందరూ నన్ను వెలేసినట్లుండేవారు. అందుకే చిన్నప్పటినించి కూడ నాకు ఎవరితో కలవకుండా, ముభావంగా వుండడం అలవాటయింది. నాకు అయిదేళ్ళప్పుడు, అత్తయ్య, తన రెండేళ్ళ కూతురు పార్వతిని వెంట పెట్టుకుని, భర్త పోగా మా యింటికి చేరింది. అంతవరకు నాకు కరవైన ప్రేమాభిమానాలు చూపెట్టింది. తన కూతురుతో సమానంగా పెంచింది. అత్తయ్య బోధలవల్ల నాన్న ధోరణి కొంత మారింది. పదిహేనేళ్ళు ఆమె చేతిలో పెరిగాను. చిన్నప్పటినించి ఇంటా, బయట పార్వతి, నేను భార్యాభర్తలమనే భావంతో అందరూ మాటలాడేవారు. అయినా నేను ఎప్పుడూ ఆ భావంతో ఆలోచించలేదు పార్వతిని గురించి. అలాగని విముఖతా వుండేదికాదు.

నాన్నగారు, పార్వతితో నా పెళ్ళి మాటెత్తగానే, నేను మాట్లాడలేదు. ఆయన వెంటనే రెచ్చిపోయారు. మన సంగతి ఆయనకి ఎలాగో తెలిసింది. ఎలాగో తెలిసింది కదా అని నేను మన సంగతి చెప్పి, మన నిర్ణయం చెప్పగానే, నాన్నగారి ఆగ్రహావేశాలకి అంతులేకపోయింది. అత్తయ్య అడ్డుపడి తీసుకెళ్ళి, బతిమిలాడింది, నచ్చ చెప్పబోయింది, కన్నీరు పెట్టుకుంది. "చిన్నప్పటి నించి అనుకున్నది, యిప్పుడిలా చేస్తే యింక పార్వతి గతేమిటి?"



అని ప్రాధేయ పడింది, నిష్ఠూర్యా లాడింది...... అయినా నేను వినలేదు.

"పార్వతి అందంగా వుంటుందా, వుండదా అని నేను ఆలోచించ లేదు. అందుకు నువ్వు కారణం! కాని.....

పెద్దగా వివరణలు అనవసరం. ఆ తర్వాత పది రోజులు యింట్లో ఎంత రభస జరగాలో అంత జరిగింది. అత్తయ్య పస్తులు పడుకుంది. నాన్న గారు అనేకరకాల బెదిరించారు. ఆఖరి అస్త్రంగా పార్వతిని పంపారు. పార్వతి కన్నీరుకి కూడా నేను కరుగలేదు.

ఏదో బ్రతకడం కోసం అన్నాళ్ళు బ్రతికిన నేను...... నీ స్నేహంతో, నీ మాటలతో, నీ సహచర్యంతో క్రొత్త జీవితాన్ని...... జీవితంలో ఆనందాలని వెలుగుని రుచి చూసిన నేను, ఏమయినా నిన్నంత సులభంగా వదులుకోడానికి యిష్టపడ లేదు. దేన్నయినా ఎదుర్కోడానికి సిద్ధపడ్డాను నీ కోసం!

"కాని...... చివరికి ఒక రాత్రి..... అర్ధరాత్రి! పార్వతి నూతిలో పడింది! నాకోసం ఒకరు నిండు ప్రాణం తీసుకోడానికి సిద్ధపడిందంటే, ఆ పని మూర్ఖత్వమే అయినా, నేను తట్టుకోలేక పోయాను. ఇంటా బయట నేనో హంత కుడినన్నట్టు చూస్తూంటే భరించలేక పోయాను. అందరూ ఏమన్నారో, ఏం చేశారో, ఎలా నా చేత 'ఊ' అనిపించారో నేను తెలుసుకునే లోపలే, హడావిడిగా, మళ్ళీ మనసు మార్చుకోకుండా, పది రోజుల్లో దైవసన్నిధిని పార్వతిని నా భార్యగా చేసేసారు.

"పెళ్లయ్యాక, నేను ఒక ఏడాది అసలు పార్వతిని కన్నెత్తి కూడ చూడ లేదు. కాని నా మూర్ఖత్వానికి బలై పార్వతి కృశించి పోవడం ఎంతో కాలం సహించ లేక పోయాను. నాన్న, అత్తయ్య వాళ్ల కోరిక నెరవేర్చుకుని తృప్తిగా చనిపోయారు.

"కృష్ణా, నాబలహీనతకి, నిన్ను దూరం చేసుకుని నేను ఎంత బాధ పడ్డానో నీకు తెలియదు! నా అశక్తతకి నిన్ను ఖిన్నపెట్టిన నేను పడ్డ ఆవేదన నీకు అర్థం అవదు. క్షమించమని అడిగే ధైర్యం కూడ లేక, నీకు ఎన్నో సార్లు ఉత్తరం రాయడానికి పూనుకొని కూడ మానుకున్నాను. ఏ సంగతి తెలియక,

వెలుగుబాట

నీవు పడే ఆరాటం తెలిసినా, సంగతి తెలిపే ధైర్యం లేకపోయింది.

పార్వతిని నీ దగ్గరకు తీసుకు వచ్చినపుడు, అసలు నీవని తెలియదు. తీరా చూశాక, నీవు నాపట్ల ఎంత ఏహ్యం పెంచుకున్నావో చూసి, అప్పుడయినా, నా నిర్దోషిత్వం తెలుపుకుని క్షమాపణ కోరుకుందా మంటే నీవు, నాకా అవకాశం యివ్వ లేదు....

పార్వతిలో తల్లినవాలనే కాంక్ష వుండేది .... కాని ఆమెలో ఏదో సరిగాలేదని, మరోసారి గర్భం ధరిస్తే, ప్రమాదం అని మూడోసారి డాక్టర్లు హెచ్చరించినా, పిల్లల మీద మమకారం అణుచుకో లేక, ఎంత చెప్పినా వినక ప్రాణం పోగొట్టుకుంది. పాపం..... పార్వతి తల్లి నవ్వాలన్న కాంక్ష తీర కుండానే కన్ను మూసింది. అదే నాకు బాధగా వుంది.......

మొదట నిన్ను, ... తరువాత పార్వతిని పోగొట్టుకున్నాక, యింక నాకు భగవంతు డొక్కడే మిగిలాడు....." —


అతని మొగంలో ఒకరకమైన తీవ్రత, గంభీర్యం కనపడ్డాయి. కృష్ణవేణి చాల సేపు మాట్లాడలేదు. ఆమెకెన్నో క్రొత్త విషయాలు తెలిశాయి ఒక్కసారిగా.

"నిన్న సాయంకాలం నన్ను చూశారా?" మెల్లిగా అడిగింది.

"చూశాను." అతని మొగంలో తీవ్రత పోయి, మళ్లా ప్రశాంత మైన చిరునవ్వు విరిసింది. యింకేమన్నా చెప్తాడేమోనని ఆశించింది. కాని అత నింకేం మాట్లాడలేదు.

మరో ప్రశ్న అడగాలనుకుంది కృష్ణవేణి. కాని అడగడానికి ధైర్యం చాలలేదు. అతనిచ్చే జవాబు ఆమెకి తెలిసినట్టని పించింది. ఆ జవాబు అతని నోట వినడం ఆమె భరించ లేదు.

లేత ఎండ నీటిజాలుమీద జిలతారు మెరుగులు దిద్దు తూంటే తడయిన కళ్లతో అతనికి చేతులు జోడించింది కృష్ణవేణి. ఆమెకో వెలుగ బాట కనిపించింది.— ●



విశాలమైన మైదానంలో సైనికులు బాణాలు గురి చూచి వేయడం నేర్చు కుంటున్నారు. మౌల్వీ నసీరుద్దీన్‌తో కలిసి తైమూరు అక్కడికి వెళ్ళేడు.

రాజు మౌల్వీని ఇల్లా అడిగేడు

"ఏమయ్యా! నువ్వు జీవితంలో ఎప్పుడైనా విల్లు ఎక్కుపెట్టి బాణం వేశావా?"

తన చేతకాని తనాన్ని ఒప్పుకోడానికి మౌల్వీ సిగ్గు పడ్డాడు.

"చిన్న తనంలో బాగా వేసే వాడిని. ఇప్పుడు పెద్దతనం వస్తోంది. విల్లు పట్టుకుని ఏళ్ళూ పూళ్ళూ అయి పోయింది. వెనకటి చాక చక్యం రమ్మంటే వస్తుందా?"

అదివిని విల్లూ, బాణాలూ మౌల్వీకి అందిమ్మని హుకుంచేశాడు రాజు. ఇంత వరకూ వచ్చాక ఇప్పుడు తప్పించు కోడానికి మరోదారి లేక విల్లు అందు కున్నాడు మౌల్వీ. బాణానికి వంకలు తీర్చి, వింటికి తొడిగి, నారి చెవిదాకా లాగి, గురి చూచి వది లేడు.

గురికి పది బారల దూరంలో వెళ్ళి పడింది బాణం!

"ఇదిగో తమ సైనికులు బాణాలు ఇంత బాగా వేస్తారు. సరియైన తరిఫీదు ఉంటేగా" అన్నాడు మౌల్వీ తడుముకోకుండా.

నవ్వడానికి నోరు తెరచిన తైమూరు గమ్మున మూసుకున్నాడు.

మరో బాణం సంధించి మౌల్వీ మళ్ళీ వదిలేడు. అది కూడా గురికి బారెడు దూరం నుంచి దూసుకు పోయింది.

"ఇదిగో తమ అంగరక్షకుల అస్త్ర కౌశలం ఇల్లా ఉంటుంది."

ఇల్లాగ ఒకదాని తరువాత ఒకటిగా బాణాలు వేస్తూ, గురి తప్పినప్పుడల్లా ఎవరెవరినో ఆక్షేపిస్తూ వచ్చాడు. ఆఖరికి కాకతాళీయంగా ఒక బాణం వెళ్ళి లక్ష్యంలో గుచ్చు కుంది.

"మౌల్వీ నసీరుద్దీన్ అయితే ఇదిగో ఇలా వేస్తాడు" అన్నాడు మౌల్వీ. ●

మౌల్వీ నసిరుద్దీన్ కథలు

— మహీధర్ నళిని మోహన్

తైమూర్ ఒక రోజున మౌల్వీని అడిగేడు "నామీద నీకు నిజంగా ప్రేమ ఉందా?"

"అయ్యా! నేను నసీరుద్దీనుని. తమరు తైమూరు ప్రభువులు. కనుక, మౌల్వీ నసీరుద్దీన్ తైమూరును ప్రేమించ వలసిన ఫక్కీలో నేను మిమ్మల్ని ప్రేమించ గలను" అన్నాడు మౌల్వీ.

రాజుకి ఆ సమాధానం తృప్తి కలిగించ లేదు.



"నువ్వు నాతో చావడానికి సిద్ధం కాగలవా?"

"సిద్ధం కాలేక పోతే మీ భటులు నేర్పుతారు"

"తక్షణం వెళ్ళి సముద్రంలో పడమంటే పడతావా?"

వెంటనే లేచి ప్రయాణమయ్యాడు.

"ఎక్కడికి" — తైమూర్ అడిగేడు.

"ప్రభువులు చల్లగా చూడాలి కాని, తమ కోసం సముద్రంలో దూకడం కన్న నాకు కావలసిం దేమిటి? కాని, తమ సెలవైతే వెళ్ళి ఈత నేర్చుకు వస్తాను" అన్నాడు మౌల్వీ. ●

'కీర్తిశేషులు' నాటకం, తారల వినోద ప్రదర్శనలు

1966 జూలై 31 తెలుగు చలన చిత్ర లోకానికి అపూర్వమయిన రోజు.

నిరంతరం షూటింగులతో తీరిక లేని కళాకారులంతా ఒక చోటచేరడం, ఒకరి కొకరు అప్యాయంగా పలుకరించు కోవడం — లాంటి వెన్నో అవాళ జరిగినవి. సినిమా జీపులకు ఇలాంటివి కొత్త గాక పోయినా, ఆ రోజు మాత్రం చూసే వారికి అపూర్వంగా తోచింది. శ్రీ యన్. టి. రామారావు, శ్రీ అక్కినేని నాగేశ్వరరావు కరచాలనం చేసుకుని ఒకరి పక్క మరొకరు కూచుని కులాసాగా మాట్లాడు కోవడం ఒక విశేషమయితే— వారి మధ్యకు ప్రఖ్యాత తమిళ నటుడు శ్రీ ఎం. జి. రామచంద్రన్ రావడం, వారిని శ్రీ రామారావు, శ్రీ నాగేశ్వరరావు అభినందించి కూచోబెట్టడం మరొక విశేషం!


కీర్తిశేషులయిన కళా కారులు శ్రీయుతులు కస్తూరి శివరావు, కె. వి. యస్. శర్మ, కె. అచ్యుతరావు కుటుంబ సభ్యుల ఆర్థిక బాధా నివారణకు నిధిని సేకరించడం కోసం— తారల వినోద కార్యక్రమం, "కీర్తి శేషులు" నాటకం ఏర్పాటు చేశారు శ్రీ జైహింద్ సత్యం. ఆయన పిలుపు విని చిన్నా — పెద్దా తర తమ భేదం లేకుండా తెలుగు చలన చిత్ర రంగంలోని కళాకారులంతా దాదాపు వచ్చారనే చెప్పాలి. ఈ ప్రదర్శనలు స్థానిక ట్రిప్లికేన్‌లోని యన్. కె. టి. కళా మండపం (హిందూ గర్ల్స హైస్కూలు) ఆవరణలో జరిగినవి.

ఈ ప్రదర్శనల్లోని మొదటి అంశం: సిపాయి — శ్రీ సత్యనారాయణ (సిపాయి కూతురు) ఆ వేషాన్ని పోషించారు. రెండవది: శ్రీ రమణారెడ్డి ఐంద్రజాలిక— ప్రదర్శనం. మూడవఅంశం: చింతామణి నాటకం నుంచి ఒక దృశ్యం. శ్రీ చదలవాడ కుటుంబరావు, శ్రీ పిఠాపురం నాగేశ్వరరావు పాల్గొన్నారు. నాలుగవది: ఒథెల్లో (షేక్స్పియర్ నాటకం) నుంచి ఒక దృశ్యం: కుమారి వాసంతి, శ్రీ ముక్కామల కృష్ణమూర్తి నటించారు. అయిదవది: నాటకమూ కాదు, సినిమా కాదు: కుమారి రాజశ్రీ, శ్రీ రాజనాల చేశారు. ఆరవది: సక్కుబాయి నాటకం నుంచి ఒక దృశ్యం. శ్రీ మతులు అంజలీదేవి, సూర్యకాంతం, మీనాకుమారి పాల్గొన్నారు. ఏడవది: భజరంగ శాస్త్రి శ్రీ కాంతారావు, వాణిశ్రీ నటించారు. ఎనిమిదవది: చెంపదెబ్బ. కుమారి గీతాంజలి, పద్మనాభం, శోభన్‌బాబూ, బాలకృష్ణ, రామచంద్రరావు పాల్గొన్న హాస్య ప్రహసనం. తొమ్మిదవది: తిరుపతియాత్ర. ఇందులో దర్శకులు శ్రీయుతులు బి. ఏ. సుబ్బారావు పాల్గొనడం ఒక విశేషం. పదవది: శ్రీ వేణుమాధవ్ అనుకరణ స్వర్గస్తులయిన కస్తూరి శివరావు, కె. వి. యస్. శర్మల గొంతుల్ని అనుకరించారు. పదకొండవ అంశం: శ్రీ భమిడిపాటి రాధాకృష్ణ వ్రాసిన "కీర్తి శేషులు" నాటకం. సుమారు రెండు గంటల సేపు సాగిన యీ నాటకంలో శ్రీయుతులు అల్లు రామలింగయ్య, ప్రభాకర రెడ్డి, రావు గోపాలరావు, కాకరాల, ప్రసాద్, భూసారపు, ప్రకాశరావు, సుబ్బారావు, కృష్ణమూర్తి, భాస్కరరావు. శ్రీమతి టి. జి. కమలాదేవి నటించారు.


మురారి పాత్ర ధరించిన రావు గోపాలరావు యీ నాటకానికి దర్శకత్వపు బాధ్యత వహించారు. రవీ ఆర్ట్స థియేటర్స్ (శ్రీ సి. నాగభూషణం) వారి నిర్వహణలో యీ నాటకం జరిగింది. ఈ ప్రదర్శనలకు వ్యాఖ్యాత శ్రీ కె. జగ్గయ్య.

పద్మశ్రీ భానుమతి యీ కార్యక్రమాలను ప్రారంభిస్తూ 'కళాకారులు తమ కుటుంబాల రక్షణ కోసం కొంతమొత్తాన్ని నిలవ చేయ వలసిన అవసరం ఎంతో కలదనీ— అలా చేయనినాడు వారు ఎన్నో ఇబ్బందులకు గురి కావలసి వస్తుందనీ— కీర్తిశేషుల కుటుంబాల కోసం శ్రీ జైహింద్ సత్యం చేసిన— చేస్తున్న కృషి ఎంతో శ్లాఘనీయమనీ' ఉద్ఘాటించారు.

ప్రదర్శనల అనంతరం 'సత్యం నివేదిక'ను శ్రీ యస్. వి. రంగారావు చదివారు:"నా విజ్ఞాపనను ఆలించి మహామహులు, సంస్థలు తమ విరాళాలను అందజేశారు. ఇంతవరకూ విరాళాల ద్వారా వచ్చిన సొమ్ము రూ. 24,075 ఈ నాడు గేట్లు వద్ద టిక్కెట్లు అమ్మగా వసూలయిన డబ్బు రు. 1425. ప్రఖ్యాత తమిళ నటుడు శ్రీ ఎం. జి. రామచంద్రన్ విరాళంగా యిచ్చినది రు. 1500 లతో కలిపి వసూలైన మొత్తం 27,058 ఈ డబ్బు కీర్తిశేషులయిన ముగ్గురు కళాకారుల కుటుంబాలకూ సమానంగా పంచి పెట్టబడుతుంది. ఇందులో స్వర్గీయ శ్రీ అచ్యుతరావు కుమార్తె వివాహం జరుగవలసి ఉన్నందున ఆయన కుటుంబానికి చెందే మొత్తంలోంచి 4000 రూ. లు ఒకేసారి యివ్వబడుతవి. కస్తూరి శివరావు,



ప్రదర్శనను చూస్తున్న శ్రీయుతులు త్రివిక్రమరావు, యన్. టి. రామారావు, అక్కినేని నాగేశ్వరరావు.



సీతారామాంజనేయ పిక్చర్స్ వారి
సంగీతలక్ష్మి
కథ-స్క్రీన్‌ప్లే-దర్శకత్వం
నిర్మాతలు
గిడుతూరి సూర్యం · పి. నరసింగరావు · అమరా రామసుబ్బారావు
సంగీతం: యస్. రాజేశ్వరరావు
Roopkala
ఆంధ్ర/రాయల్ ఫిలిమ్స్/సీడెడ్/జయలక్ష్మి/నైజాం/యస్.యన్.పి.పి/మైసూర్/ఆర్.యస్.ఫిలిమ్స్
VIJAYA

'కీర్తి శేషులు...

క. వి. యస్. శర్మల కుటుంబాలకు నెలకు 150 రూ.ల చొప్పున, అచ్యుతరావు కుటుంబానికి 100 రూ.ల చొప్పున యివ్వబడుతుంది. ఇకనుంచి యీ నిధికీ నాకూ ఏ విధమయిన సంబంధమూ ఉండదు. ఈ డబ్బు బాధ్యత అంతా ఆంధ్రబ్యాంకు (త్యాగరాయనగర్) వారే వహిస్తారు. శ్రీ ఎం. జి. ఆర్. ఈ నాటి కార్యక్రమం జరుగుతున్న ఎన్. కె. టి. కళామండపం అద్దె, విద్యుచ్ఛక్తి ఖర్చులు, కుర్చీల అద్దె మొదలయినవన్నీ కూడ భరించారు. "కీర్తిశేషులు" నాటక ప్రదర్శనకు సంబంధించిన ఖర్చులన్నీ శ్రీ నాగభూషణం (రక్తకన్నీరు) పెట్టుకున్నారు. కరపత్రాలు, టిక్కెట్ల ముద్రణ, యితర అచ్చుపనులు, పెట్రోలు ఖర్చులు వగైరాలను జైహింద్ స్టూడియోస్ భరించింది." ఇవీ ఆ నివేదికలోని ముఖ్యవిషయాలు. "కృతజ్ఞతలు" శ్రీ గుమ్మడి వెంకటేశ్వరరావు చదివారు. తదనంతరం 'జనగణమన'తో సభ జయప్రదంగా ముగిసింది.

*　　*　　*

ఒక వ్యక్తివల్ల కాని— సంస్థలు చేబట్టవలసిన—కార్యాన్ని, సత్యం ఒక్కరుగా నిలచి మూడు మాసాలు రాత్రింబవళ్లు నిర్విరామమయిన కృషి చేసి దిగ్విజయంగా నిర్వహించగలగడం ఘనమయిన విషయం.

—మోహన్ కుమార్

చిత్రలహరి

దర్శకుడు శ్రీ జి. రామినీడు తీసే చిత్రాలు ఒక లక్ష్యాన్ని, ఒక ప్రయోజనాన్ని సంతరించుకొని ఉంటవి. దేశకాలమాన పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని, ప్రజల్లో చైతన్యం, ఉత్తేజం, భక్తిభావం పెంపొందించేందుకు ఆయన తన చిత్రాలను రూపొందిస్తూ ఉండడం హర్షనీయమూ గణనీయమూ కూడ. పల్నాటియుద్ధం, భక్తపోతన చిత్రాలు చూసిన వారికి శ్రీ రామినీడు దృక్పథం అర్థమవుతుంది.

ఇప్పుడు 'ఖడ్గతిక్కన' చారిత్రిక యితివృత్తాన్ని చలనచిత్రంగా మలచి ఆంధ్రులకు సమర్పించబోతున్నారు ఆయన. ఈ యితివృత్తం వెండితెర కెక్కడం ఇదే ప్రథమం. స్వర్గీయ గూడవల్లి రామబ్రహ్మంగారు నిర్మించిన "పల్నాటియుద్ధం' తర్వాత మళ్లీ ఇన్నేళ్లకు నాగేశ్వరరావు చారిత్రాత్మక చిత్రంలో నటించడం కూడ యిదే మొదసారి. ఈ చిత్రాన్ని స్వాతంత్ర్య దినోత్సవం (ఆగస్టు 15)నాడు హైదరాబాద్ లోని శ్రీసారధి స్టూడియోస్‌లో ఆరంభిస్తారు. ముఖ్యమంత్రి శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి కమెరా స్విచ్ ఆన్ చేస్తారు. మంత్రి శ్రీ చెంచురామానాయుడు శ్రీ కమలా ఫిలింస్ ('ఖడ్గతిక్కన' నిర్మించే సంస్థ) చిహ్నానికి ప్రారంభం చేస్తారు. మొదటి షాట్‌లో ఖడ్గతిక్కనగా నాగేశ్వరరావు పాల్గొంటారు. ఆ రోజు జరిగే షూటింగులో నాగేశ్వరరావుతో పాటు కవి తిక్కనగా జగ్గయ్య, శృంగార రాయభట్టుగా రేలంగి, ఆనందమోహినిగా నిర్మల (గూఢచారి116) కూడ ఉంటారు. మూడురోజుల పాటు కొనసాగే యీ షెడ్యూలులో ఒక పాట చిత్రీకరించడం కూడ జరుగుతుంది. మిగిలిన ముఖ్యభూమికలు జమున, యస్. వి. రంగారావు, హరనాథ్, ప్రభాకరరెడ్డి, హేమలత, జయంతి మొదలయిన వారు పోషిస్తారు.


కథ, మాటలు, పాటలు, పద్యాలు ఆరుద్ర, సంగీతం: ఎం. పూర్ణచంద్రరావు, కళ: జి. వి. సుబ్బారావు, వాలి, కెమెరా: సి. నాగేశ్వరరావు, కూర్పు: ఆర్. హనుమంతరావు, దర్శకత్వం: జి. రామినీడు నిర్వహించే యీ చిత్రానికి నిర్మాత పి. జాన్.

*　　*　　*

శ్రీ అక్కినేని నాగేశ్వరరావు గత నెల 27న మద్రాసు వచ్చారు. భరణివారి "గృహలక్ష్మి" చిత్రంలో ఆరురోజుల పాటు పని చేసి, తిరిగి ఆగస్టు 2న హైదరాబాద్‌కు వెళ్లారు.

*　　*　　*

క్విక్ మూవీస్‌ను తయారు చేయడమే గొప్ప అనుకుంటే వాటిని బాక్సాఫీసు చిత్రాలుగా రూపొందించడం మరింత ఘనమయిన విషయం. ఆ ఘనత దర్శక, నిర్మాత శ్రీ బి. విఠలాచార్యకు దక్కింది. ఆయన తీసే చిత్రాలు వ్యాపార దృష్టితో చాలా 'ప్లాన్డ్'గా ఉంటవి. అందుకే ఆయన చిత్రాలన్నీ విజయాన్ని సాధిస్తున్నవి. ఇటీవల విడుదలయిన విఠలాచార్య చిత్రం "అగ్గిబరాటా" యీ విషయాన్ని రుజూ చేస్తున్నది. ప్రస్తుతం ఆయన డి. వి. యస్. వారి "పిడుగు రాముడు" చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. అది ఆగస్టు మూడోవారానికి నిర్మాణం పూర్తి చేసుకుంటుంది. దీని వెంటనే మధుపిక్చర్స్ వారి జానపదం ప్రారంభించి రెండు మాసాల్లో పూర్తి చెయ్యాలనే సంకల్పంలో వున్నారు విఠలాచార్య. ఇది పూర్తి అయిన తదుపరి తన స్వంత చిత్రం "అగ్గి దొర" నిర్మాణం ప్రారంభిస్తారు. ఇవి యిలా వుండగా లక్ష్మీనారాయణ ఫిలింస్ అనే కొత్త సంస్థ శ్రీ విఠలాచార్య దర్శకత్వంలో ఒక



'మనసే మందిరం'లో నాగేశ్వరరావు, సావిత్రి




'ఫైసలా'లో నాయికగా ఎల్. విజయలక్ష్మి

జానపద చిత్రాన్ని నిర్మించనున్నది. ఇందులో యన్. టి. రామారావు, రాజనాల, రామకృష్ణ, మిక్కిలినేని, యస్. వి. రామదాసు ప్రభృతులు నటిస్తారు. "మధు పిక్చర్స్ చిత్రం అక్టోబరులో పూర్తి చేసి నవంబరు నుంచి అగ్గిదొర, లక్ష్మీనారాయణ ఫిలిమ్స్ వారి చిత్రం ప్రారంభిస్తాను" అన్నారు విఠలాచార్య ఆగస్టు మొదటి తేదీన "పిడుగు రాముడు" సెట్లో వారిని కలుసుకున్నపుడు.

* * *

ఆ రోజునే, ఆ సెట్లోనే నటి కుమారి రాజశ్రీ కనిపించింది. చిరునవ్వుతో పలకరించింది. "బొంబాయి నుంచి ఎప్పుడు వచ్చారు?" అని అడిగాను. "మొన్న (జూలై 30న) వచ్చానండీ. అంతా సక్రమంగానే జరిగింది" అన్నది. జేమ్స్ బాండ్ తరహాలో నటుడు దారాసింగ్ హిందీలో నిర్మిస్తున్న "నసీహత్" వర్ణచిత్రం ప్రారంభోత్సవంలో పాల్గొనేందుకు బొంబాయి వెళ్లివచ్చింది. ఆ చిత్రంలో ఆమె కథానాయికగా నటిస్తున్నది. "మళ్లీ రేపు అలెప్పీ వెళుతున్నానండీ!" అన్నది తిరిగి. అక్కడ నిర్మించబడుతున్న ఒక మళయాళ చిత్రంలో రాజశ్రీ ముఖ్యనటి. ఇదివరకు మూడు మళయాళ చిత్రాల్లో నటించింది. ఇప్పుడిది నాలుగవది. మళయాళ చిత్రాల్లో ఆమె పేరు "గ్రేసీ". దర్శక నిర్మాత శ్రీధర్ హిందీలో నిర్మించిన "ప్యార్‌కియేజా" వర్ణచిత్రంలో కూడ నాయిక భూమికధరించింది. ఆ చిత్రం గతనెల 29న విడుదలయి ఉత్తర భారతమంతటా విజయవంతంగా సాగుతున్నట్లు వార్తలు వస్తున్నవి.




Roopkala
సురేష్ ప్రొడక్షన్స్
శ్రీకృష్ణ తులాభారము
VIJAYA
దర్శకత్వం: K. కామేశ్వరరావు B.A., నిర్మాత: D. రామానాయుడు
విజయ

పద్మశ్రీ పిక్చర్స్

"ప్రేమించి చూడు" హాస్యరసభరిత చిత్రాన్ని అందించిన పద్మశ్రీ పిక్చర్స్ వారు యీసారి ఉదాత్త గంభీర కథా సంవిధానం గల చిత్రాన్ని వెండితెర కెక్కిస్తున్నారు. కథ, సంభాషణలు శ్రీ ముళ్లపూడి వెంకటరమణ రూపొందించారు. సావిత్రి, నాగేశ్వరరావు, జగ్గయ్య, గుమ్మడి ప్రభృతులు నటించే యీ చిత్రానికి ఆత్రేయ, దాశరథి గీతాలు వ్రాస్తున్నారు. సంగీతం: కె. వి. మహాదేవన్, కెమెరా: పి. ఎల్. రాయ్, దర్శకత్వం: పి. పుల్లయ్య నిర్వహిస్తారు. ఈ చిత్రాన్ని ఆగస్టు 27 నుంచి హైదరాబాద్ శ్రీ సారథి స్టూడియోలో ప్రారంభించనున్నట్లు నిర్మాత శ్రీ వి. వెంకటేశ్వర్లు చెప్పారు. శ్రీ సారథి స్టూడియో



'ఆస్తిపరులు' లో జయలలిత

యిప్పుడు శ్రీ కె. శ్రీనివాసరావు నిర్వహణ కింద ఉన్నది.

శ్రీనిలయం పిక్చర్స్

శ్రీనిలయం పిక్చర్స్‌వారి మొదటి చిత్రం యింతవరకు పదకొండు రీళ్లు పూర్తి చేసుకున్నది. ఇందులో కాంతారావు, చలం, కె. వి. యస్. శర్మ, సత్యనారాయణ, బాలకృష్ణ, అల్లురామలింగయ్య, పేకేటి, పద్మశ్రీ నాగయ్య (గెస్టు) శారద, వాసంతి, మీనాకుమారి, సూర్యకళ, నిర్మల నటిస్తున్నారు. రచన: వీటూరి, పాటలు: శ్రీ శ్రీ, ఆరుద్ర, వీటూరి, సంగీతం: శ్రీ నిత్యానంద్, కళ: రంగారావు, కూర్పు: జగదీష్, కెమెరా: వరదరాజన్, దర్శకత్వం: విజయా

చిత్రలహరి

రెడ్డి. తర్వాత షెడ్యూలు సెప్టెంబరు నుంచి ఆరంభమవుతుంది.

నవ్వులు - పువ్వులు

శ్రీ ఉదయభాస్కర్ పిక్చర్స్ వారి "నవ్వులు పువ్వులు" సాంఘిక చిత్రం శారదా స్టూడియోలో నిర్మించబడుతున్నది. ఇంతవరకు ఆరు రీళ్లు తయారయిన యీ చిత్రంలో జగ్గయ్య, కృష్ణకుమారి, చలం, రాజబాబు, రాజారెడ్డి, శారద, సుధామాల, అరుణ, రమ మొదలయిన

వారు నటిస్తున్నారు. రచన: రాజశ్రీ, సంగీతం: వి. యస్. రెడ్డి, దర్శకత్వం: పి. శ్రీనివాస్, నిర్మాత: టి.నాగమల్లేసురెడ్డి.

డాక్టర్ ఆనంద్

రవీంద్ర ఆర్ట్స ప్రొడక్షన్స్ వారి "డాక్టర్ ఆనంద్" చిత్రం ఆగస్టు మాసాంతానికిపూర్తి అవుతుంది. యన్. టి. రామారావు, అంజలీదేవి, కాంచన, రమణారెడ్డి, పద్మనాభం, చదలవాడ, రాజబాబు, సి. హెచ్. కృష్ణమూర్తి, రమాప్రభ, రత్నశ్రీ, బేబీ పద్మిని, మాస్టర్ ఆదినారాయణ నటిస్తున్న యీ చిత్రానికి వి. మధుసూదనరావు, ఆచార్య ఆత్రేయ కథ సమకూర్చారు. గీతాలు. ఆత్రేయ, దేవులపల్లి కృష్ణశాస్త్రి,

చిత్రలహరి

సి. నారాయణరెడ్డి, కొసరాజు, సంభాషణలు: ఆత్రేయ, సంగీతం: కె. వి. మహదేవన్, నృత్యాలు: హీరాలాల్, పసుమర్తి కృష్ణమూర్తి, కళ: యస్. కృష్ణారావు, కెమెరా: సి. నాగేశ్వరరావు, కూర్పు: సంజీవి, దర్శకత్వం: వి. మధుసూదనరావు, నిర్మాత: డి. వి. రెడ్డి. ఆంధ్రలో యీ చిత్రం రాయల్ ఫిలిమ్స్ ద్వారా విడుదల అవుతుంది.

* * *

మద్రాసు ఫిలింఫాన్స్ అసోసియేషన్ వారు నిర్వహించిన బాలెట్‌లో 1965కి హైదరాబాద్ మూవీస్‌వారు నిర్మించిన "కీలు బొమ్మలు" ఉత్తమ చిత్రంగా ఎన్నిక యింది. స్థానిక నెహ్రూ స్టేడియంలో గత నెల 19వ తేదీన జరిగిన బహుమతి ప్రదానోత్సవంలో ఆ చిత్రానికి రోలింగ్ షీల్డూ, స్పెషల్ అవార్డూ కేంద్ర సమాచార శాఖామంత్రి శ్రీ రాజబహదూర్ బహూకరించారు. —మోహన్‌కుమార్

బాలనర్తకి ముంగర చిట్టిలక్ష్మి

మద్రాసులోని ప్రెసెంటేషన్‌కాన్వెంట్‌లో చదువుకొంటున్న చిరంజీవి చిట్టిలక్ష్మి వయస్సు పది సంవత్సరాలు. చిన్నవయస్సులోనే నాట్యకళలో ప్రావీణ్యాన్ని సంపాదించి అమెరికాలో జరిగే అంతర్జాతీయ బాలల ఉత్సవంలో ప్రదర్శన లిచ్చేందుకు భారతదేశం నుంచి ఎన్నికైంది. సంగీతం, నాట్యకళలలో మంచి ప్రావీణ్యాన్ని సంపా



ముంగర చిట్టిలక్ష్మి

దించిన ఈ అమ్మాయి శ్రీ ముంగర ఇంద్రసేన్ గారి కుమార్తె. చిరంజీవి చిట్టిలక్ష్మి జూలై 14వ తేదీ అమెరికా వెళ్లింది. వెళ్ళే ముందు రాష్ట్రపతి ఎదుట ప్రదర్శన ఇచ్చి ఆయన ఆశీర్వాదాన్ని, తదితరుల అభిమానాన్ని అందుకుంది. నెలరోజుల పాటు అమెరికాలో ప్రదర్శన లిచ్చి జపాన్ మీదుగా తిరిగి ఇండియా చేరుకుంటుంది.

అహమ్మదాబాదు ఆంధ్ర సంఘం

అహమ్మదాబాదు ఆంధ్ర అసోసియేషన్ వారుయిటీవల ప్రదర్శించిన 'అలమేలుమంగావిలాసం' కూచిపూడి యక్షగాననృత్యానికి శ్రీమతి మృణాళినీబాయి అధ్యక్షత వహించారు. సూత్రధారుడుగా శ్రీ సి. ఆర్. ఆచార్య, అలమేలుమంగగా కుమారి సుధాదొరైస్వామి, భూదేవిగా కుమారిరంగమణి పాత్రపోషణ చేశారు. నేపథ్యగాయకుడు శ్రీ టి. కె. మూర్తి.

Edited, Printed and Published by S. Radhakrishna at the Andhra Patrika Press; 6 & 7, Thambu Chetty Street, Madras-1. Phone: Editorial 21747: Other depts: 29766. Chief Editor: S. Sambhu Prasad.

Regd. No. 4479 ANDHRA SACHITRA VARA PATRIKA

